

ఆంధ్రభూమి



సంపుటి: 30 · సంచిక: 229 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | శనివారం 19 జనవరి, 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం
ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం,
తిథి: శుద్ధ త్రయోదశి మ.3.36
నక్షత్రం: మృగశిర ఉ.8.41
వర్జ్యం: సా.4.40 నుండి 6.11 వరకు
విశేషాలు: శనిత్రయోదశి
దుర్ముహూర్తం: ఉ.6.00 నుండి 07.36 వరకు
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు

మార్చిలో ఎన్నికల షెడ్యూల్?

ఏప్రిల్, మేలో లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం
ఏర్పాట్లు చేస్తున్న కేంద్ర ఎన్నికల కమిషన్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 18: లోక్‌సభ ఎన్నికలను ఈ ఏడాది ఏప్రిల్, మేలో నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను మార్చ్ మొదటి వారంలో విడుదల చేయనున్నట్టు తెలిసింది. లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిసా, సిక్కిం, జమ్మూకాశ్మీర్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు ఏప్రిల్, మేలో ఆరు లేదా ఏడు దశల్లో జరుగవచ్చునని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు అనధికారికంగా చెబుతున్నారు. పార్లమెంటు బడ్జెట్-ఓట్‌ఆన్ అకౌంట్ సమావేశాలు ఈనెల 31న ప్రారంభమై ఫిబ్రవరి 13 తేదీ ముగిసే అవకాశాలున్నాయి. పార్లమెంటు ఓట్ ఆన్ అకౌంట్ సమావేశాలు ముగిసిన వెంటనే కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయనుంది. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులతో చర్చలు జరిపి ఓటర్ల జాబితాలను సిద్ధం చేయటం, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, భద్రతా దళాల మోహరింపు తదితర అంశాలపై చర్చలు జరపటం తెలిసిందే. కేంద్ర ఎన్నికల సంఘం ఆయా రాష్ట్రాల్లో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులను అవసరమున్నచోట బదిలీ చేసే ప్రక్రియను కూడా చేపట్టింది. గత ఎన్నికల సమయంలో ముఖ్య ఎన్నికల అధికారులుగా పనిచేసిన వారు అదే పదవిలో కొనసాగకుండా చూస్తోంది. అలాంటి వారి స్థానంలో కొత్త వారిని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులుగా నియమిస్తోంది. ఎన్నికలు పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగటం, పక్షపాతం వహించారనే మాట రాకుండా చూసేందుకే కేంద్ర ఎన్నికల సంఘం కొన్ని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులను తొలగించి వారి స్థానంలో కొత్త వారిని నియమిస్తోందని అంటున్నారు. ఇదిలా ఉంటే ఆయా రాష్ట్రాల్లో మూడు, అంతకంటే ఎక్కువ సంవత్సరాల నుండి ఒకే పదవిలో ఉన్న వారిని కూడా ఇతర పదవులలోకి బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం బిహార్‌తోపాటు మరికొన్ని రాష్ట్రాలను ఆదేశించింది.



ఆస్ట్రేలియాతో మెల్బోర్న్‌లో శుక్రవారం జరిగిన వన్డే ఇంటర్నేషనల్ మూడవ, చివరి మ్యాచ్‌లో సాధించిన ట్రోఫీతో టీమిండియా క్రికెటర్ల ఆనందోత్సాహం. ఆసిస్ గడ్డపై కోహ్లీ సేన తొలిసారిగా ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను చేజిక్కించుకుంది. ఇదే పర్యటనలో టెస్టు సిరీస్ కూడా సాధించి భారత్ సృష్టించింది.

కోల్‌కతాకు చంద్రబాబు

- నేటి బీజేపీయేతర పార్టీల ర్యాలీకి హాజరు
- మరోవిడత జాతీయ నేతలతో భేటీ

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 18: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో నిర్వహించే బీజేపీయేతర పార్టీల ర్యాలీలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం రాత్రి గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలోకోల్‌కతా బయల్దేరి వెళ్లారు. కోల్‌కతాలో శనివారం ర్యాలీలో పాల్గొనటంతో పాటు మరోవిడత జాతీయ నేతలతో భేటీ కావాలని నిర్ణయించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలు..రాష్ట్రాల హక్కుల సాధన నేపథ్యంలో నిర్వహించే ర్యాలీ ఏపీతో పాటు దేశ ప్రజలకు ఓ సంకేతాన్ని అందిస్తుందని భావిస్తున్నారు. గత ఏడాది కాలంగా బీజేపీ నేతల ఐక్య ఫ్రంట్ ఏర్పాటు కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తున్న చంద్రబాబు జనవరిలో జాతీయ నేతలతో కలసి ఆఖరి ధర్మపోరాట దీక్షను రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయాలని భావించారు. అయితే ఈ నెలాఖరున విశాఖపట్నంలో జయహో బీసీ సదస్సుతో పాటు మంత్రివర్గ సమావేశం, వచ్చేనెల మొదటి వారంలో శాసనసభ సమావేశాలు నిర్వహించనున్న నేపథ్యంలో ధర్మపోరాట దీక్షను ఫిబ్రవరికి వాయిదా వేయాలనే యోచనతో ఉన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ఏర్పాటయ్యే ఫెడరల్ ఫ్రంట్ తెరవెనుక - మిగతా 6వ పేజీలో

నామినేషన్ల గడువు ముగిసే వరకు


ఓటరు నమోదు

- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి గోపాలకృష్ణ ద్వివేది

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 18: రానున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసే వరకు కొత్త ఓటరు నమోదు, నకిలీ ఓట్ల తొలగింపు కార్యక్రమాలు కొనసాగుతాయని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి గోపాలకృష్ణ ద్వివేది వెల్లడించారు. సచివాలయం ఐదవ బ్లాక్‌లో శుక్రవారం రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి ఈనెల 11వ తేదీన రూపొందించిన తుది ఓటర్ల జాబితా హార్డ్‌డిస్క్‌ను ఆయా పార్టీల ప్రతినిధులకు ద్వివేది అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాతో పాటు ఇతర ఏ సమస్యలైనా తమ దృష్టికి తీసుకువస్తే, తక్షణమే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల సంఘం తీసుకుంటున్న నిర్ణయాలను ఎప్పటికప్పుడు అన్ని పార్టీలకు సమాచారం అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఈసీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అనంతరం సమస్యలపై పలువురు రాజకీయ నేతలు వివరించారు. సమావేశంలో టీడీపీ తరపున ఏపీఎస్ ఆర్టీసి చైర్మన్ వర్ల రామయ్య, వైసీపీ నాయకులు అంబటి రాంబాబు, మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ నేత సూరిబాబు, బీజేపీ నాయకులు జూపూడి రంగరాజు, సీపీఎం నాయకులు ఎం కృష్ణమూర్తి, వై వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనగామా





ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్యం

- ఎన్‌టీఆర్ వైద్యసేవ ఏప్రిల్ నుండి అమలు
- పేదరికం లేని సమాజమే టీడీపీ లక్ష్యం
- రూ.6 వేల కోట్లతో గోదావరి-పెన్నా మొదటి దశ పనులు ప్రారంభం
- విద్యుత్ చార్జీలు పెంచేది లేదు
- సత్తెనపల్లి సభలో సీఎం చంద్రబాబు

గుంటూరు, జనవరి 18: తెలుగువారి ఆత్మగౌరవం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి, యుగపురుషుడు, దివంగత నందమూరి తారకరామారావు అని, ఆ మహానేత ఆశయాల స్ఫూర్తితో పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుండి ఎన్‌టీఆర్ వైద్య సేవ కింద పేదలకు అందించే ఉచిత వైద్యం పరిమితిని 5 లక్షల రూపాయల వరకు పెంచనున్నట్లు ప్రకటించారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో నిర్మించిన తారకరామా సాగర్, ఎన్‌టీఆర్ గార్డెన్, వావిలాల గోపాలకృష్ణయ్య ఘాట్‌లను శుక్రవారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. అలాగే సత్తెనపల్లి చెరువులో ఏర్పాటు చేసిన 36 అడుగుల ఎన్‌టీఆర్ కాంస్య విగ్రహాన్ని చంద్రబాబు, స్పీకర్ కోడెల శివప్రసాదరావుతో కలిసి ఆవిష్కరించారు. 92 కోట్ల రూపాయలతో నిర్మించనున్న ఆర్వోబీకి, 35 కోట్ల రూపాయలతో నిర్మించనున్న కేంద్రీయ విద్యాలయానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ తెలుగుజాతికి గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్‌టీ రామారావు అని, ఆయన 23వ వర్ధంతిని పురస్కరించుకుని స్పీకర్ కోడెల శివప్రసాదరావు నేతృత్వంలో చేపట్టిన తారకరామ సాగర్ హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్‌లోని బుద్ధుని విగ్రహం తరహాలో చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఎన్‌టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకుని వృద్ధులు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు భరోసా కల్పించే క్రమంలో రాష్ట్రప్రభుత్వం పెన్షన్లను 2 వేల రూపాయలకు పెంచిందన్నారు. పేద ప్రజలకు రూపాయికే కిలోబియ్యం అందిస్తూ ఆహార భద్రతకు శ్రీకారం చుట్టామని, గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో పేదవారి సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్రంలో 27 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, విదేశీ విద్యకు 15 లక్షల వరకు ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు అండగా నిలవాలన్న సదుద్దేశంతో యువనేస్తం కార్యక్రమం కింద ఆర్థికసాయం అందించడంతో పాటు జీవితంలో స్థిరపడే వరకు అవసరమైన శిక్షణా కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి కుటుంబం కనీసం రూ.10 వేలు సంపాదించేలా రాష్ట్రప్రభుత్వం వారికి ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే గోదావరి, కృష్ణానదులను పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా అనుసంధానం చేశామని, తాజాగా 6 వేల కోట్ల రూపాయలతో గోదావరి, పెన్నా నదుల అనుసంధాన మొదటి దశ పనులను చేపట్టినట్లు వివరించారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 64 శాతం మేర పనులు పూర్తయ్యాయని, ఈ ఏడాది జూన్ నాటికి గ్రావిటీ ద్వారా నీరు అందిస్తామని స్పష్టంచేశారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని - మిగతా 6వ పేజీలో

కాంగ్రెస్ పొత్తుతో బాబు సాధించేదేమిటి!

- దేశాన్ని భ్రష్టుపట్టించిన కాంగ్రెస్
- విభజన చట్టం అంశాల్లో 80 శాతం అమలుచేశాం
- కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

ఆంధ్రభూమి బ్యూరో

కడప, జనవరి 18: దేశాన్ని అన్నిరకాలుగా భ్రష్టుపట్టించిన కాంగ్రెస్ పార్టీతో పొత్తుపెట్టుకుని చంద్రబాబునాయుడు ఈ రాష్ట్రానికి సాధించేదేమిటి అని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ కడప శాఖ ఆధ్వర్యంలో సీమ జిల్లాల పోలింగ్ కేంద్రాల పర్యవేక్షకుల సమావేశం శుక్రవారం కడప నగరంలోని కందుల ఎస్టేట్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగిస్తూ కాంగ్రెస్ పార్టీ దుర్మార్గాన్ని వ్యతిరేకిస్తూ ఎన్టీ రామారావు ప్రాంతీయ పార్టీ పెట్టి జాతీయ నాయకులుగా ఎదిగారన్నారు. అలాంటి నేత ఆశయాలను చంద్రబాబు పట్టించుకోకుండా అదే కాంగ్రెస్ పార్టీతో చేతులు కలపడం ఆ నేతకే అవమానమన్నారు. అవినీతి - మిగతా 6వ పేజీలో



బీజేపీ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

ఇంకా వంద రోజులే..

- ఇక ఎన్నికలకు సమాయత్తం కావాలి
- కలిసొచ్చే వారితోనే మన ప్రయాణం
- పార్టీకోసం కష్టపడాలి
- నాతో సహా ఇందులో ఎవరికీ మినహాయింపు లేదు
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 18: పెత్తందారీతనంపై పోరాటం చేయాలనేది ఎన్టీఆర్ ఆశయం.. ఆయన ఆశయ సాధనకు అనుగుణంగా ప్రస్తుతం కేంద్రంలో బీజేపీ, ప్రధాని నరేంద్రమోదీలకు వ్యతిరేకంగా ధర్మ పోరాటం సాగిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్ఘాటించారు. శుక్రవారం ఉండవల్లి నుంచి పార్టీ నేతలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మంత్రులు, ఎమ్మెల్యేలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం నిరంకుశత్వం అనేది బీజేపీ రూపంలో.. పెత్తందారీతనం మోదీ రూపంలో విజృంభిస్తున్నాయని వాటికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకా ఎన్నికలకు వంద రోజులే గడువు ఉంది.. ఈ ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. దేశ రాజకీయాల్లో కీలక భూమిక పోషించాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను నెరవేర్చటం, ఐదు కోట్ల మంది ప్రజల హక్కులను కాపాడటంలో అంతా కలసి అద్భుత బృందంగా పనిచేయాలని ఉద్బోధించారు. బృంద స్ఫూర్తితో అంతా కలసికట్టుగా పనిచేసి కలిసొచ్చే వాళ్లతో పయనించాలని స్పష్టం చేశారు. కుల, మత, ప్రాంతాల కతీతంగా పనిచేయాలన్నారు. ఒక వైపు ప్రజలు, మరోవైపు ప్రభుత్వం అన్ని వేదికలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఇందులో తనతో సహా ఎవరికీ మినహాయింపులేదని తేల్చి చెప్పారు. అంతా ఓ కుటుంబ సభ్యులం.. అందరికీ పార్టీ ద్వారానే పదవులు.. పార్టీకోసం ఏం చేసిందీ అనేది కాదు.. మనం పార్టీ కోసం ఏం చేయాలనేది ఆలోచించాల్సిన సమయం అన్నారు. కోల్‌కతాలో శనివారం జరిగే బీజేపీ యేతర పార్టీల ర్యాలీకి హాజరవుతున్నామని చెప్పారు. టీఆర్‌ఎస్, వైసీపీ తప్ప మిగిలిన పార్టీలు హాజరవుతాయని, దీన్ని బట్టి ఆ రెండు పార్టీల వైఖరి ఏమిటో ప్రజలకు తెలుస్తుందన్నారు. మోదీ అనుకూల కూటమి, మోదీ వ్యతిరేక కూటమి రెండే ఉన్నాయని టీఆర్‌ఎస్, వైసీపీ మోదీ అనుకూల కూటమిలో ఉన్నట్టే అన్నారు. స్టీల్ ప్లాంట్ ఇవ్వకుండా కడపలో బీజేపీ జాతీయ నేతల సభ దుర్మార్గమన్నారు. అసత్యాలతో దుష్ప్రచారం చేసేందుకే సభ ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు. వాటికి ప్రజలే సమాధానం చెప్తారని స్పష్టం చేశారు. తెలంగాణలో 26 కులాలను బీసీ జాబితా నుంచి తొలగించారు.. తూర్పు కాపు, కళింగ, గవర తదితర కులాలకు అన్యాయం చేసిందికాక ఇక్కడకొచ్చి బీసీల సంక్షేమం గురించి మాట్లాడటాన్ని ప్రజలు గమనిస్తున్నారని స్పష్టం చేశారు. నాలుగున్నరేళ్లలో అద్భుతమైన పనులు చేశాం.. చేయాల్సినవి ఇంకా ఉన్నాయి.. ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకున్నాం.. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాం.. భవిష్యత్‌పై ప్రజల్లో ఆశలను పెంచామన్నారు. జన్మభూమిలో వచ్చిన వినతులన్నీ పరిష్కరిస్తున్నామని తెలిపారు. 2019-24 అభివృద్ధి ప్రణాళిక రూపొందించామని ప్రతి గ్రామం, వార్డు సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలపై ఆరా తీశారు. ఎన్టీఆర్ ఓ స్ఫూర్తి ప్రదాత అన్నారు. ఆయన వర్ధంతి సంకల్పదినంగా పాటిస్తామన్నారు. ఈ సందర్భంగా అంతా దృఢసంకల్పం చేయాలని నిర్దేశించారు. సమాజ సేవల్లో చురుగ్గా పాల్గొనాలని, పేదల సేవకు ఎన్టీఆర్ స్ఫూర్తితో పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పేదరికంలేని సమాజం ఏర్పడాలన్నారు. ఆర్థిక అసమానతలు అదృశ్యం కావాలన్నారు. ఎన్టీఆర్ ఆదర్శాలకు పునరంకితం కావాలని మరోసారి పిలుపునిచ్చారు.

పలువురు ఐపీఎస్‌లకు పదోన్నతులు


విజయవాడ (క్రైం), జనవరి 18: రాష్ట్రంలో ఎనిమిది మంది ఐపీఎస్‌లకు పదోన్నతులు లభించాయి. పలువురు ఐజీలకు అదనపు డీజీలుగా.. అదేవిధంగా ఎస్పీలకు డిఐజిలుగా ప్రమోషన్ రావడంతో వారిని ప్రస్తుత స్థానం నుంచి మరోచోటికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా పదోన్నతులు పొందిన ఐపీఎస్ అధికారులు డీజీపీ ఆర్‌పి ఠాకూర్ నేతృత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి శుక్రవారం కృతజ్ఞతలు తెలియచేశారు. రాష్ట్ర శాంతి భద్రతల ఐజిగా పని చేస్తున్న రవి శంకర్ అదనపు డీజీగా పదోన్నతి లభించడంతో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న హరీష్‌కుమార్ గుప్తాకు స్థానచలనం కలిగింది. ఆర్గనైజేషన్ అండ్ కో ఆర్డినేషన్ ఐజిగా ఉన్న కుమార్ విశ్వజిత్‌కు అదనపు డీజీగా పదోన్నతి లభించింది. ఇక్కడే అడిషనల్ డీజీగా కొనసాగించడంతోపాటు స్టేట్ లెవల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర శాంతి భద్రతల ఐజి డాక్టర్ ఎ రవిశంకర్‌కు అదనపు డీజీగా పదోన్నతి లభించగా లా అండ్ ఆర్డర్ అదనపు డీజీగా నియమితులయ్యారు. ప్రస్తుతం లా అండ్ ఆర్డర్ అదనపు డీజీగా కొనసాగుతున్న హరీష్‌కుమార్ గుప్తాను ప్రొవిజినింగ్ అండ్ లాజిస్టిక్స్ అదనపు డీజీగా బదిలీ చేశారు. అదేవిధంగా ఐజి క్యాడర్‌లో రవాణాశాఖ కమిషనర్‌గా పని చేస్తున్న ఎన్ బాల సుబ్రహ్మణ్యంకు అదనపు డీజీగా పదోన్నతి లభించగా ఆయన్ను ఇక్కడే కొసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా హోంగార్డ్సు ఐజి కొనసాగుతున్న కృపానంద్ త్రిపాఠికి అదనపు డీజీగా పదోన్నతి లభించింది. ఇదిలావుండగా.. గ్రే హౌండ్స్ డిఐజి వినీత్ బ్రిజాల్‌కు ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పదోన్నతి లభించగా ఇక్కడే కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా విజయనగరం ఎస్పీ జి పాలరాజుకు డిఐజిగా పదోన్నతి లభించింది. ఈయన్ను విశాఖ రేంజ్ డిఐజిగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పని చేస్తున్న సిహెచ్ శ్రీకాంత్‌ను పోలీసు రాష్ట్ర ప్రధాన కార్యాలయంలోని టెక్నికల్ సర్వీసెస్ విభాగం డిఐజిగా బదిలీ చేశారు. శ్రీకాకుళం ఎస్పీ డాక్టర్ సీఎం త్రివిక్రమ వర్మకు డీఐజిగా పదోన్నతి లభించగా ఈయన్ను ఏలూరు రేంజ్ డిఐజిగా నియమించారు. కాగా ప్రస్తుతం ఏలూరు రేంజ్ డిఐజిగా పని చేస్తున్న టి రవికుమార్ మూర్తి జనవరి 31వ తేదీతో పదవి విరమణ చేయనున్నారు. ఈయన రిటైరయిన అనంతరం త్రివిక్రమ వర్మ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇదిలావుండగా.. డిప్యూటేషన్‌పై కేరళ క్యాడర్‌లో పని చేస్తున్న ఐపిఎస్ అధికారి ఎస్ శ్యామ్ సుందర్‌కు డిఐజిగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

జీవితాంతం ఒకటే కుల ధ్రువీకరణ పత్రం

★ 15 రోజుల్లో జీవో జారీ ★ కార్యదర్శులు, విభాగాధిపతుల సమావేశంలో సీఎస్ నిర్ణయం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 18: ప్రతి పౌరునికి కులం, పుట్టిన తేదీ, పుట్టిన ప్రదేశాలకు సంబంధించి జీవితాంతం మార్పులు ఏమీ ఉండవని, అందువల్ల ఒకసారి ఇచ్చిన ధ్రువపత్రం జీవితాంతం ఉపయోగపడేలా ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా నిర్ణయం తీసుకున్నారు. వెలగపూడి సచివాలయంలో 5వ బ్లాక్‌లోని కలెక్టర్ల కాన్ఫరెన్సు హాల్‌లో శుక్రవారం జరిగిన కార్యదర్శులు, విభాగాధిపతుల సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ధ్రువపత్రాల కోసం ప్రతి ఆరు నెలలకు ఒకసారి విద్యార్థులను, నిరుద్యోగులను, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను రెవెన్యూ, మీ-సేవ కేంద్రాల చుట్టూ తిప్పడం సరికాదన్నారు. ఒకసారి ఇచ్చిన సర్టిఫికెట్ జీవితాంతం ఉపయోగపడాలన్నారు. ఆదాయంలో మార్పు వచ్చే అవకాశం ఉంటుందని, కానీ అది కూడా నాలుగేళ్ల వరకూ ఉపయోగపడుతుందన్నారు. ఈ సర్టిఫికెట్ల విషయంలో అన్ని శాఖల సిబ్బందికి అవగాహన కల్పించాలని, విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఐటి సలహాదారు సత్యనారాయణతో చర్చించి, సీనియర్ అధికారుల సలహాలు తీసుకుని 15 రోజుల్లో జీవో రూపొందించాలని ఆర్టీజీఎస్ సీఈవో బాబు అహ్మద్‌కు సూచించారు. అవసరం లేని పోలీస్ వెరిఫికేషన్, ఇతర సర్టిఫికెట్లను ఆయా శాఖలతో చర్చించి తీసేయాలన్నారు. సర్టిఫికెట్ల విషయంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండాలన్నారు. ఈ నెల 21న మంత్రివర్గ సమావేశం ఉన్నందున అందుకు అవసరమైన ఫైళ్లను సిద్ధం చేయాలన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. యుటిలిటీ సర్టిఫికెట్లు సమర్పించకపోతే వెంటనే పంపించాలన్నారు. ఇప్పటికే పంపించిన వాటి పరిస్థితిని తెలుసుకోవాలన్నారు. కేంద్రం కొత్తగా చేపట్టిన పథకాల గురించి అధ్యయనం చేసి, నిధులను పూర్తి స్థాయిలో రాబట్టేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రతి శాఖ నుంచి కార్యదర్శి లేదా కమిషనర్ బాధ్యత వహించాలని, కుదరని పక్షంలో ఆ శాఖ ప్రతినిధిని కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో అధికారులకు, సిబ్బందికి శిక్షణ, హెచ్‌ఆర్ పాలసీ, నీటి సరఫరా, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పని భారం, లైసెన్సు మేనేజ్‌మెంట్ వ్యవస్థ, నాబార్డు నిధుల వినియోగం, వివిధ శాఖల్లో చెల్లించాల్సిన బిల్లులు, యువనేస్తం, గృహ నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. వివిధ శాఖల పనితీరు, ప్రజా స్పందనపై ఆర్టీజీఎస్ సీఈవో బాబు వివరించారు. ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతూ కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, యుసీలు, ఉపాధి హామీ పథకం తదితర అంశాల గురించి వివరించారు. ఫిబ్రవరి మొదటి వారంలో రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి ప్రయత్నిస్తానన్నారు. ఈ-ఆఫీస్, ఈ-ప్రగతి ద్వారా చాలా సమయం ఆదా అవుతోందని, ప్రజలకు కూడా కార్యాలయాల చుట్టూ తిరిగే పని తప్పిందన్నారు. ఈ-ఆఫీస్ నిర్వహణలో కార్యదర్శి శ్రీకాంత్‌ను అభినందించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు డి.సాంబశివరావు, జేఎస్వీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కార్యదర్శులు, విభాగాధిపతులతో సమీక్షిస్తున్న సీఎస్ పునేఠా



కుస్తీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నన్నయ వర్సిటీలో రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 18: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల కుస్తీ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తూర్పు గోదావరి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సహకారంతో మూడు రోజుల పాటు పోటీలు జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. 16, 19 సంవత్సరాల కేటగిరిల్లో బాల బాలికలకు పోటీలు నిర్వహించారు. బాలురకు ఫ్రీస్టైల్, గ్రీక్ రోమన్ స్టైల్‌లో 10 వెయిటేజీ కేటగిరిల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎంపికైన రాష్ట్ర జట్టును రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ జట్టుగా ఫిబ్రవరి 10 నుంచి 20వ తేదీ వరకు కటక్‌లో జరిగే ఆల్ ఇండియా రెజ్లింగ్ టోర్నమెంట్‌కు, జూనియర్స్ జట్టును ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు సూరత్‌లో జరిగే ఆల్ ఇండియా రెజ్లింగ్ టోర్నమెంట్‌కు పంపనున్నారు. ఐదవ రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు జరగడానికి చక్కని ఆతిథ్యం ఇచ్చిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఆంధ్రప్రదేశ్ కుస్తీ సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ జి ఎలీషాబాబు కృతజ్ఞతలు తెలిపారు.

ఓఎన్జీసీలో యంత్ర పరికరం అపహరణ

★ ప్రమాదకరమైనదని ప్రచారంతో కలకలం

★ సాధారణ పరికరమేనని ఓఎన్జీసీ వర్గాల స్పష్టీకరణ

★ కేసు నమోదు చేసిన పోలీసులు

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 18: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్సులో యంత్ర పరికరం అపహరణకు గురైన ఉదంతం శుక్రవారం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అపహరణకు గురైన పరికరాల విలువ సుమారు రూ.100 కోట్లని, ప్రమాదకరమైన రేడియో ధార్మిక ప్రభావాన్ని చూపేవని ఓ ఛానల్‌లో ప్రచారం జరగడమే ఈ కలకలానికి కారణం. అయితే ఈ విషయాన్ని ఓఎన్జీసీ వర్గాలు ఖండించాయి. పోయినది చమురు, గ్యాస్ అన్వేషణలో ఉపయోగించే యంత్ర పరికరమని ఓఎన్జీసీ శుక్రవారం రాత్రి విడుదలచేసిన ఒక ప్రకటనలో తెలిపింది. దీనిని 2013లో రూ.27 లక్షలకు కొనుగోలు చేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొంది. ఇది ఎటువంటి ప్రమాదకరమైన వస్తువు కాదని, ప్రజలు భయపడాల్సిన పనిలేదని ఆ ప్రకటన పేర్కొంది. ఈ మేరకు ఓఎన్జీసీ అధికారులు చేసిన ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీసులు కేసు నమోదుచేశారు.

పందులు, కుక్కల దాడిలో శిశువు మృతి

ఆడ శిశువు అని విడిచిన అజ్ఞాత మాతృమూర్తి

నెల్లిమర్ల, జనవరి 18: విజయనగరం జిల్లా నెల్లిమర్ల యాతవీధి ప్రాంతంలో శుక్రవారం హృదయ విదారక సంఘటన చోటుచేసుకుంది. అప్పుడే జన్మించిన ఆడ శిశువుని వీధి శివార్లలో గుర్తు తెలియని మాతృమూర్తి విడిచిపెట్టింది. స్థానికుల వివరాల మేరకు రామతీర్థం జంక్షన్ శ్రీనివాస థియేటర్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున అప్పుడే పుట్టిన ఆడ శిశువును కుక్కలు, పందులు విచక్షణా రహితంగా పీక్కుతినడాన్ని స్థానికులు గుర్తించారు. శిశువు రోదన విన్న స్థానికులు అక్కడికి వెళ్లి ఆ పందులను, కుక్కలను వెళ్ళగొట్టారు. శిశువు తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో నాయుడు కాలనీ మీదుగా ఇద్దరు మహిళలు ఈ శిశువు వదిలి వెళ్ళారని స్థానికులు చెబుతున్నారు. ఆ సమయంలో ఇద్దరు మహిళలు ముసుగు కప్పుకుని ఉండడంతో గుర్తించలేక పోయామన్నారు. శిశువు మృతదేహాన్ని స్థానికులు చంపావతి నదిలో ఖననం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటువంటి వారిపై కేసు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పడవ ప్రమాదాల నివారణకు చర్యలు

★ అధికారులకు సీఎస్ ఆదేశం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 18: కృష్ణా, గోదావరి నదులను దాటేందుకు ప్రమాద రహిత బోట్లను సమకూర్చుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అనిల్ చంద్ర పునేఠా ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో పడవ ప్రమాదాల నివారణ చర్యలపై సీఎస్ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన మూడు సంవత్సరాల్లో 67 మంది పడవ ప్రమాదాల్లో చనిపోయారన్నారు. ఇకపై ఈ ప్రమాదాలు జరుగకుండా రక్షణ ఉన్న అధునాతన బోట్లను కొనుగోలు చేసేలా చూడాలన్నారు. పడవలకు లైసెన్సుల జారీ, శిక్షణ తీసుకున్న చోదకుల నియామకం వంటి చర్యల ద్వారా ప్రమాదాలను చాలా వరకూ తగ్గించవచ్చన్నారు. ప్రయాణికులను తరలించే పడవలకు అనుమతులు తప్పనిసరి చేసి, గడువులోగా లైసెన్సులు ఇవ్వాలన్నారు. జలవనరులు, పోలీస్, అగ్నిమాపక, పంచాయతీరాజ్, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు రెండు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించుకుని, ప్రమాదాల నివారణపై సమీక్ష చేయాలని ఆదేశించారు.



పడవ ప్రమాదాల నివారణపై వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ పునేఠా

రెచ్చిపోయిన మావోయిస్టు మిలీషియా సభ్యులు

ఛత్తీస్‌గఢ్ వ్యాపారులను చితకబాది, వాహనానికి నిప్పు

చింతూరు, జనవరి 18: తూర్పు గోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో శుక్రవారం మావోయిస్టు మిలీషియా సభ్యులు రెచ్చిపోయారు. వారపు సంతకు వచ్చిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యాపారులను చితకబాది, వారికి చెందిన టాటా ఏస్ వాహనాన్ని దగ్ధంచేశారు. చింతూరు మండలం పేగ గ్రామంలో పట్టపగలే ఈ ఘాతుకం చోటుచేసుంది. వివరాలిలా ఉన్నాయి.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కుంట గ్రామానికి చెందిన ఇద్దరు వ్యాపారులు శుక్రవారం ఏడుగుర్రాలపల్లి గ్రామంలో జరిగే వారపు సంతకు వచ్చారు. పేగ గ్రామంలోని బస్టాండు ప్రాంగణంలో దుకాణం పెట్టి ప్రజల నుంచి అపరాలు, అటవీ ఉత్పత్తులను కొనుగోలుచేస్తున్నారు. ఉదయం 10.30 గంటల సమయంలో సమయంలో సుమారు 15మంది మావోయిస్టు మిలీషియా సభ్యులు వ్యాపారుల వద్దకు వచ్చి మాట్లాడినట్టు తెలిసింది. ఇరువర్గాల మధ్య ఏమి జరిగిందో తెలియదు కానీ వారంతా వ్యాపారుల చేతులు కట్టి, చితకబాదారు. పక్కనే ఉన్న టాటా ఏస్ వాహనం ఇంజన్ కింద తాటాకులు పర్చి నిప్పంటించడంతో వాహనం దగ్ధమయ్యింది. అలానే వ్యాపారుల వద్ద ఉన్న రూ.30వేలు నగదు లాక్కుని అడవిలోకి వెళ్లిపోయినట్టు తెలిసింది. ఈ సంఘటన జరిగిన తర్వాత వ్యాపారులు భయంతో వెంటనే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కుంట గ్రామానికి వెళ్లిపోయారు. చింతూరు పోలీసులు ఈ ఘటనపై విచారణ చేపడుతున్నారు.



మావోయిస్టు మిలీషియా సభ్యులు దగ్ధం చేసిన వాహనం

ఏసీబీ వలలో దేవరపల్లి ఏఎస్సై

ఫిర్యాదుదారు నుండి రూ.5వేలు లంచం

దేవరపల్లి, జనవరి 18: వ్యక్తిగత ఘర్షణకు సంబంధించిన కేసులో తగిన చర్యలు తీసుకోవడానికి ఫిర్యాదుదారు అయిన మహిళ నుండి రూ.5000 లంచం తీసుకుంటూ అసిస్టెంట్ సబ్-ఇన్స్పెక్టర్ (ఏఎస్సై) ఒకరు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలకు చిక్కారు. పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఏసీబీ ఏలూరు డీఎస్పీ వి గోపాలకృష్ణ కథనం ప్రకారం దేవరపల్లి మండలం దుద్దుకూరు గ్రామానికి చెందిన మడతల నాగమణికి అదే గ్రామానికి చెందిన ప్రత్తిపాటి వెంకట్రావుతో విభేదాలున్నాయి. వారిరువురూ కోర్టును కూడా ఆశ్రయించారు. గత మూడు సంవత్సరాలుగా కోర్టు వ్యవహారాలు నడుస్తున్నాయి. కాగా నాగమణి, వెంకట్రావు మధ్య ఇటీవల మళ్లీ ఘర్షణ జరిగింది. ఈ ఘటనపై గత నెలలో నాగమణి దేవరపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదుపై ఏఎస్సై (గతంలో రైటర్) పి సత్యనారాయణ కేసు నమోదు చేశారు. ఖర్చుల నిమిత్తం రెండు దఫాలుగా నాగమణి రూ.4000 రైటర్‌కు లంచం ఇచ్చింది. అయినా కేసు విషయం ఎటూ తేల్చలేదు.

చివరకు రూ.5000 లంచం ఇస్తే కేసు ఫైలు ముందుకు కదులుతుందని ఏఎస్సై సత్యనారాయణ నాగమణికి చెప్పారు. దీనితో నాగమణి ఏసీబి అధికార్లను ఆశ్రయించింది. బాధితురాలు నాగమణి శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో దేవరపల్లి పోలీసు స్టేషన్లో ఏఎస్సై సత్యనారాయణకు రూ.5000 లంచం ఇస్తుండగా వలపన్ని పట్టుకున్నామని ఏసీబీ డీఎస్పీ గోపాలకృష్ణ వివరించారు. ఏఎస్సై సత్యనారాయణను అదుపులోనికి తీసుకున్నామని ఆయన తెలిపారు.

తెలుగువారి గుండెల్లో కొలువైన ఎన్‌టీఆర్

★ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావ్ ★ మంత్రి లోకేష్‌తో కలిసి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నివాళి

గుంటూరు, జనవరి 18: తెలుగు ప్రజల గుండెల్లో కొలువైన యుగపురుషుడు దివంగత నందమూరి తారక రామారావు అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావ్ శ్లాఘించారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్‌టీఆర్ 23వ వర్ధంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరం, అన్నదానం, వైద్య శిబిరం, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో రక్తదానం చేసి మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకున్నారు. తొలుత పార్టీ కార్యాలయ ఆవరణలోని ఎన్‌టీఆర్ నిలువెత్తు విగ్రహానికి మంత్రులు లోకేష్, నక్కా ఆనందబాబు, రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావ్, జాతీయ పార్టీ కార్యాలయ కార్యదర్శి వివివి చౌదరి, ఎంపీ గల్లా జయదేవ్, పలువురు ఎమ్మెల్యేలు, నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి అంచలంచెలుగా, దేశ రాజకీయాలను ఎన్‌టిఆర్ శాసించారన్నారు. ఆయన జీవితం నేటియువతకు ఆదర్శనీయమన్నారు. మంత్రులు నారా లోకేష్, నక్కా ఆనందబాబు మాట్లాడుతూ సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లని ఎన్టీఆర్ విశ్వసించి, వెనుకబడిన వర్గాల వారికి రాజకీయ రిజర్వేషన్లు కల్పించి, దళిత, గిరిజన, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి అవిశ్రాంతంగా కృషి చేశారన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎఎస్ రామకృష్ణ, ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, ఫిలిప్ సి తోచర్, పార్టీ నేతలు జయరామిరెడ్డి, పంచుమర్తి అనూరాధ, గోనుగుంట్ల కోటేశ్వరరావు, షేక్ జానీమూన్, కూచిపూడి విజయ, దేవినేని అవినాష్, బోనబోయిన శ్రీనివాస యాదవ్, బ్రహ్మంచౌదరి, ఎవి రమణ, కోవెలమూడి రవీంద్ర, మద్దిరాల ఇమ్మానియేలు, దారపనేని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.





ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఏపీ టీడీపీ అధ్యక్షుడు కళావెంకట్రావ్, రక్తదానం చేసిన కార్యకర్తలకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న మంత్రి లోకేష్

ఈ స్నేహం...!

★ సీమలో గులాబీ బాసుకు వ్యతిరేకత!

★ జగన్ పట్టు నిలుపుకుంటాడా..

ఆంధ్రభూమి బ్యూరో

కర్నూలు, జనవరి 18: తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కేసీఆర్‌తో వైకాపా అధినేత జగన్ స్నేహం అంశం ప్రస్తుతం రాయలసీమలో చర్చనీయాంశంగా మారింది. వీరిద్దరి మైత్రి ఓట్ల పంట పండిస్తుందా అన్న చర్చ జోరందుకుంది. అయితే కేసీఆర్‌తో స్నేహం జగన్‌కు నష్టం చేకూరుస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆంధ్రులను అసభ్య పదజాలంతో దూషించిన కేసీఆర్‌ను సీమ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అదే విధంగా పోతిరెడ్డిపాడు, ఆర్డీఎస్, తెలంగాణలో కర్నూలు, అనంతపురం జిల్లాలను కలవకుండా అడ్డుకున్నారన్న కారణంగా రాయలసీమలోనూ కేసీఆర్‌కు వ్యతిరేక పవనాలు ఉన్నాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఈ క్రమంలో రాయలసీమలో బలంగా ఉన్న వైకాపా అధినేత జగన్ ఆ పట్టును నిలుపుకుంటారా అన్న ప్రశ్నకు కేసీఆర్‌తో జత కట్టడం జగన్‌కు నష్టమేనని వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్ర విభజన సమయంలో పోతిరెడ్డిపాడు, ఆర్డీఎస్, హంద్రీ-నీవా కాలువలు మూసివేయాలని డిమాండ్ చేసిన కేసీఆర్ విభజన చివరి దశలో కర్నూలు, అనంతపురం జిల్లాలను కలిపి తెలంగాణ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌కు సైతం వ్యతిరేకంగా మాట్లాడిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు జగన్‌తో ఏ రకంగా స్నేహం చేసినా ఆ ప్రభావం వైకాపాపై ఖచ్చితంగా ఉంటుందని వారంటున్నారు. గత కొంతకాలం వరకు బీజేపీతో లోపాయికారీ ఒప్పందం ఉందని ప్రతిపక్ష పార్టీలు ఎన్ని ఆరోపణలు చేసినా వైకాపాపై ప్రజల్లో పెద్దగా వ్యతిరేకత కనిపించలేదని, అయితే తాజాగా కేటీఆర్ జగన్ చర్చలు, భవిష్యత్తులో కలిసి ముందడుగు వేయడానికి సంకేతాలు ఇవ్వడం వంటి చర్యల నేపథ్యంలో జగన్ తీరుపై సీమ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వారంటున్నారు. విభజన సమయంలో ఏం మాట్లాడినా పట్టించుకోని జనం ఇటీవలి తెలంగాణ ఎన్నికల సమయంలో పోతిరెడ్డిపాడు, హంద్రీ-నీవా, ఆర్డీఎస్ వంటి ప్రాజెక్టులపై వ్యతిరేకత ప్రదర్శిస్తూ రాయలసీమ నేతలను వ్యక్తిగతంగా దూషించడాన్ని తప్పుబడుతున్నారని స్పష్టం చేస్తున్నారు. రాయలసీమకు వరప్రసాదినిగా ఉన్న మూడు ప్రధాన ప్రాజెక్టుల విషయంలో భవిష్యత్తులో కేసీఆర్, నరేంద్ర మోదీ ఒత్తిడితో జగన్ మెత్తబడితే రాయలసీమకు తీరని నష్టం జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. గతంలో చంద్రబాబు సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోకపోయినా గత నాలుగేళ్లలో వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి హంద్రీ-నీవా, ఎస్ఆర్‌బీసీ, గాలేరు-నగరి కాలువల నిర్మాణ పనులను దాదాపుగా పూర్తి చేయించగలిగారని వారు వెల్లడిస్తున్నారు. దీని వల్ల అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల్లోని రైతుల్లో ఆనందం కనిపిస్తోందని, అయితే ఈ నీరు చంద్రబాబుకు ఓట్ల రూపంలో ప్రతిఫలాన్ని ఇస్తుందో లేదో కానీ జగన్, కేసీఆర్ స్నేహంతో సీమ ప్రజలు చంద్రబాబుకు మద్దతు తెలిపే అవకాశాలు మెరుగవుతాయని వారంటున్నారు.

నరేంద్ర మోదీ, కేసీఆర్, జగన్ ఒకే నావలో పయనిస్తున్నారన్న టీడీపీ విమర్శలకు జగన్ బలాన్నివ్వడమే ఇందుకు కారణమని వారంటున్నారు. అంతేగాక భవిష్యత్తులో టీడీపీ, కాంగ్రెస్ జత కట్టి ఎన్నికల్లో పొత్తు కుదుర్చుకున్నా జగన్ ఆరోపణలకు మద్దతు లేకుండాపోతుందని వారంటున్నారు. జగన్, కేసీఆర్ స్నేహంతో బలంగా ఉన్న రాయలసీమలోనూ వైకాపా ఇబ్బందులు పడుతుందా లేక మరింత బలపడుతుందా అన్నది తేలాలంటే ఎన్నికల వరకు వేచిచూడాల్సిందే.

5, 8 తరగతులకూ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

డిటెన్షన్‌తో విద్యార్థులు నష్టపోకుండా చర్యలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 18: ప్రాథమిక , ప్రాథమికోన్నత పాఠశాలల్లో దేశవ్యాప్తంగా డిటెన్షన్ విధానాన్ని అమలుచేయాలని కేంద్రప్రభుత్వం ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టంలో సవరణలు చేసిన నేపథ్యంలో ఎక్కువ మంది బడిమానేయకుండా ప్రత్యామ్నాయ చర్యలనూ చేపట్టింది. ఐదోతరగతిలో , 8వ తరగతిలో పరీక్ష నిర్వహించిన అనంతరం ఎవరైతే ఫెయిల్ అయ్యారో వారందరికీ ఒక నెల రోజుల పాటు అదనపు శిక్షణ అందించి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది.

ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని ఎలాంటి విద్యా సంవత్సరం నష్టపోకుండానే తరువాతి తరగతికి ప్రవేశం కల్పిస్తారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకూ శుక్రవారం నాడు మార్గదర్శకాలను జారీ చేసింది. అయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు మాత్రం తొలి నుండి డిటెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను వచ్చే విద్యా సంవత్సరం నుండి అమలుచేస్తాయా లేక మరో ప్రత్యామ్నాయం చూస్తాయా అనేది ఎదురుచూడాలి.



భారీ కంటైనర్‌లో తరలిస్తున్న రూటర్

కేటీపీపీకి చేరిన జిందాల్ రూటర్

• ఫలించిన జెన్‌కో అధికారుల చర్చలు

• నేటి నుండి బిగింపు ప్రక్రియ పనులు ప్రారంభం

గణపురం, జనవరి 18: ఎట్టకేలకు నెల రోజుల అనంతరం జిందాల్ సంస్థతో జెన్‌కో ప్రతినిధుల చర్చలు సఫలం కావడంతో చత్తీస్‌గఢ్ నుండి జయశంకర్ జిల్లా గణపురం మండలం చెల్పూర్ సమీపంలో ఉన్న కేటీపీపీకి భారీ కంటైనర్‌లో శుక్రవారం రూటర్‌ను తెప్పించారు. కేటీపీపీ రెండవ దశ 600ల మెగావాట్ల ప్లాంటులో రూటర్ పగిలిపోయి సుమారు నెల రోజులు దాటింది. పగిలిన రూటర్ మరమ్మతుల కోసం జెన్‌కో అధికారులు హరిద్వార్‌కు తరలించిన విషయం తెలిసిందే. మరమ్మతు పనులకు కనీసం 3 నెలలు పట్టే అవకాశం ఉండటంతో జెన్‌కో యాజమాన్యం ప్రత్యామ్నాయంగా జిందాల్ సంస్థతో చర్చలు జరిపింది. ప్రస్తుతం చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌గఢ్‌లో విద్యుత్ ప్లాంటును జిందాల్ నిర్మిస్తోంది. వారి వద్ద అందుబాటులో ఉన్న రూటర్‌ను కేటీపీపీకి తెప్పించడంలో జెన్‌కో యాజమాన్యం సఫలీకృతమైంది. జిందాల్ సంస్థకు రూటర్‌తో ప్రస్తుతం అవసరం లేకపోవడంతో జెన్‌కోకు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. భారీ కంటైనర్‌లో 5 రోజుల క్రితం బయలుదేరిన రూటర్ శుక్రవారం ఉదయం కేటీపీపీకి చేరడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. శనివారం నుండి రూటర్ బిగింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. నెల రోజులుగా కొనసాగుతున్న వార్షిక మరమ్మతు పనుల్లో కూడా వేగం పెరగనుంది.

అమరావతికి స్టార్ హోటళ్లు


భూ కేటాయింపు పత్రాలు అందజేత ★ త్వరలో హ్యాపీనెస్ట్-2 ★ రూ. 448 కోట్లతో వెంకటపాలెంలో ఐటీ పార్క్

జ్యుడీషియల్ కాంప్లెక్స్‌కు అనుబంధంగా అడ్వకేట్ బ్లాక్ ★ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ★ సీఆర్డీఏ అధికారులతో సమీక్షా సమావేశం

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 18: రాజధానిలో ఎన్ని స్టార్ హోటళ్లు వస్తే అంత త్వరగా ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. విమానయాన సేవలు, కళాశాలలు, విద్యా సంస్థలు, హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్‌లే కొత్త నగరాల భవితవ్యాన్ని నిర్దేశించే వనరులన్నారు. శుక్రవారం సచివాలయంలో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) సమావేశం సందర్భంగా 7 ప్రముఖ ఫైవ్‌స్టార్ హోటళ్లకు భూ కేటాయింపు ధృవీకరణ లేఖలను ముఖ్యమంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణాలతో అమరావతికి పూర్తిస్థాయి రాజధాని కళ వస్తుందన్నారు. 7 హోటళ్లలో 5 ఫైవ్‌స్టార్, ఒక ఫోర్‌స్టార్, ఒక తీస్టార్ హోటల్ ఏర్పాటు కానున్నాయి. జీవీ ఎస్టేట్స్ అండ్ హోటల్స్ (వివెంటా), ఓం శ్రీ భావనసాయి ఎల్‌ఎల్‌పీ (వెస్ట్ ఇన్), సదరన్ ట్రావెల్స్ (మ్యారియెట్), కాంధారి హోటల్స్ (ఫార్చ్యూన్), ల్యాండ్‌బేస్ (జింజర్), స్వాగత్ మోటల్స్ (కీస్ సెలెక్ట్) ఇందులో ఉన్నాయి. దీంతో రాజధానిలో నిర్మాణమయ్యే హోటళ్ల సంఖ్య 16కు చేరుతుంది. అమరావతిలో కేంద్రీకృత శీతలీకరణ వ్యవస్థ (డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్)ను గ్యాస్, నీరు, విద్యుత్, రోడ్, ఫైబర్ గ్రిడ్ తరహాలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు అంశంపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన ఒక ఉన్నత స్థాయి బృందం గత కొద్దిరోజుల క్రితం పరిశీలనకు వచ్చి వెళ్లిందని సీఆర్డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ ముఖ్యమంత్రికి వివరించారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో ఉన్న దుబాయ్ మెట్రోలోనూ, అబుదాబీలోని ఇథిహాద్ టవర్స్‌లోనూ ఈ వ్యవస్థ ఇప్పటికే విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. 40వేల టన్నుల సామర్థ్యంతో అమరావతిలో ఏర్పాటు చేస్తున్న డీసీఎస్ ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద కేంద్రీకృత శీతలీకరణ వ్యవస్థగా నిలుస్తుందని చెప్పారు. రాజధానిలో జరుగుతున్న నిర్మాణ పనులను స్వయంగా వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున సందర్శకులు తరలివస్తున్నారని పురపాలకశాఖ మంత్రి పి నారాయణ తెలిపారు.

ప్రస్తుతం ఆర్టీసి బస్సుల్లో వస్తున్న వారి సంఖ్య రోజుకు నాలుగువేల వరకు ఉందని, మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. నిత్యం పదివేల మంది సందర్శనకు వీలుగా తగిన ఏర్పాట్లు చేశామని సీఆర్డీఏ కమిషనర్ ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. సందర్శకుల కోసం ఉద్ధండరాయునిపాలెంలో బేస్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సందర్శకులు స్నానాలు చేసేందుకు వీలుగా డ్రెస్సింగ్ రూమ్స్, భోజనాలు, అల్పాహారం అందిస్తున్నామని 36 మంది టూరిస్ట్ గైడ్స్‌ను నియమించామని వివరించారు. సందర్శకులకు



సీఆర్‌డీఏపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

గుర్తింపు కార్డులు కూడా మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. రాజధాని సందర్శకులకు దుర్గగుడి దర్శనం ఏర్పాట్లను పరిశీలిస్తున్నామని తెలిపారు.

రాజధానిలో జ్యుడీషియల్ కాంప్లెక్స్‌లో రూ 23.15 కోట్లతో అడ్వొకేట్ బ్లాక్ సిద్ధమవుతోందని జ్యుడీషియల్ కాంప్లెక్స్‌కు అనుబంధంగా 71,506 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ బ్లాక్‌ను నిర్మించాలని శుక్రవారం సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సీఆర్డీఏ సమావేశం నిర్ణయించింది. రూ 23.15 కోట్ల అంచనా వ్యయంతో జీ ప్లస్ ఫోర్ ఫ్లోర్లతో 140 క్యాబిన్లు, 16 షాపులుగా ఈ బ్లాక్ నిర్మాణాన్ని చేపట్టాలనే ప్రతిపాదనకు సమావేశం ఆమోదం తెలిపింది. ఒక్కో అంతస్తులో 35 చాంబర్ల చొప్పున నాలుగు అంతస్తుల్లో నిర్మాణాలు చేపడతారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో నాలుగు కార్యాలయాలు, ఆడిటోరియం, లైబ్రరీ, సర్వీస్ రూమ్స్, కామన్ లాబీ ఏరియా, టాయిలెట్లు నిర్మిస్తారు. దీనికి త్వరలో టెండర్లు పిలవనున్నారు. రాజధాని గ్రామమైన వెంకటపాలెంలో రూ 448 కోట్లతో ఐటీ పార్క్ నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదనకు సమావేశం ఆమోదం తెలిపింది. మొత్తం 14,21,000 చదరపు అడుగుల బిల్టప్ ఏరియాతో చేపట్టే ఐటీ పార్క్‌లో పదిలక్షల చదరపు అడుగుల వరకు ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి వస్తుంది. ఇందులో సగభాగం వాణిజ్యపరమైన కేటాయింపులు పోను, మిగిలిన సగ భాగాన్ని దిగ్గజ సంస్థల కోసం అందుబాటులో ఉంచుతామని సీఆర్డీఏ కమిషనర్ వివరించారు. ఒక సెల్లార్, 4 స్టిల్ట్స్, 15 పై అంతస్తులతో ఐటీ పార్క్ నిర్మాణాన్ని చేపట్టాలని ప్రతిపాదించామన్నారు. ఈ ప్రాజెక్ట్‌కు త్వరలో టెండర్లు పిలవనున్నారు. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ కోసం ఫోస్టర్ ప్లస్ పార్టనర్స్ ఇచ్చిన మాస్టర్ ప్లాన్‌కు సమావేశం ఆమోదం తెలిపింది.

హ్యాపీనెస్ట్ సిరీస్‌లో భాగంగా రెండవ ప్రాజెక్ట్ చేపట్టాలనే ప్రతిపాదనకు సమావేశం సానుకూలంగా స్పందించింది. మొత్తం 1704 ప్లాట్లు, 12 బ్లాక్‌లుగా ఈ ప్రాజెక్ట్ చేపట్టనున్నారు.

ఐనవోలు దగ్గర నిర్మాణం జరగనుంది. సెల్లార్, పోడియం, జీ ప్లస్ 23 విధానంలో దీన్ని చేపడతారు. రాజధానిలో 150 ఎకరాల్లో నిర్మాణ రంగ నగర నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రాథమికంగా సమావేశంలో అనుమతి లభించింది. దీన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తారు. నిర్మాణ ప్రణాళిక స్థాయి నుంచి నిర్మాణ సామగ్రి తయారీ వరకు కన్‌స్ట్రక్షన్ సిటీలో అందుబాటులో ఉంటాయి. నాణ్యతా నిర్ధారణ నియమావళిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధానకార్యదర్శి సతీష్ చంద్ర, సీఆర్డీఏ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రాంతాల్లో 1.75 లక్షల ఇళ్ల నిర్మాణం

ఆంధ్రభూమిబ్యూరో

అమరావతి, జనవరి 18: పేదలకు పెద్ద ఎత్తున గృహనిర్మాణం చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. గృహ నిర్మాణ కార్యక్రమాన్ని విజయవతంగా పూర్తిచేసేందుకు తగిన రుణాలందించి బ్యాంకర్లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ పేదల గృహనిర్మాణంపై శుక్రవారం సచివాలయంలో టిడ్కో, మెప్మా, పట్టణాభివృద్ధి శాఖ అధికారులు, బ్యాంకర్లతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. రుణాల మంజూరును వేగవంతం చేసేందుకు రాష్ట్రంలోని 44 బ్యాంక్‌లు ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్లను నియమించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. గృహ రుణాల మంజూరుపై బ్యాంకులు శ్రద్ధ వహించాలన్నారు. ఇప్పటి వరకు రుణాలు అందించేందుకు ముందుకురాని బ్యాంక్‌లు మూడురోజుల్లోగా వివరణ ఇవ్వాలని స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాల్లో వచ్చే నెలాఖరులోగా లక్షా 75వేల ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలనేది తమ లక్ష్యంగా చెప్పారు. ఇందుకు అనుగుణంగా బ్యాంకర్లు తగిన రుణాలు మంజూరు చేయాలని పునరుద్ఘాటించారు. రుణ మంజూరులో కఠినంగా వ్యవహరించకుండా, పేదల కోసం నిబంధనలు సరళీకరించుకోవాలని సూచించారు. సిబిల్ స్కోర్ విషయంలో పాలనాపరమైన అనుమతులు సంబంధిత బ్రాంచ్ స్థాయిలోనే ఉండాలన్నారు. రాష్ట్రంలో 4,82,597 మంది పట్టణ గృహ లబ్ధిదారులకు రుణాలివ్వాలని ఎస్‌ఎల్‌బీసీ లక్ష్యాన్ని నిర్దేశించుకోగా ఇప్పటి వరకు కేవలం 5,988 మందికి రూ 199.62 కోట్లు బ్యాంక్‌లు రుణంగా అందించాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుత పట్టణ గృహనిర్మాణ లబ్ధిదారులకు ప్రైవేట్, పబ్లిక్ సెక్టార్‌కు చెందిన 20 బ్యాంక్‌లు మాత్రమే రుణాలు ఇస్తున్నాయని తెలిపారు. పీఎంఏవై- ఎన్టీఆర్ నగర్ పథకం కింద 5,29,786 ఇళ్లు మంజూరు చేశామని, 4,60,492 ఇళ్లకు టెండర్లు ఖరారయ్యాయని, వీటిలో 3,60,365 ఇళ్ల నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. వీటిలో 1,42,061 శ్లాబ్‌ల నిర్మాణం పూర్తయ్యాయని, 75,284 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయని చెప్పారు. అలాగే ఎన్టీఆర్ పట్టణ గృహనిర్మాణ కింద 4,28,444 మంజూరు కాగా, 1,11,613 ఇళ్ల నిర్మాణం ప్రారంభమైందని, వీటిలో 73,752 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

ఆర్టీసీ యాజమాన్యం, యూనియన్ చర్చల్లో ప్రతిష్టంభన

★ 22న మరోసారి భేటీకి నిర్ణయం

విజయవాడ(సిటీ), జనవరి 18: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు వేతనాల సవరణ చేయాలని డిమాండ్ చేస్తున్న యూనియన్ నేతలతో యాజమాన్యం జరిపిన చర్చలు ఫలించలేదు. వేతన సవరణలో 20 శాతం మాత్రమే ఫిట్‌మెంట్ ఇస్తామని యాజమాన్యం ప్రతిపాదించగా యూనియన్ నేతలు అగీకరించలేదు. మరోసారి దీనిపై చర్చించేందుకు ఈనెల 22న సమావేశం కావాలని ఇరుపక్షాల ప్రతినిధులు నిర్ణయించారు. విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో శుక్రవారం ఆర్టీసీ గుర్తింపు యూనియన ఈయూ నాయకులు, ఆర్టీసీ ఎండి సురేంద్రబాబు నేతృత్వంలోని వేతన సవరణ కమిటీ సమావేశం జరిగింది. ఎట్టి పరిస్థితుల్లోనూ శ్రమకు తగ్గఫలితాన్ని లెక్కగట్టి 50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాల్సిందేనని యూనియన్ నేతలు పట్టుబట్టారు. ఫిట్‌మెంట్ ఇవ్వకపోతే సమ్మెకు వెనుకాడేది లేదని యూనియన్ నేతలు స్పష్టం చేశారు. ఈ రోజు జరిగిన చర్చలపై ప్రతిష్టంభన ఏర్పడటంతో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. ఇంతవరకు చర్చల ద్వారా అంగీకరించిన కారుణ్య నియామకాల ప్రక్రియను ఈ నెలాఖరు నుండి ప్రారంభిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. వీటితోపాటు కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్ వెంటనే చేస్తామని, డిజెంగేజ్‌లో ఉన్నవారిని ఉన్న ఖాళీలలో తీసుకుంటామని అంగీకరించారు. అంతేకాకుండా 2016 లీవ్ ఎన్‌కేష్‌మెంటును ఈనెల 24న చెల్లించేందుకు అంగీకరించారు. శనివారం అన్ని కార్మిక సంఘాలతో చర్చలు జరిపి, ఇప్పటి వరకు జరిగిన విషయాలను, యాజమాన్యం వైఖరి తదితర అంశాలపై చర్చించి అవసరమైతే ఐక్య ఉద్యమాన్ని ఏర్పాటు చేస్తామని ఈయూ నేత దామోదరరావు తెలిపారు.

శుక్రవారం జరిగిన చర్చల్లో యాజమాన్యం తరుపున ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ సురేంద్రబాబు, ఇడీలు కోటేశ్వరరావు, జయరావు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, రాఘవరెడ్డిలు, ఈయూ నేతలు వైవి రావు, పలిశెట్టి దామోదరరావు, యం హనుమంతరావుతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

రికార్డులు ఎన్‌ఐఏకు అప్పగించండి

జగన్‌పై హత్యాయత్నం కేసులో ఏపీ సిట్‌కు కోర్టు ఆదేశం

విజయవాడ (క్రైం), జనవరి 18: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు దర్యాప్తుకు సంబంధించి పూర్తి వివరాలను తక్షణమే జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ)కు అప్పగించాలని ఏపీ సిట్‌ను ప్రత్యేక న్యాయస్థానం ఆదేశించింది. విశాఖ ఎయిర్‌పోర్టులో జగన్‌పై కోడికత్తి దాడి ఘటనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చేతుల నుంచి విచారణ అధికారం ఎన్‌ఐఏకు బదిలీ అయిన విషయం తెలిసిందే. దీంతో రంగంలోకి దిగి ఎన్‌ఐఏ అధికారులు దర్యాప్తును ముమ్మరం చేసిన నేపథ్యంలో నిందితుడు శ్రీనివాసరావును కోర్టు అనుమతితో తమ కస్టడీకి తీసుకుని విచారించారు. దీనిలో భాగంగా సిట్ అధికారులు తమకు సహకరించడం లేదని, కేసుకు సంబంధించి దర్యాప్తు వివరాలు, డాక్యుమెంట్లు తమకు ఇవ్వడానికి నిరాకరిస్తున్నట్లు విజయవాడలోని ఎన్‌ఐఏ ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై వాదనలు విన్న న్యాయస్థానం.. సిట్ అధికారి నాగేశ్వరరావును ఆదేశిస్తూ సిట్ దర్యాప్తు వివరాలు మొత్తం ఎన్‌ఐఏకి వెంటనే అప్పగించాలని శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేసు రికార్డు, కేసు డైరీ, కేసు ప్రాపర్టీ తదితర వాటిని ఎన్‌ఐఏ చీఫ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌కు అప్పగించాలని సిట్ అధికారిగా నియమితులైన విశాఖపట్నం నార్త్ జోన్ ఏసీపి బివిఎస్ నాగేశ్వరరావును న్యాయమూర్తి ఆదేశించారు.



నిందితుడు శ్రీనివాసరావును సెంట్రల్ జైలుకు తీసుకువస్తున్న ఎన్‌ఐఏ అధికారులు

ఇదిలావుండగా.. ఈ కేసులో నిందితుడు శ్రీనివాసరావును ఎన్‌ఐఏ అధికారులు శుక్రవారం విజయవాడలోని ఎన్‌ఐఏ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. విచారణలో ఎన్‌ఐఏ అధికారులు ఇబ్బంది పెట్టారా అని జడ్జి ప్రశ్నించగా లేదని శ్రీనివాసరావు సమాధానమిచ్చారు. కాగా జైలులో తాను రాసుకున్న 22పేజీల పుస్తకాన్ని జైలు అధికారులు బలవంతంగా తీసుకున్నారని, అదేవిధంగా తనకు ప్రజలతో మాట్లాడే అవకాశం కల్పించాలని నిందితుడు న్యాయమూర్తిని కోరాడు. ఇదిలావుండగా.. విజయవాడ జైలులో తగిన సౌకర్యాలు లేకపోగా.. తగిన భద్రత లేదని, విశాఖ లేదా రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించాలని శ్రీనివాసరావు తరుఫున న్యాయవాది సలీమ్ కోర్టు దృష్టికి తీసుకువస్తూ పిటిషన్ దాఖలు చేశారు. అయితే అదేం లేదని శ్రీనివాసరావు జవాబిచ్చాడు. దీంతో న్యాయమూర్తి ప్రభుత్వ న్యాయవాదిని వివరణ కోరగా.. విజయవాడ జైలులో భద్రత కల్పించలేమని చెప్పారు. దీంతో నిందితుడుని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారు. కోర్టు ఆదేశాలతో శ్రీనివాసరావును విజయవాడ నుంచి రాజమండ్రి తరలించారు. ప్రస్తుతం నిందితుడు జ్యుడీషియల్ రిమాండులో కొనసాగుతున్నందున ఈనెల 25తో గడువు ముగియనుంది.

రెస్టారెంట్ ఓనర్ వాంగ్మూలం

విశాఖపట్నం: వైసీపీ అధినేత జగన్‌పై దాడి కేసుకు సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) విచారణ ముమ్మరం చేసింది. ఇప్పటికే పలువురిని విచారించిన ఎన్‌ఐఏ అధికారులు నిందితుడు జనిపల్లి శ్రీనివాస్ పనిచేస్తున్న రెస్టారెంట్ యజమాని హర్షవర్దన్ ప్రసాద్‌ను విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. విచారణకు హాజరు కావాలంటూ ఎన్‌ఐఏ జారీ చేసిన నోటీసుకు స్పందించిన హర్ష అనారోగ్యం కారణంగా ఎన్‌ఐఏ కార్యాలయానికి హాజరు కాలేనని చెప్పడంతో అధికారులు ఆయన్ను ఇంటి వద్దనే విచారించారు. ఇదే విషయాన్ని హర్ష 'ఆంధ్రభూమి' వద్ద ధ్రువీకరించారు. జరిగిన ఘటనకు సంబంధించి సాధారణ ప్రశ్నలే అడిగారని, ఎన్‌ఐఏ అధికారులు అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పినట్టు వెల్లడించారు. తన వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారని ఆయన తెలిపారు.

ప్రత్యేక హోదాకు జగన్ వెన్నుపోటు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 18: ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకహోదాకు ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుపోటు పొడిచారని పీసీసీ ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సంజీవని అని, ప్రత్యేక హోదా వస్తే పెట్టుబడులు వస్తాయని, తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందడమే కాకుండా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి లభిస్తాయని అటువంటి ప్రత్యేక హోదాకు జగన్ వెన్నుపోటు పొడవడం గర్హనీయమని తులసిరెడ్డి వ్యాఖ్యానించారు. ఆంధ్రరత్నభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఇవ్వాల్సింది, అమలు చేయాల్సింది కేంద్ర ప్రభుత్వమే అన్నారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇచ్చేదిలేదని, ఇది ముగిసిన అధ్యాయమని ఖరాఖండిగా చెప్పిందని, సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కూడా ఇదే చెప్పిందని, అటువంటి బీజేపీని జగన్ పల్లెత్తుమాట అనకపోవడమే కాకుండా, అదే బీజేపీతో లాలూచీ సంబంధం పెట్టుకోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావడం జగన్‌కు ఇష్టం లేదని దీనిని బట్టి తెలుస్తోందని తులసిరెడ్డి అన్నారు. కేంద్రంలో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు అనేది మిథ్య అని, ఎన్నికలు సమీపిస్తున్నప్పటికీ ఇప్పటికి కూడా ఫెడరల్ ఫ్రంట్‌కు రంగు, రుచి, రూపు, వాసన లేవని, ఏ పార్టీలు చేరుతాయి. చైర్మన్ ఎవరు, కన్వీనర్ ఎవరు, అజెండా ఏమిటి అన్న విషయాలపై స్పష్టత లేదన్నారు. ఫెడరల్ ఫ్రంట్ అని చెబుతున్న కేసీఆర్, ఆయన పార్టీ టీఆర్ఎస్ ప్రత్యేక హోదాకు సైంధవునిలా అడ్డుపడుతున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ప్రత్యేక హోదా కోసం పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం పెడితే, అది చర్చకు రాకుండా కొన్నాళ్ల పాటు టీఆర్ఎస్ అడ్డుపడిందని, చివరకు చర్చ జరిగి ఓటింగ్ జరగగా టీఆర్ఎస్ ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనలేదన్నారు. అటువంటి టీఆర్ఎస్ పార్టీతో జగన్ పార్టీ చెట్టాపట్టాల్ వేసుకొని తిరగడం శోచనీయమన్నారు. తెలంగాణ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ గెలిస్తే, ఆంధ్రప్రదేశ్‌లో వైకాపా నాయకులు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకుని సంబరాలు చేస్కోవడం విడ్డూరమని తులసీరెడ్డి అన్నారు.

తక్కువ ఆదాయం ఉన్న ఆలయాల బాధ్యత అర్చకులకే

★ త్వరలో జీవో విడుదల
★ పేద బ్రాహ్మణుల పింఛను పెంపుపై త్వరలో నిర్ణయం
★ ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి వెల్లడి



దేవదాయ శాఖపై సమీక్షిస్తున్న ఉపముఖ్య మంత్రి కేఈ కృష్ణమూర్తి

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 18: తక్కువ ఆదాయం కలిగిన ఆలయాల యాజమాన్య బాధ్యతలను సంబంధిత అర్చకులకు అప్పగించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి వెల్లడించారు. ఇందుకు సంబంధించి త్వరలో ఉత్తర్వులు జారీచేసేందుకు ముఖ్యమంత్రితో చర్చిస్తామన్నారు. సచివాలయంలో శుక్రవారం దేవదాయశాఖ, అనుబంధ సంస్థలతో కేఈ సమీక్ష జరిపారు. పేద బ్రాహ్మణులు, అర్చకులను ఆదుకునేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. పేద బ్రాహ్మణులతో పాటు విద్యార్థులను ఆదుకునేందుకు బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాలు రూపొందించామని కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనందసూర్య వివరించారు. సమావేశానికి దేవదాయశాఖ సలహాదారు రామకోటయ్య, హిందూ ధార్మిక పరిషత్ ట్రస్ట్ చైర్మన్ ప్రసాద్, వేదిక్ యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ సుదర్శన శర్మ, దేవదాయశాఖ అధికారులు హాజరయ్యారు. అనుబంధ సంస్థల ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ఉప ముఖ్యమంత్రి కేఈ ఆరా తీశారు. వృద్ధ బ్రాహ్మణులు, వితంతువులకు కార్పొరేషన్ ద్వారా వెయ్యి రూపాయలు పింఛను అందిస్తున్నామని వీరికి కూడా రెండువేలు పెంచేందుకు ప్రభుత్వం యోచిస్తోందని, ఈ విషయాన్ని త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వంశపారంపర్య అర్చకత్వంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలు రూపొందించేందుకు పభుత్వం కమిటీని నియమించిందన్నారు. సాధ్యమైనంత త్వరలో జీవో 76 విడుదల చేస్తామని ప్రకటించారు. తక్కువ ఆదాయం గల దేవాలయాల యాజమాన్య హక్కులు అర్చకులకు ఇచ్చే ఆలోచన ప్రభుత్వం పరిశీలనలో ఉందన్నారు. ఎంత ఆదాయం ఉన్న దేవాలయాలను ఈ పరిధిలోకి తీసుకురావాలనే విషయమై చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. దీనివల్ల అర్చకుల సమస్యలు దాదాపు తీరతాయన్నారు.

త్వరలో విజయవాడలో 46 మంది పీఠాధిపతులతో సమావేశం

దేవదాయశాఖ- అనుబంధ సంస్థల ద్వారా నిర్వహించే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శంఖారావం పేరుతో మ్యాగజైన్ ఆవిష్కరించనున్నట్లు హిందూ ధార్మిక పరిషత్ ట్రస్ట్ చైర్మన్ ప్రసాద్ ఉప ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. హైందవ సంస్కృతిని ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు హిందూ మత పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు త్వరలో విజయవాడలో 46 మంది పీఠాధిపతులతో సమావేశం నిర్వహిస్తున్నామని వివరించారు.

వేదిక్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా రాజధానితో పాటు ఇతర ప్రాంతాల్లో వేద విశ్వవిద్యాలయాల శాఖలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని వేదిక్ యూనివర్శిటీ ప్రిన్సిపాల్ సుదర్శన శర్మ ఉప ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. సమావేశంలో చర్చించిన అంశాలను నివేదిక రూపంలో సమర్పించాలని దేవదాయ అనుబంధ సంస్థల ప్రతినిధులను కేఈ ఆదేశించారు. సమావేశంలో అందజేసిన సూచనలు, ప్రతిపాదనలు ముఖ్యమంత్రికి వివరించి సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

'అభివృద్ధిని అడ్డుకోవడానికే ఫెడరల్ ఫ్రంట్'

కాకినాడ సిటీ, జనవరి 18: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకోవడానికే ఫెడరల్ ఫ్రంట్ పేరుతో కుట్రకు పాల్పడుతున్నారని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లా కేంద్రం కాకినాడ నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపకుడు ఎన్‌టి రామారావు 23వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన విలేఖర్ల సమావేశంలో మంత్రి యనమల మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి, కేసీఆర్, మోదీ కలసి రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం తన అధికారాలను అడ్డపెట్టుకుని చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రానికి అన్యాయం చేయాలనే ఉద్దేశ్యంతోనే మోడీతో కుమ్మక్కయ్యారని విమర్శించారు. కేసీఆర్ వ్యవహారాన్ని రాష్ట్ర ప్రజలు అర్ధం చేసుకోవాలని కోరారు. విభజన చట్టంలోని అంశాలను ఇప్పటికీ మోదీ ప్రభుత్వం అమలుచేయలేదని, కేవలం 5నుండి 6వేల కోట్లు రూపాయలు రాష్ట్రానికి ఇచ్చి ఇక తమపని అయిపోయినట్లు భావిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని ఇచ్చిన హామీ మేరకే ఆపార్టీతో కలసి పనిచేస్తున్నామని స్పష్టంచేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చేది లేదని చెప్పిన మోదీతో జగన్ ఏవిధంగా చేతులు కలుపుతారని యనమల ప్రశ్నించారు. ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చిన విధంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తే పరిశ్రమలు వచ్చి యువతకు ఉపాధి లభిస్తుందన్నారు.

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
శనివారం, 19 జనవరి 2019

ముంబయి తదితర ప్రదేశాలలోని 'నృత్యశాలల'- డ్యాన్స్ బార్స్-పై మహారాష్ట్ర ప్రభుత్వం విధించిన 'అతార్కిక' నియంత్రణలను సర్వోన్నత న్యాయస్థానం గురువారం తొలగించడం నవ నాగరిక జీవన వికాసానికి కొత్త ఊపు.. ఈ ఆంక్షల తొలగింపు వల్ల వ్యక్తమౌతున్న హర్షోల్లాస అనుభూతులకు ఎక్కువ ప్రచారం జరుగుతోంది. నొచ్చుకుంటున్న వారి మనోభావాలకు మాధ్యమాలలో పెద్దగా ఆవిష్కరణ లేదు. సర్వోన్నత న్యాయస్థానం వారి నిర్ణయం శిరోధార్యం కాబట్టి మహారాష్ట్ర అంతటా మాత్రమేకాక ఇతర ప్రాంతాలలో సైతం ఈ 'డ్యాన్స్ బార్'లు బస్తీబస్తీలో గల్లీగల్లీలో పుట్టుకొని రావడానికి అవకాశం ఏర్పడింది. 'డ్యాన్స్' అన్న ఆంగ్ల పదాన్ని భారతీయ భాషలలోని 'నృత్యం', 'నాట్యం' వంటి పదజాలంతో నిర్దేశించడం బహుశా కృతకమైన ప్రయత్నం. ఎందుకంటె 'భరత నాట్యం' 'కూచిపూడి' 'కథక్' 'కథక్కలీ' 'మణిపురీ' వంటి జాతీయ సంప్రదాయానికి అనుగుణమైన 'నృత్య ప్రదర్శన'లకు ముంబయి వంటి చోట్ల ఏర్పడిన 'డ్యాన్స్ బార్'లలో జరిగే తైతక్కలాటలకు సంబంధం లేదు. భారతీయ నృత్యాల పేర్లు సైతం వినని కళాకారులు, కళాకారిణులు ఈ 'బార్'లలో తైతక్కలాటలు ఆడుచుండడం ప్రచారమౌతున్న వాస్తవం. అందువల్ల 'బార్'లలోని 'డ్యాన్స్' అన్న పదాన్ని 'డ్యాన్స్' అని భారతీయ భాషలలో కూడ నిర్దేశించడం మేలు. మన జాతీయ సంస్కృతి శతాబ్దులుగా విదేశీయ వికృతులతో సంకరమైంది. అందువల్ల భారతీయ భాషలు కూడ ఆంగ్ల పదాలతో అలరారుచుండడం సహజమైపోయింది. కృత్రిమత్వమే 'సహజం'గా మారి ఉండడం అసలు సంగతి.. ఈ 'డ్యాన్సింగ్ బార్'లలో జరిగిపోతున్న కలాపాలను నియంత్రించడానికి, నిరోధించడానికి ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రయత్నించిన సమాచారం లేదు. ప్రయత్నించిన మహారాష్ట్ర ప్రభుత్వం చేతులు కాల్చుకుంది. నైతిక భ్రాంతులకు గురి అయిన మహారాష్ట్ర ప్రభుత్వం 'డ్యాన్సింగ్ బార్'లను నియంత్రించడానికి యత్నించిందని సర్వోన్నత న్యాయస్థానం వారు వ్యాఖ్యానించడం గుర్తుంచుకోదగిన అంశం. అందువల్ల ఈ తీర్పు 'డ్యాన్స్‌బార్'ల నిర్వాహకులకు, 'డ్యాన్స్' చేసే వారికి గొప్ప విజయం. ఈ 'బార్'లలో యథాపూర్వంగా ఇక తైతక్కలాటలు జరిగిపోవచ్చు. ఈ 'డ్యాన్స్' కేంద్రాలలో మద్యం కూడ సరఫరా చేసి తీరవలసిందేనని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు చెప్పింది..

మహారాష్ట్రలో 'డ్యాన్స్ బార్'లను మూసివేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం 2005 ఆగస్టులో ఆదేశించినప్పటి నుంచీ ఈ వివాదం న్యాయస్థానాల పరిశీలనలో ఉంది. మహారాష్ట్ర ప్రభుత్వం 'డ్యాన్స్‌బార్'లపై విధించిన నిషేధం చెల్లదని 2006 ఏప్రిల్‌లో బొంబాయి హైకోర్టు తీర్పుచెప్పడంతో 'డ్యాన్స్ బార్'లు మళ్లీ బార్లా తెరుచుకున్నాయి. 2013 జూలైలో సర్వోన్నత న్యాయస్థానం కూడ హైకోర్టు తీర్పును సమర్థించింది. 2014 ఏప్రిల్‌లో మహారాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'డ్యాన్స్ బార్'ల క్రమబద్ధీకరణ 'బిల్లు'ను శాసనసభ ఆమోదించడంతో మళ్లీ వివాదం మొదలైంది. 'డ్యాన్స్‌బార్'లలోను, హోటళ్లలోను, రెస్టారెంటులలోను, 'బార్'గదులలోను 'అశ్లీలకరమైన' డ్యాన్స్‌లు చేయరాదని నిర్దేశిస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం 2016 ఏప్రిల్‌లో మహిళా మర్యాదల పరిరక్షణ నియమావళిని రూపొందించింది. ఇప్పుడు 'డ్యాన్స్'లు చేయడానికి అనుమతినిచ్చిన సర్వోన్నత న్యాయస్థానం అశ్లీలమైన అసభ్యకరమైన 'డ్యాన్స్'లను మాత్రం చేయరాదని నిర్దేశించింది. ప్రేక్షకులలో మితిమీరిన లైంగిక కామోద్రేకం- ప్రూరియంట్ ఇంటరెస్ట్- కలుగడానికి దోహదం చేసే 'డ్యాన్స్'లు అశ్లీలమైనవని సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తులు ఏకె సిక్రీ, అశోక్ భూషణ్ స్పష్టం చేశారు. మహారాష్ట్ర చట్టంలోను, భారతీయ శిక్షాస్మృతిలోను ఇదే స్పష్టీకరణ ఉందని కూడ 'ధర్మాసనం' వారు నిర్ధారించారు. కానీ ఏ 'రెస్టా

'తైతక్కలాట' కాదు..!?

రెంట్'-బార్-లోని ఏ 'డ్యాన్స్' అశ్లీలకరమైనది? ఏది కాదు? అన్న నిర్ధారణ ఎప్పటికప్పుడు ఎలా జరుగుతుంది? ఈ 'డ్యాన్స్'లు జరిగేచోట్ల 'అంతర్గత చిత్రీకరణ' నిఘా- సీసీటీవీ సర్వైవలెన్స్- వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిబంధనను కూడ సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చడం 'డ్యాన్స్'లకు మరో విజయం.

ఇలా మన దేశంలో 'సరికొత్త జీవన సంప్రదాయాలు' కొలువు తీరుతుండడం నడచిపోతున్న నాగరికం. ఈ నాగరికాన్ని ప్రజలు స్వచ్ఛందంగా అలవర్చుకుంటున్నారా? లేక రాజ్యాంగ వ్యవస్థల 'నిర్వాహకులు' జనం నెత్తికెత్తుతున్నారా? అన్నది 'మీమాంస'.. జీవన సంస్కారాలకు అర్థాలు మారిపోతున్నాయి! ఏవి జాతీయ జీవన సంస్కారాలు? ఏవి విదేశాల నుంచి వ్యాపించిన వికృతులు? అన్నది కూడ 'మీమాంస'! భారతీయతకు సంబంధించిన ప్రతి అంశం గురించి, ప్రతి సంస్కారం గురించి, ప్రతి వికృతి గురించి, ప్రతి దృక్పథం గురించి, సమష్టి అనుభూతి సహజంగా ఏర్పడడం తరతరాల వాస్తవం. కానీ కొన్ని తరాల క్రితం అంకురించిన 'కృత్రిమ తత్వం' ప్రస్తుతం మహావృక్షమై శాఖోపశాఖలుగా విస్తరించింది. ఈ 'కృత్రిమతత్వం' జాతీయ సహజ సాంస్కృతిక తత్త్వాన్ని 'దిగమింగుతోంది! కృత్రిమ తత్వమే సహజతత్వమన్నది మరోవైపు కొనసాగుతున్న వాదం. కృత్రిమ సిద్ధాంతాలను నిర్మించినవారు సహజ జాతీయతత్త్వాన్ని నిరసిస్తున్నారు, అభిశంసిస్తున్నారు, నిందిస్తున్నారు, నిప్పులను కక్కుతున్నారు. దేవాలయాల గోడలపై సహస్రాబ్దుల నాటి శిల్పకళను నిరసించినవారు, ఎమ్ఎఫ్ హుస్సేన్ వంటి బౌద్ధిక బీభత్సకారుల చిత్రాలను 'గొప్ప కళాఖండాలని' ప్రశంసించడం సహజత్వాన్ని కృత్రిమతత్వం దిగమింగిన చరిత్రకు ఒక ఉదాహరణ మాత్రమే! దేవాలయాల కుడ్య చిత్రమాలికలలో అసభ్య శృంగారం ఉన్నదన్నది కృత్రిమ నాగరిక సిద్ధాంత రాద్ధాంతకారులు వినిపించిన వాదం. ఎమ్ఎఫ్ హుస్సేన్ కనిపించని దేవతల రూపాలను మాత్రమే కాదు, కనిపించే పరమదేవత భరతమాత రూపాన్ని సైతం వికృతంగా చిత్రీకరించి వెళ్లాడు. ఇక్కడ పుట్టిపెరిగి అన్ని సుఖాలు సదుపాయాలు అనుభవించి 'కతార్' దేశానికి పారిపోయాడు. సమష్టి జీవన సంస్కృతికి భిన్నమైన 'వికృతి' సమాంతరంగా కొనసాగుతుండడం యుగాల చరిత్ర. కానీ ఈ 'వికృతి'కి ఆదరణ లభించలేదు, అధికారిక జనం అంగీకరించలేదు. ఇప్పుడు కూడ 'వికృతి'కి అధికారిక ప్రజాదరణ లేదు. ఈ దేశంలోని ప్రజలు అధికారికులు జాతీయ జీవన సంస్కార సమాహారమైన 'సంస్కృతి'ని పాటిస్తున్నారు. 'వికృతి'ని ప్రేమిస్తున్న కృత్రిమ సిద్ధాంతకర్తల సంఖ్య చాలా తక్కువ! కానీ 'వికృతి'ని అధికారిక ప్రజలు అంగీకరింపజేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది, నేలను గిల్లి విల్లపడేలా ఆర్భాటం జరుగుతోంది. ఇదీ ప్రవర్ధమాన జాతీయ వైపరీత్యం. 'డ్యాన్స్ బార్'లో జరిగిపోతున్న తైతక్కలు ఈ వైపరీత్యంలో భాగం. ఈ తైతక్కల వల్ల మాతృమూర్తి స్వరూపమైన మహిళ అవమానానికి గురి అవుతోందన్న మహారాష్ట్ర ప్రభుత్వ వాదాన్ని సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. అందువల్ల 'డ్యాన్స్' చేయడం తైతక్క లాడడం కాదని, మహిళల గరిమకు భంగకరం కాదని అంగీకరించవలసిందే! సర్వోన్నత న్యాయ శాసనం శిరోధార్యం..

గతంలో దేవాలయాలలో మహిళలు నృత్యం చేసేవారు. సృష్టికర్త నుంచి సృష్టి వేరు కాదన్న సనాతన వాస్తవానికి అంటే శాశ్వత సత్యానికి ఈ నృత్యం ప్రతీక! సృష్టిలో భాగమయిన ప్రతి మానవుడు, ప్రతి జీవం, ప్రతి అణువు కూడ సృష్టికర్త ప్రతిరూపం. ఇది భారతీయ జీవనం. అందువల్లనే 'శివోభూత్వా శివం యజేత్'- శుభకర తత్త్వంగా మారి శుభకర తత్త్వాన్ని ఆరాధించాలి- అన్నది యుగయుగాల జాతీయ జీవనమైంది. ఈ భావంతోనే భారతీయుడు దేవుడికి 'నృత్యం దర్శయామి'- నాట్యం చూపిస్తున్నాను- అని చెప్పాడు, చెప్తున్నాడు. కానీ, ఇలా దేవుడికి నృత్యం చేసి చూపడం మహిళల మర్యాదకు భంగకరమని ప్రచారం జరిగింది. దేవాలయాలలో మహిళలు నృత్యం చేయడం ఆగిపోయింది. 'దేవుని ఎదుట నాట్యం చేయడం అశ్లీలం, అనుచితం' అన్నది నాగరికం అయింది. 'డ్యాన్స్'లను 'బార్'లలో చేయవచ్చునన్నది నాగరికం! సర్వోన్నత న్యాయస్థానం ఈ నాగరికాన్ని ఆమోదించినప్పుడు 'కాదని' ఎలా అనగలం? 'డ్యాన్సు'లు జరిగే చోట 'డాన్స్' కేంద్రాల ద్వారాల వద్ద 'సీసీటీవీ'లను ఏర్పాటు చేయరాదు. అలాచేస్తే 'ఏకాంత స్వేచ్ఛ'-ప్రైవసీ-కి భంగమట.. సార్వజనిక స్థలాలలో 'ఏకాంత అధికారం' ఏమిటన్నది సమాధానం లభించవలసిన ప్రశ్న.. 'డ్యాన్స్‌బార్'లలో మద్యం సరఫరా జరగకుండా నిరోధించడాన్ని కూడ సర్వోన్నత న్యాయస్థానం స్వస్తం చేసింది.. జాతీయ శాశ్వత వ్యవస్థలో రాజ్యాంగం వ్యవస్థ భాగం!! రాజ్యాంగం సమష్టి జన మానస ప్రతిబింబం.. అందువల్ల..!

రాని 'హోదా' కోసం రాద్ధాంతం ఎందుకు?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరించడంతో 'మరింత ఎక్కువ పవనసే' జనన్ తరహాలో నిరసన తెలుపుతున్న తెలుగుదేశం పార్టీ ఇప్పుడు రాజకీయంగా దాడి చేయడం ప్రారంభించింది. తిరుపతిలో జీవీఎల ఏపీ భాజపా అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణపై కొందరు దాడి చేయడం వంటి ఘటనలతో కేంద్రం, రాష్ట్రం మధ్య దూరం మరింత పెరిగింది. భాజపా, తెదేపా నాయకుల పరస్పర ఆరోపణలు కేంద్ర, రాష్ట్ర సంబంధాలను దెబ్బతీశాయి. ప్రజలను రెచ్చగొట్టే నేతలు పోలీసు బందోబస్తుతో భద్రంగానే వుంటారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఏ 'టర్న్' అయినా తీసుకుంటారు. అమాయక ప్రజలు మాత్రం కష్టాలకు తలలు పగలగొట్టుకుంటారు. ప్రస్తుతం ఏపీలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

రాష్ట్ర విభజన సమయంలో కేంద్రంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏపీ డిమాండ్ల గురించి చెప్పమంటే- సమైక్యత తప్ప మరోమాట లేదని మన రాజకీయ, ఉద్యోగ నేతలు భీష్మించుకున్నారు. హైదరాబాద్ నగర ఆదాయంలో వాటా కోసం ఆనాడే పట్టుబట్టి ఉంటే కేంద్ర ప్రభుత్వం అంగీకరించక తప్పేది కాదు. 2014 ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోదీ ఏపీకి బాసటగా నిలిచి, ఢిల్లీని మించిన రాజధాని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఐతే ఇది ఐదు, పది సంవత్సరాలలో పూర్తయ్యే ప్రక్రియ కాదు. భారీ నిర్మాణాలను పెరగడం చూస్తున్నారు. కేంద్ర నిధులైనా, రాష్ట్ర నిధులైనా ప్రతి పైసా మన ప్రజల పన్నుల సొమ్మే. వాటిని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, పేద ప్రజల అభ్యున్నతికి కూడ వెచ్చించాలి. అయితే, ప్రధాని మోదీ మోసం చేశాడని, దగా చేశాడని దుమ్మెత్తిపోయడం తగదు.

తెలుగు రాష్ట్రాల్లో విభజన నాటి క్లిష్ట పరిస్థితులు నేడు లేవు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తే ఎంతో వెనుకబడ్డ బిహార్, ఒడిశా వంటి రాష్ట్రాలతో



పాటు అభివృద్ధి చెందిన తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాలు సైతం అదే డిమాండ్ చేస్తాయి. ఆ రాష్ట్రాల డిమాండ్లను అంగీకరిస్తే కేంద్రం ఆదాయం తగ్గిపోయి కేంద్రం మిథ్యగా మిగులుతుంది. ఇప్పటికే పలు రాష్ట్రాలు పరిశ్రమల పేరుతో వేల ఎకరాలు భూములను, భారీగా రాయితీలిచ్చి చైనా వంటి శత్రుదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదు. ప్రత్యేక హోదా ఇవ్వకపోతే కొన్ని పార్టీలు ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడ్తాయి. ప్రత్యేక హోదా ఇచ్చిన నాగాలాండ్, మేఘాలయ, మిజోరాం, త్రిపుర వంటివి బాగా వెనుకబడిన గిరిజన సరిహద్దు రాష్ట్రాలు. వాటికి కృష్ణా, గుంటూరు జిల్లాలంత ఆదాయం కూడ వుండకపోవచ్చు. ఉద్యోగుల జీతాల కోసం కేంద్రంపై ఆధారపడే స్థితి ఆ రాష్ట్రాల్లో ఉన్నందున వాటితో మిగతా రాష్ట్రాలను పోల్చలేం.

14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు కేంద్రం తన ఆదాయాన్ని డెబ్బయ్ శాతం నుండి అరవై శాతానికి తగ్గించుకొని రాష్ట్రాల వాటాను 30 నుండి 40 శాతం వరకు పెంచామంటున్నది. ఫలితంగా తెలుగు రాష్ట్రాల ఆదాయం కూడ భారీగా పెరిగి వుంటుంది. అభివృద్ధిలోనూ తెలుగు రాష్ట్రాలు పోటీపోటీగా రెండంకెల వృద్ధితో దూసుకెళుతున్నాయి. ప్రత్యేక హోదాతో సంబంధం లేకుండా పరిశ్రమలు వెల్లువెత్తుతున్నాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నో సంక్షేమ పథకాలు, ప్రజలకు 'అడగని వరాల'తో'పాటు ఇంటింటికి నల్లా, నెట్, స్మార్ట్‌ఫోను హామీలతో, ప్రభుత్వోద్యోగులకు భారీ వేతనాలూ ఇస్తున్నట్లు నిత్యం పత్రికల్లో భారీ ప్రకటనలు గుప్పిస్తున్నారు. అభివృద్ధిలో తెలుగు రాష్ట్రాలు హిందీ రాష్ట్రాలను మించిపోతున్నాయని కొన్ని నివేదికలు తెలుపుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో లక్ష కోట్ల బడ్జెట్, నేడు రెండు రాష్ట్రాలకు కలిపి నాలుగు లక్షల కోట్లకు చేరువలో వుంది. కేంద్ర నిధులు పెరగటం, ప్రజలపై పన్నుల ఆదాయం పెరగటం వల్లే ఇది సాధ్యమైంది కదా!

ఇక, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెజారిటీ వచ్చే అవకాశం తక్కువే. కాంగ్రెస్ ప్రభుత్వం రాకుంటే హోదా ఇచ్చే అవకాశాలు లేనట్టే. ప్రాంతీయ పార్టీల ప్రాభవం పెరగటం, అవి ఏదో ఒక వంకతో పార్లమెంటులో నిత్యం రచ్చచేయటం జరుగుతోంది. ఏపీ రాజధానికి, పోలవరం ప్రాజెక్టుకు రాష్ట్రం కోరినంతగా నిధులను కేంద్రం తక్షణం ఇవ్వలేకపోవచ్చు. కొత్త రాష్ట్రమని ఎన్నో విద్యా సంస్థలను ఏపీకి మంజూరు చేశారు. ఇంతవరకు కేంద్రంలో ఏ ప్రభుత్వం కూడా రాష్ట్రాలకు అడిగినంతలా అన్ని ప్రాజెక్టులకు నిధులు ఇవ్వలేదు. రాష్ట్ర పాలకుల గురించే గాక, జనం దేశం గురించి, కేంద్రం గురించి కూడా ఆలోచించాలి. అమరావతి-అనంతపూర్ మధ్య ఎనిమిది లైన్ల రహదారి, కొత్త రాజధానికి కొత్త రైలుమార్గం, ఉక్కు ఫ్యాక్టరీ వంటివి వేల కోట్ల రూపాయల ఖర్చుతో కూడుకున్నవి. ఇవన్నీ వచ్చే లోక్‌సభ ఎన్నికల లోపు పూర్తి కావడం అసాధ్యం. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమున్నా ఇంతకంటే ఇచ్చేది కాదేమో!

ప్రస్తుత వాస్తవ పరిస్థితుల దృష్ట్యా ఏపీ ప్రభుత్వం, అన్ని రాజకీయ పక్షాలు ప్రత్యేక ప్యాకేజీలో మిగిలిన వాటి గురించి కేంద్రాన్ని డిమాండ్ చేస్తే సమంజసంగా వుంటుంది. కేంద్రం కూడా వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు మంజూరు చేసిన నిధులు తక్షణమే విడుదల చేయాల్సి ఉంది. రాయలసీమలోని గుంతకల్‌ను రైల్వే డివిజన్‌గా ప్రకటిస్తే వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. విభజన సమస్యలపై చొరవ తీసుకొని శీఘ్రమే పరిష్కరించి తెలుగు రాష్ట్రాల మధ్య కీచులాటలకు తెర దించేందుకు కేంద్రం ప్రయత్నించాలి.

-తిరుమలశెట్టి సాంబశివరావు

నేతాజీకి జడిసి.. బ్రిటన్ దొరల పలాయనం

మనమెంతో ఘనంగా ప్రచారం చేసుకొంటున్న 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమం ఒక విధంగా ఘోర వైఫల్యమే. ఆ ఉద్యమాన్ని బ్రిటిష్ వారు దారుణంగా అణచి వేశారు. ఎక్కువ కాలం ఆ పోరాటాన్ని మనం కొనసాగించలేక పోయాం. పోరాటాన్ని నిలిపి వేస్తున్నట్లు స్వయంగా గాంధీజీ ప్రకటించారు. ఇప్పట్లో ఇక స్వాతంత్య్రం వచ్చే అవకాశం లేదని నాటి నేతలు నిరాశకు గురయ్యారు. దీర్ఘకాలిక పోరాటం అవసరం అనే అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ వచ్చారు. అయితే, ఆ తర్వాత ఐదేళ్లకే మనం స్వాతంత్య్రం సాధించడం నాటి జాతీయ నాయకులకు ఒక విధంగా ఆశ్చర్యకర పరిణామమే. రెండో ప్రపంచ యుద్ధంలో బాగా దెబ్బ తిన్న బ్రిటిష్ వారు ఇంకా ఇక్కడ ఉండలేక వెళ్లిపోయారులే... అని ఆ జాతీయ నాయకులు సరిపెట్టుకొనే ప్రయత్నం చేశారు. అయితే క్విట్ ఇండియా ఉద్యమం వల్ల గాని, ఆ తర్వాత కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన పోరాటాల వల్ల గాని బ్రిటిష్ వారు వెళ్లలేదన్నది వాస్తవం. అందుకు నేతాజీ సుబాష్ చంద్రబోస్ మాత్రమే కారణం అని చెప్పవచ్చు. అప్పటికి ఆయన జీవించి ఉన్నారా? మరణించారా? అనే వాదనలు ఒక ప్రక్క కొనసాగుతున్నా అయన పేరే బ్రిటిష్ వారిని భయ భ్రాంతులకు గురిచేసింది. ఇంకా భారత్‌లో ఉంటె తమకు చావు తప్పదనే నిర్ణయానికి వచ్చి, ఒక విధంగా చెప్పాలంటే ఏకపక్షంగా వారు తోక ముడిచారని చెప్పక తప్పదు.

నేతాజీ ఏర్పాటు చేసిన ఆజాద్ హిందూ ఫౌజ్ ఉనికి బ్రిటిష్ వారికి ముచ్చెమటలు పుట్టించింది. ప్రముఖ మిలిటరీ చరిత్రకారుడు జీడీ బక్షీ తన గ్రంథంలో నేతాజీ ఏర్పాటు చేసిన భారత జాతీయ సైన్యం కారణంగానే స్వాతంత్య్రం వచ్చిందని స్పష్టం చేశారు. 1947లో భారతదేశానికి స్వాతంత్య్రం ప్రకటిస్తూ బ్రిటిష్ పార్లమెంట్‌లో అప్పటి బ్రిటన్ ప్రధాన మంత్రి క్లైమెంట్ అట్లీ తెలిపిన ఆసక్తికర వివరాలను బక్షీ ఉటంకించారు. 1956లో లేబర్ పార్టీ నాయకుడిగా భారత్ దేశ పర్యటనకు వచ్చిన అట్లీ కలకత్తాలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ జస్టిస్ పీబీ చక్రవర్తి వద్ద అతిథిగా రెండు రోజులు ఉన్నారు. ఆ సమయంలో కలకత్తా హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ చక్రవర్తి యాక్టింగ్ గవర్నర్‌గా వ్యవహరిస్తున్నారు. అట్లీతో జరిపిన సంభాషణ గురించి 'ఏ హిస్టరీ ఆఫ్ బెంగాల్' గ్రంథం రచించిన ఆర్‌సీ మజుందార్ పుస్తకం ప్రచురించిన ప్రచురణకర్తలకు ఒక లేఖ వ్రాసారు. అందులో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు....

'నేను యాక్టింగ్ గవర్నర్‌గా ఉన్న సమయంలో భారతదేశంలో బ్రిటిష్ పరిపాలనను ఉపసంహరించుకున్న లార్డ్ అట్లీ భారత దేశ పర్యటనలో కలకత్తాలోని గవర్నర్ ప్యాలస్ లో రెండు రోజులపాటు గడిపారు. ఆ సమయంలో బ్రిటిష్ వారు భారత్ నుండి తిరిగి వెళ్లడం గురించి నేను సుదీర్ఘంగా చర్చించాను.

గాంధీ చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమం నీరు కారిపోవడం, 1947లో వత్తిడి తెచ్చే పరిస్థితులు ఏమీ లేకపోయినా బ్రిటిష్ వారిని దేశం వదిలి వెళ్ళడానికి దారితీసిన పరిస్థితులు ఏమిటని నేను సూటిగా ప్రశ్నించాను. అందుకు సమాధానంగా అట్లీ పలు కారణలను ఉదహరించారు. ప్రధాన కారణం నేతాజీ



భారత దేశంలో నేతాజీకి చెందిన భారత జాతీయ సైన్యానికి చెందిన అధికారులపై రాజద్రోహం, చిత్ర హింసలు, హత్యలు వంటి నేరాలపై విచారణ చేపట్టారు. వరుసగా జరిగిన ఈ కోర్ట్ మార్షల్స్ ను ' రెడ్ ఫోర్డ్ ట్రైల్స్' అని పిలిచేవారు. ఈ విచారణ పట్ల బ్రిటిష్ సైన్యంలోని భారతీయులు ఆగ్రహంతో ఊగిపోతూ ఉండేవారు.

మిలిటరీ కార్యకలాపాల కారణంగా భారత సైన్యం, నావికాదళంలో బ్రిటిష్ రాణి పట్ల విధేయత బాగా పడిపోవడం అని చెప్పారు. నా సంభాషణల చివరిలో భారత్‌ను వదలాలన్న బ్రిటిష్ వారి నిర్ణయంపై గాంధీజీ ప్రభావం ఏ మేరకు ఉన్నదని అట్లీని అడిగాను. అట్లీ వ్యంగ్యంగా నవ్వుతూ- చాలా తక్కువ' అని మాత్రమే చెప్పారు.

ఈ సంచలన సంభాషణ మొదట 1982లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ హిస్టారికల్ రివ్యూ'లో రంజన్ బొర్రా ప్రచురించారు. అట్లీ మాటల ప్రాధాన్యత గురించి తెలుసుకోవాలంటే మనం 1945కు వెళ్ళాలి. అప్పుడే రెండో ప్రపంచ యుద్ధం ముగిసింది. బ్రిటన్, అమెరికాల నాయకత్వంలోని మిత్ర రాజ్యాలు విజయం సాధించాయి. జర్మనీ నియంత హిట్లర్ నాయకత్వంలోని రాజ్యాలు తుడిచి పెట్టుకు పోయాయి. దాంతో గెలుపొందిన వారు పరాజయం చెందిన సైనికులను శిక్షించాలని నిర్ణయించారు. భారత దేశంలో నేతాజీకి చెందిన భారత జాతీయ సైన్యానికి చెందిన అధికారులపై రాజద్రోహం, చిత్ర హింసలు, హత్యలు వంటి నేరాలపై విచారణ చేపట్టారు. వరుసగా జరిగిన ఈ కోర్ట్ మార్షల్స్ ను ' రెడ్ ఫోర్డ్ ట్రైల్స్' అని పిలిచేవారు. ఈ విచారణ పట్ల బ్రిటిష్ సైన్యంలోని భారతీయులు ఆగ్రహంతో ఊగిపోతూ ఉండేవారు. 1947 ఫిబ్రవరిలో రాయల్ ఇండియన్ నేవీకి చెందిన సుమారు 20 వేల మంది నావికులు బ్రిటిష్ ఎంపైర్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు జరిపారు.

నేతాజీ ఫోటోలు పెట్టుకొని ముంబై అంతా తిరుగుతూ బ్రిటిష్ వారిని జైహింద్ వంటి నినాదాలు ఇవ్వమని వత్తిడి చేశారు. తమ తోటలోని బ్రిటిష్ పతాకాలను చించి వేశారు. అటువంటి తిరుగుబాట్లు జబల్పూర్‌లోని రాయల్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన బ్రిటిష్ ఇండియన్ ఆర్మీ యూనిట్‌లలో కూడా జరిగాయి. వీటితో బ్రిటిష్ వారు భయభ్రాంతులకు గురయ్యారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 25 లక్షల మంది భారతీయ సైనికులను బ్రిటిష్ సైన్యం నుండి పంపి వేశారు.

భారతీయ సైనికులు ఆగ్రహంగా ఉన్నారని, తమ బ్రిటిష్ అధికారుల పట్ల విధేయత ప్రదర్శించడం లేదని 1946 నాటి బ్రిటిష్ మిలిటరీ నిఘా నివేదికలు తెలుపుతున్నాయి. ఈ పరిస్థితులలో బ్రిటిష్ వారు భారత్‌కు స్వాతంత్య్రం ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చారు. భారత దేశంలో తమ మనుగడ ప్రమాదంలో పడినదని గ్రహించారు. ఈ కథనాలు భారత స్వాతంత్య్ర పోరాటంలో మహాత్మా గాంధీ, నెహ్రూ వంటి నాయకులు చేసిన పోరాటాలను తక్కువ చేయడానికి మాత్రం కానేకాదు. అయితే- నిర్ణయాత్మక ప్రభావం చూపిన భారత జాతీయ సైన్యం గురించి మన పాఠ్య పుస్తకాలలో ఎక్కడా కనిపించదు. అందుకనే చారిత్రిక వాస్తవాలను దేశం ముందు ఉంచవలసి ఉంది.

అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించి భారత్ కు మాత్రమే కాకుండా మొత్తం ఆసియా, పసిఫిక్ లలో 60 దేశాలు స్వాతంత్య్రం పొందడానికి కారకులైన నేతాజీ పట్ల ఒక విధంగా మన దేశంలోని సమకాలిక నేతలు అడుగడుగునా అవమానకరంగా వ్యవహరించడం దురదృష్టకరం. దాదాపుగా వారంతా బ్రిటిష్ వారిని ప్రాధేయపడి, వారిని మెప్పించి, వత్తిడి తెచ్చి స్వాతంత్య్రం సాధించాలని ప్రయత్నాలు చేస్తున్న సమయంలో పోరాటమే మార్గమని మొదటిగా స్పష్టం చేయడమే కాదు, ఆ దిశలో నిర్ణయాత్మకంగా అడుగులు వేసిన ఏకైక నేత నేతాజీ. అందుకనే ఇప్పటికీ భారత ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ చరిత్రలో మహాత్మా గాంధీ స్వయంగా ఒక అభ్యర్థిని నిలబెడితే కాదని, ఎదురుగా నిలబడి గెలుపొందగలిగిన ధైర్యశాలి నేతాజీ. ఆయనకు లభిస్తున్న ప్రజాదరణ చూసిన మిగిలిన నేతలు ఈర్ష్య అసూయలతో చాల సంకుచితంగా వ్యవహరించారని చెప్పక తప్పదు. గాంధీ, నేతాజీ, పటేల్ వంటి వారు అనుసరిస్తున్న మితవాద విధానాల పట్ల నేతాజీ మాత్రమే కాదు మొత్తం దేశ ప్రజలు అందరూ ఆ సమయంలో అసహనం వ్యక్తం చేయసాగారు. సంపూర్ణ స్వరాజ్యం కోసం స్పష్టమైన పిలుపు ఇవ్వలేక పోయారు. భారత దేశానికి అధినివేశ ప్రతిపత్తి కల్పించాలని అంటూ రాజీ ధోరణి ప్రదర్శించారు. రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటిష్ వారికి మద్దతు ఇవ్వడం, ఖిలాఫత్ ఉద్యమానికి అండగా నిలబడటం చారిత్రకంగా జరిగిన పెద్ద పొరపాట్లను అంగీకరించాలి.

ఇటువంటి ధోరణులను మొదటి నుండి నేతాజీ నిరసించారు. భారత దేశానికి సంపూర్ణ స్వరాజ్యం తప్ప మరో మార్గం లేదని స్పష్టం చేస్తూ వచ్చారు. అందుకనే బ్రిటిష్ పాలకులు ఆయనను గృహ నిర్బంధంలో ఉంచితే, ఆయన తప్పించుకొని జర్మనీకి వెళ్లి పోయారు. అక్కడి నుండే- భారత్ నుండి బ్రిటిష్ వారిని పంపి వేయడం కోసం వ్యూహాత్మకంగా జర్మనీ, జపాన్ వంటి దేశాల మద్దతు కూడదీసుకునే ప్రయత్నం చేశారు. ఒక విదేశీ గడ్డ మీద నుండి ఒక సైన్యాన్ని సృష్టించడం ప్రపంచ చరిత్రలోనే అరుదైన సంఘటన. ఈ సందర్భంగా నేతాజీ ప్రదర్శించిన నైపుణ్యం, ధైర్య సాహసాలు ప్రపంచ చరిత్రలో ఎవ్వరితో పోల్చలేనివి. యుద్ధంలో జర్మనీ బలహీనమవుతున్న సమయంలో జపాన్‌కు వెళ్లి తన సైన్యాన్ని మన దేశ సరిహద్దు వరకు తీసుకు వచ్చారు. అయితే స్వతంత్ర భారత పాలకులు నేతాజీ పట్ల నేరమయ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ వచ్చారు. ఆయన విమాన ప్రమాదంలో మృతి చెందారంటే- అది ఏ విధంగా జరిగిందన్న ఆసక్తిని కూడా మన నేతలు కనపరచ లేదు. టోక్యోలోని ఒక దేవాలయం వద్ద ఆయన చితాభస్మం భద్రపరచబడి ఉన్నదంటే దానిని తీసుకొచ్చి, డీఎన్ఏ పరీక్ష చేసే ప్రయత్నం చేయనే లేదు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎటువంటి విమాన ప్రమాదం జరగ లేదని తైవాన్ ప్రభుత్వం అంటుంటే- అక్కడికి వెళ్లి వాస్తవాలను సేకరించే ప్రయత్నం జరగనే లేదు. ఒక మహాయోధుడి పట్ల ప్రపంచంలో మరే దేశం ఇంత నిర్లక్ష్యంగా, అవమానకరంగా వ్యవహరించి ఉండదు.

(ఈ నెల 23న సుభాష్‌చంద్ర బోస్ జయంతి)

-చలసాని నరేంద్ర

ఉత్తరాయణం

గమ్యం తప్పిన 'ఎయిర్ ఇండియా'

మన దేశంలో ఎయిర్ ఇండియా సంస్థ దశాబ్దాల తరబడి సేవలందించడం ఆనందదాయకమైన విషయం. కానీ, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ అనుచిత నిర్ణయాలతో పెను రుణభారాన్ని ఈ సంస్థ మోయలేక మోస్తోంది. అయిదారేళ్ళుగా మన దేశంలో విమానయానం మధ్యతరగతి వారికి కూడా అందుబాటులోనికి వచ్చింది. ప్రైవేటు విమానయాన సంస్థలతో పోటీ పడలేక- ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎయిర్ ఇండియా కూలబడిపోవడం బాధాకరం. రద్దీ మార్గాలలో కీలకమైన సమయాలను ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు కేటాయించడం, తక్కువ రద్దీ మార్గాలలో ఎయిర్ ఇండియా విమానాలను నడపడంతో సంస్థ ఆదాయ మార్గాలు మూసుకుపోయి ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. విదేశాలకు వెళ్ళే విమానాలలో ఎయిర్ ఇండియా విమానాల సంఖ్య ఎక్కువే అయినా ప్రైవేటు రంగ సంస్థలు చౌక ధరలకు ప్రయాణికులను ఆకర్షిస్తున్నాయి. ప్రయాణికులలో ఎయిర్ ఇండియా వాటా 14.6 శాతం నుండి 12 శాతానికి పడిపోయింది. దానితో రుణభారం కొండలా 52వేల కోట్ల రూపాయలకు పెరిగింది. దేశీయ, అంతర్జాతీయ గమ్యాలకు చేరే 140 విమానాలు, 27వేల మంది సిబ్బందితో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన ఈ సంస్థ ఇప్పుడు ఉద్యోగులకు వేతన బకాయిలతో ఈసురోమంటూ నడవడం గర్హనీయం. వేల కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించి నెలకొల్పిన ప్రభుత్వరంగ సంస్థ రాజకీయ స్వార్థప్రయోజనాలకు, నేతల అతి జోక్యానికి తోడు అధికారుల వైఫల్యం, సిబ్బంది పనితీరు అధమ స్థాయిలో వుండడంతో ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరు అవుతోంది. ఇప్పటికైనా ఈ సంస్థలో నష్టాలను పూడ్చడానికి మార్గాలను అన్వేషించడానికి బదులు- దీన్ని ప్రైవేటు పరం చేయడానికి ప్రయత్నిస్తుండడం 'రోగం ఒకటైతే చికిత్స వేరొకటి' అన్నట్టు ఉంది. ఈ సంస్థను ప్రైవేటీకరిద్దామన్నా 510 కోట్ల డాలర్ల రుణ భారాన్ని తలకెత్తుకోవడానికి ఏ భారీ పెట్టుబడి సంస్థ కూడా సిద్ధంగా లేదు. ఎయిర్ ఇండియాను వేధిస్తున్న మరొక సమస్య సిబిఐ నిర్వహిస్తున్న విచారణలో వెలుగుచూస్తున్న ఆసక్తికర అంశాలైన ఎయిర్ ఇండియా- ఇండియన్ ఎయిర్‌లైన్స్ సంస్థల విలీనంలో చోటుచేసుకున్న అవకతవకలు, 11 విమానాలు, లీజులోని లొసుగులు, లాభదాయక మార్గాలను ప్రైవేటు సంస్థలకు కేటాయించడం వంటివి. గతంలో ఎందరో ప్రభుత్వాధికారులు, ఎయిర్ ఇండియా సిబ్బంది ప్రైవేట్ విమానయానసంస్థలకు అనుకూలంగా పనిచేసి ఈ సంస్థకు నష్టం వాటిల్లేలా నిర్ణయాలు తీసుకోవడం, సంస్థపై రాజకీయ నాయకుల పెత్తనం, సిబ్బందిలో జవాబుదారీతనం కొరవడడం, ఎయిర్ ఇండియాకు దేశవ్యాప్తంగా వున్న భూములు, భవనాలు, ఇతర స్థిరాస్తులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా లేకపోవడం తెలిసిందే. ఒకప్పుడు ఎంతో ప్రతిష్టాత్మక సంస్థగా ఉన్న ఈ సంస్థ ఇపుడు కోలుకోలేని పరిస్థితికి దిగజారింది. సంస్థకు సంబంధించి దేశ విదేశాలలో వున్న ఆస్తులను బేరీజు వేయడానికి ప్రభుత్వం బిడ్‌లను ఆహ్వానించినా అధికారుల నిర్లిప్త వైఖరితో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు కనిపిస్తున్నాయి. పైలెట్లు, సిబ్బంది వేతన బకాయిలు 1200 కోట్ల మేరకు పోగుపడడం సంస్థ దుస్థితిని తెలుపకనే తెలుపుతోంది. కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్ రుణ ఉదంతంతో బ్యాంకులకు తల బొప్పికట్టి కొత్తగా రుణాలు ఇవ్వడానికి వెనుకాడడంతో ఈ సంస్థకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫలితంగా సేవలు పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడడం అత్యంత బాధాకరం. వేల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేయడం ప్రభుత్వాల అసమర్థతకు, అస్తవ్యస్త విధానాలకు ప్రత్యక్ష తార్కాణం. ఇప్పటికైనా ప్రభుత్వాలు పైపూతలు మాని గాయానికి అసలు చికిత్స చేసేందుకు నడుం బిగించాలి.

- సి.కనకదుర్గ, హైదరాబాద్

డ్రైవింగ్ లైసెన్సులు అందక ఇక్కట్లు

ప్రతి వాహన చోదకుడు తగిన ధ్రువీకరణ పత్రంతోపాటు డ్రైవింగ్ లైసెన్సును విధిగా ఉంచుకోవాలని మోటారు వాహనాల తనిఖీ అధికారులు చెబుతున్నారు. ఇది రోడ్డు భద్రతా నియమాలలో అతి ముఖ్యమైనదని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత 7 నెలలుగా వాహనాల రిజిస్ట్రేషన్ కార్డులు అందటం లేదు. 5 నెలలుగా డ్రైవింగ్ లైసెన్సుల కోసం ఆర్‌టీఓ కార్యాలయాల చుట్టూ కాళ్ళు అరిగేలా వాహనదారులు తిరుగుతున్నారు. తెలంగాణలోని 31 జిల్లాల్లో డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్ కార్డులు అన్ని పనిదినాల్లో జారీ చేయడం ఆపివేశారు. ఆగస్టునుండి కొత్త డ్రైవింగ్ లైసెన్సుల జారీ నిలిపివేశారు. ఆన్‌లైన్‌లో కార్డులను వాహనదారులు పొందినప్పటికీ వాహనాల తనిఖీ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులకు చూపెట్టడానికి ఒరిజినల్ కార్డులు లేకపోవడంతో చాలామంది అసహనానికి గురి అవుతున్నారు. కొందరు మోటార్ వాహనాల ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ పోలీసులు ఆన్‌లైన్ కార్డులు చూపిస్తే వదిలివేస్తున్నారు. మరికొందరు ఒరిజినల్స్ చూపాలని అడుగుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్న సమయంలో మొబైల్‌లో వెబ్‌సైట్ కనెక్టు కాకపోతే తమ జేబులు ఖాళీ కావటం తప్పటం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ కార్డు ఓపెన్ కాకపోతే జరిమానాలు చెల్లించవలసి వస్తోంది. కరీంనగర్ జిల్లాలో 7 ఆర్టీఏ కార్యాలయాల్లో దాదాపు 46వేల కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. కార్డుల కాంట్రాక్టు పొందిన వారు డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్ లైసెన్సులను ప్రింట్ చేయడంలో జాప్యం చేయడంతో వాహనదారులు ఇబ్బందుల పాలవుతున్నారు. ప్రతి పనిని కంప్యూటర్ ద్వారానే చేస్తారు. రోజూ ఎన్ని వేల కార్డులనైనా ప్రింట్ చేసే అవకాశం ఉంది. కానీ, వాహనదారులు చేయని తప్పుకు శిక్ష అనుభవిస్తున్నారు. నేటి ఇంటర్నెట్ యుగంలో డ్రైవింగ్ లైసెన్సుల జారీ పట్ల ఇంత జాప్యం విచారకరం.

- రావుల లావణ్య రాజేశం, కరీంనగర్

గందరగోళంలో బ్రెగ్జిట్

యూరోపియన్ సమాఖ్య నుండి వైదొలగాలని నిర్ణయించుకున్న బ్రిటన్‌కు ఆ ముహూర్తం దగ్గర పడుతున్నా గందరగోళ పరిస్థితులు తప్పడం లేదు. బ్రిటన్ ప్రధాని థెరెసా మే ప్రతిపాదించిన విధి విధానాల ఒప్పందం పార్లమెంటులో ఆ దేశ చరిత్రలోనే ఎన్నడూ లేనంత భారీ పరాజయాన్ని పొందింది. చట్టసభలో సభ్యులు ఆ ఒప్పందాన్ని తిరస్కరించి ప్రధానికి గుణపాఠం చెప్పారు. అయితే, ఆమెపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని ఓడించి మద్దతు ప్రకటించారు. ముందురోజు ఆమె విధానాలను చెత్తబుట్టలోకి పంపి, రెండో రోజు ఆమె గౌరవాన్ని కాపాడారు. లేదంటే ఆమె రాజీనామా చెయ్యాల్సి వచ్చేది. ఇప్పుడు తిరస్కరించిన ఒప్పందం స్థానే ప్రత్యామ్నాయ ఒప్పందం పార్లమెంటులో ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. అన్ని కార్యక్రమాలు మార్చి 29లోగా జరిగితే ఆ రోజునుండి సమాఖ్య నుండి బ్రిటన్ విడిపోతుంది. అందరికీ ఆమోదయోగ్యమైన ఒప్పం దం సిద్ధం కాకపోతే, ఏ ఒప్పందం లేని బ్రెగ్జిట్ వచ్చే ప్రమాదముంది. అప్పుడు బ్రిటన్ ఉన్న పళంగా విడిపోవడంవల్ల నష్టపోయే ప్రమాదముంది. ఆ స్థితి రాకూడదంటే విడాకుల ముహూర్తాన్ని వాయిదా వెయ్యమని అడగడం కానీ లేదా సమాఖ్యలో కొనసాగుతామంటూ, అందుకు తగ్గట్టు ఆర్టికల్ 50 అమలుని వెనక్కి తీసుకోవడం కానీ ఆ దేశం చెయ్యాలి. సమాఖ్య వద్దంటూ ఇంతదూరం వచ్చాక అలా చెయ్యడం సబబేనా? అన్నది ఒక అనుమానం, ఒక అవమానం. లేదా ఎటూ తెగని ఐర్లాండ్ సరిహద్దు వివాదాన్ని అధిగమిస్తూ కస్టమ్స్ విషయంలో సమాఖ్యతో కలిసే ఉండడం లాంటి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవడం అవసరం. ప్రస్తుతానికైతే బ్రిటన్‌కు, ముఖ్యంగా ప్రధానికి ఇరకాటం, గందరగోళం తప్పదు. యూరప్‌లో రాజకీయ, ఆర్థిక, సామాజిక మార్పుల ప్రభావం అన్ని దేశాలపై ఉంటుంది కనుక అక్కడి పరిస్థితులు చక్కబడాలని ఆశిద్దాం.

- డా. డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

జైట్లీ.. తప్పుకో

కేంద్ర మాజీ మంత్రి చిదంబరం డిమాండ్

❖ ఒక్కో విమానానికి 25 మిలియన్ యూరోలు అధికంగా చెల్లింపు

❖ రాఫెల్ ఒప్పందంపై ధ్వజమెత్తిన కాంగ్రెస్ సీనియర్ నేత

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 18: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఒక్కో రాఫెల్ యుద్ధ విమానం కోసం 25 ఐదు మిలియన్ యూరోలు అధికంగా చెల్లించిందని కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం ఆరోపించారు. దేశ ఆర్థికవ్యవస్థను చిన్నాభిన్నం చేసినందుకు ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జైట్లీ స్థానంలో తానుంటే ఈపాటికే రాజీనామా చేసి ఉండేవాడినని ఆయన తెలిపారు.

శుక్రవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం 36 యుద్ధవిమానాలు మాత్రమే కొనుగోలు చేయాలని నిర్ణయించటం ద్వారా దేశ భద్రతకు మోదీ ప్రభుత్వం ముప్పు తెచ్చిందని, ఈ మొత్తం వ్యవహారంపై లోతుగా దర్యాప్తు జరిపేందుకు జేపీసీని నియమించాల్సిందేనని డిమాండ్ చేశారు. రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు వ్యవహారంపై ఈరోజు ఒక ఆంగ్లదిన పత్రిక ప్రచురించిన వార్తను ఉటంకిస్తూ యుద్ధవిమానాల ధర ఖరారు చేసేందుకు నియమించిన రక్షణ శాఖ అధికారుల బృందంలోని ముగ్గురు సీనియర్ అధికారులు ప్రతి అంశంపై అభ్యంతరం తెలియజేయటం గమనించాలని అన్నారు. రాఫెల్ యుద్ధ విమానాల్లో మన దేశ భద్రతకు అవసరమైన ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలను ఏర్పాటు చేసేందుకు నిర్ధారించిన డబ్బును 126 విమానాలకు కేటాయించకుండా కేవలం 36 యుద్ధవిమానాలకు పరిమితం చేయటంలో అనేక అక్రమాలు జరిగాయన్నారు. దీనివల్లనే యుద్ధ విమానాల ఖరీదు విపరీతంగా పెరిగిందని, ఎన్డీఏ ప్రభుత్వం దేశప్రజల సొమ్మును రాఫెల్ యుద్ధ విమానాలను తయారు చేసే డస్సాల్ట్ సంస్థకు దోచిపెట్టిందని చిదంబరం ఆరోపించారు.

యూపీఏ ప్రభుత్వం రాఫెల్ యుద్ధవిమానాల ఒప్పందం చేసుకున్నప్పుడు మన భద్రతా అవసరాలకు అయ్యే ఖర్చును మొత్తం 126 విమానాలకు సరిపెడితే ఎన్డీఏ ప్రభుత్వం దానిని కేవలం 36 యుద్ధవిమానాలకు మాత్రమే పరిమితం చేయటం వెనక ఉన్న మర్మమేమిటని ఆయన ప్రశ్నించారు. దీంతో మన భద్రతకు ముప్పు వాటిల్లిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మనకు 126 యుద్ధ విమానాలు అవసరమయితే కేవలం 36 యుద్ధ విమానాలనే ఎందుకు కొంటున్నారనే ప్రశ్నకు రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానం చెప్పటం లేదని ఆయన విమర్శించారు. డస్సాల్ట్ సంస్థకు అనవసరంగా లాభం చేకూర్చటం వెనక ఉన్న మర్మం ఏమిటి? దేని కోసం ఇలా చేశారని చిదంబరం నిలదీశారు. డస్సాల్ట్‌కు లాభం చేకూర్చాలనేది బాగా ఆలోచించి తీసుకున్న నిర్ణయమని ఆయన ఆరోపించారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాన్ని మరోసారి లేవదీస్తామని చిదంబరం ప్రకటించారు.

ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం



దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైపోయిందని చిదంబరం ఆరోపించారు. దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారినందుకు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యూపీఏ మొదటి ఐదు సంవత్సరాల పాలనలో దేశాభివృద్ధి అధికంగా జరిగిందని ఆయన చెప్పారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తరువాత ఏ ఐదు సంవత్సరాలతో పోల్చినా యూపీఏ పాలన మొదటి ఐదు సంవత్సరాల అభివృద్ధి అత్యధికమని ఆయన వివరించారు. ఎన్డీఏ ప్రభుత్వం రానున్న నాలుగైదు నెలల్లో ఏం చేసినా ఈ పరిస్థితి మారదని చిదంబరం స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాతనే ఈ పరిస్థితి మారుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఫిస్కల్ లోటు సమస్యను పరిష్కరించటంలో ఎన్డీఏ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ప్రత్యక్ష, పరోక్ష పన్నుల వసూళ్ల లక్ష్యాలను ఈ ప్రభుత్వం సాధించలేకపోతోందని ఆయన విమర్శించారు. గత ఐదు సంవత్సరాల్లో ప్రభుత్వం చేసిందేమీ లేదు, ఘోరమైన పెద్ద నోట్ల రద్దు, భయంకరమైన జీఎస్టీ పన్నులు విధించడం తప్ప అని ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు సంపాదించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తుందని చిదంబరం చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం పద్ధతి లేదా మధ్యప్రదేశ్ ప్రభుత్వం అవలంబించిన పద్ధతిలో రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేయాలని ఎన్డీఏ ప్రభుత్వం యోచిస్తోందన్న అనుమానాన్ని చిదంబరం వ్యక్తం చేశారు.

సుప్రీం కోర్టు జడ్జీలుగా దినేష్ మహేశ్వరి, సంజయ్ ఖన్నా

ప్రమాణ స్వీకారం



న్యూఢిల్లీ, జనవరి 18: జస్టిస్‌లు దినేష్ మహేశ్వరి, సంజయ్ ఖన్నా సుప్రీం కోర్టు జడ్జీలుగా శుక్రవారం ప్రమాణం చేశారు. సుప్రీం కోర్టులోని కోర్టు నెంబర్ వన్‌లో జరిగిన కార్యక్రమంలో చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ వారితో ప్రమాణం చేయించారు. వీరిద్దరి ప్రమాణంతో 31 మంది జడ్జీలు ఉండాల్సిన సుప్రీంకోర్టులో జడ్జిల సంఖ్య 28కి పెరిగింది. ఇంతకుముందు జస్టిస్ మహేశ్వరి కర్నాటక హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా, జస్టిస్ ఖన్నా ఢిల్లీ హైకోర్టు జడ్జిగా పనిచేశారు. వీరిద్దరినీ హైకోర్టు జడ్జీలుగా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చీఫ్ జస్టిస్ గొగోయ్, జస్టిస్‌లు ఏకే సిక్రీ, ఎస్ఏ బోబ్డే, ఎన్వీ రమణ, అరుణ్ మిశ్రాలతో కూడిన ఐదుగురు సభ్యుల సుప్రీం కోర్టు కొలీజియం ఈనెల 10న వీరిద్దరిని సుప్రీం జడ్జిలుగా సిఫార్సు చేసింది. కాగా, రాజస్థాన్, ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌లు ప్రదీప్ నంద్రజోగ్, రాజేంద్ర మీనన్‌లకు పదోన్నతి కల్పించాలని 2018, డిసెంబర్ 12న సుప్రీం కొలీజియం యోచించింది. అయితే కొలీజియంలో సభ్యుడిగా ఉన్న జస్టిస్ ఎంబీ లోకూర్ డిసెంబర్ 30న పదవీ విరమణ చేయడం, ఆయన స్థానంలో జస్టిస్ అరుణ మిశ్రా రావడం వంటి పరిణామాల వల్ల ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. తర్వాత జనవరి 10న తిరిగి సమావేశమైన కొలీజియం వీరిద్దరినీ విస్మరించి మహేశ్వరి, సంజయ్‌ఖన్నాలకు సుప్రీం జడ్జిలుగా పదోన్నతి కల్పించింది. ఇదిలావుండగా, ఎంతో సీనియారిటీ ఉన్న జస్టిస్ ఖన్నాకు పదోన్నతి ఇవ్వకపోవడం పట్ల బార్ కౌన్సిల్ ఇండియా (బీసీఐ) విస్మయం వ్యక్తం చేసింది. కొలీజియం నిర్ణయం నిరంకుశం, చంచలమైనదంటూ విమర్శించింది. కొలీజియం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీం కోర్టు జస్టిస్ కిషన్ కౌల్ చీఫ్ జస్టిస్, కొలీజియం సభ్యులకు ఒక లేఖ రాస్తూ ఎంతో సీనియారిటీ ఉన్న నంద్రజోగ్, మీనన్‌లను పదోన్నతిలో విస్మరించడం తగదని పేర్కొన్నారు. వీరిద్దరినీ పదోన్నతికి ఎంపిక చేయకపోవడం తప్పుడు సంకేతాలను పంపుతుందని, వీరు సీనియారిటీలో జస్టిస్ ఖన్నా కంటే ముందున్న విషయం మరువరాదని పేర్కొన్నారు.

కాశ్మీర్‌లో హిమ'పాశం'

ఐదుగురు దుర్మరణం, మరో ఐదుగురు గల్లంతు



శ్రీనగర్, జనవరి 18: కాశ్మీర్‌లో శుక్రవారం జరిగిన హిమపాత ప్రమాదంలో పది మంది దుర్మరణం చెందారు. లడక్ ప్రాంతంలోని ఖార్దుంగ్‌ల ప్రాంతంమీదుగా వెళుతున్న రెండు లారీలను హిమపాతం ముంచెత్తడంతో ఈ ప్రమాదం జరిగింది. ఐదుగురు మృతదేహాలను వెలికి తీయ గలిగారు మిగతా ఐదుగురు బతికుండే అవకాశాలు లేవని అధికార వర్గాలు తెలిపాయి. ఒక ట్రక్కులో వెళుతున్న పది మంది ప్రయాణీకులు హిమపాతానికి లోనయ్యారని, రెండు ట్రక్కులను మంతు ముంచెత్తిందని పోలీసులు చెప్పారు. ఈ ఘటన శుక్రవారం ఉదయం 7 గంటలకు జరిగింది. సంఘటన ప్రదేశానికి బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ సిబ్బంది హుటాహుటిన చేరుకున్నారు. ఈ ఘటనలో ట్రక్కు మట్టి పెళ్లల్లో చిక్కుకుంది. రాష్ట్ర విపత్తు సహాయ బలగాలు సంఘటన స్థలానికి చేరుకుని సహాయ చర్యలు ప్రారంభించారు. ఇంతవరకు ఐదు మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఢిల్లీని కమ్మేసిన పొగ మంచు

❖ 450 విమానాల రాకపోకలకు అంతరాయం

❖ కొన్ని సర్వీసుల రద్దు..మరికొన్ని దారిమళ్లింపు

న్యూఢిల్లీ, జనవరి 18: దేశ రాజధాని ఢిల్లీలో పొగ మంచు కమ్మేసింది. దట్టమైన పొగ మంచు కారణంగా శుక్రవారం ఉదయం ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కనీసం 450 విమానాల సర్వీసులకు అంతరాయం కలిగింది. ఈపరిస్థితి ఉదయం 5.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ కనిపించింది. విమానాలు ఆలస్యంగా రావడమో లేదా దారి మళ్లించడంతో జరిగిందని అధికారులు వెల్లడించారు. 10.30 వరకూ అదే పరిస్థితి కొనసాగడంతో ఆ తరువాత సర్వీసులను దారి మళ్లించడం లేదా రద్దుచేయడం జరిగింది. విమానాశ్రయం నుంచి బయలుదేరాల్సిన, చేరుకోవల్సిన సర్వీసులపై తీవ్ర ప్రభావం చూపింది. ఉదయం 5.30, 10.20 మధ్య ఐదు విమానాలను దారిమళ్లించారు. అందులో సింగపూర్ నుంచి రావల్సిన విమానం కోల్‌కతాకు మళ్లించినట్టు ఓ అధికారి వెల్లడించారు. బ్యాంకాక్, దుబాయి, గువహటీ, మస్కట్ నుంచి వచ్చిన నాలుగు విమానాలను జైపూర్ మళ్లించారు. ఇది ఉదయం 7.30, 10.20 గంటల మధ్యే చోటుచేసుకుంది. పరిమితమైన సర్వీసులను పరిస్థితులను బట్టి అంటే మంచుతగ్గడం, ఏటీసీ (ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్) అనుమతుల ఆధారంగా బయలుదేరినట్టు ఎయిర్‌పోర్టు అధికారులు పేర్కొన్నారు. దట్టమైన పొగ మంచు కారణంగా ఢిల్లీ విమానాశ్రయం రన్‌వే కనిపించలేదు.

తెల్లవారుజామున 4 గంటలకు పరిస్థితి అత్యంత దారుణంగా ఉండింది. 9.20-10.20 మధ్య కాస్త పరిస్థితి మెరుగుపడింది. పొగ మంచు కారణంగా విమాన సర్వీసుల్లో తీవ్రమైన అంతరాయం ఏర్పడిందని, నెట్‌వర్క్‌పై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని విస్తారా ఎయిర్ లైన్స్ ట్వీట్ చేసింది. పరిస్థితి మెరుగయ్యాక విమానాలు బయలుదేరినట్టు సంస్థ స్పష్టం చేసింది. ఢిల్లీ, బెంగళూరులో పొగ మంచు కారణంగా తమ సర్వీసుల్లో అంతరాయం ఏర్పడిందని జెట్ ఎయిర్‌వైస్ ప్రకటించింది.

ఢిల్లీలో ఉండలేం

ఇటు కాలుష్యం.. అటు ట్రాఫిక్

❖ అధికారులు ఏం చేస్తున్నారు? ❖ సుప్రీం కోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ, జనవరి 18: దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్య తీవ్రత, ట్రాఫిక్ రద్దీకి సంబంధించిన చర్యలను సరైన రీతిలో అమలుచేయడం లేదంటూ సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఢిల్లీ ఓ గ్యాస్ ఛాంబర్‌గా మారిపోయిందని, ఇక్కడ ఉండకపోవడమే మంచిదన్న పరిస్థితులు ఏర్పడుతున్నాయని తీవ్ర స్వరంతో వ్యాఖ్యానించింది. వాయుకాలుష్యాన్ని నిరోధించే చర్యల అమలు సక్రమంగా జరగడం లేదని, అలాగే పెరిగిపోతున్న వాహనాల సంఖ్య కూడా ఆందోళనకరంగా మారిందని కోర్టు తెలిపింది. ఉదయం, సాయంత్రం అన్న తేడా లేకుండా ఇటు కాలుష్యం అటు మితిమీరిన ట్రాఫిక్ ఢిల్లీలో నిత్యకృత్యమైపోయాయని న్యాయమూర్తి అరుణ్‌మిశ్రా అన్నారు. వాయుకాలుష్యానికి సంబంధించి దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా మిశ్రా వ్యాఖ్యలు చేశారు. 'ఢిల్లీలో ఉండ డం కష్టం. నేనిక్కడ స్థిరపడాలని అనుకోవడం లేదు' అని కూడా ఆయన వ్యాఖ్యానించారు. వాయుకాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు జీవన హక్కునే దెబ్బతీస్తున్నాయని న్యాయమూర్తి దీపక్ గుప్తాతో కూడిన ఈ బెంచ్ వ్యాఖ్యానించింది. 'ఈరోజు ఉదయం నేను ట్రాఫిక్ చిక్కుకుపోయా ను. కొత్త న్యాయమూర్తుల ప్రమాణస్వీకారానికి హాజరుకాగలనో లేనోనన్న ఆందోళన నన్ను కలచివేసింది'అని అని జస్టిస్ మిశ్రా అన్నారు. ఢిల్లీ గ్యాస్ ఛాంబర్‌గా మారిందన్న మిశ్రా వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నానని ఈ కేసులో కోర్టు సహాయకుడిగా వ్యవహరిస్తున్న అపరాజిత సింగ్ అన్నారు.

అమెరికాలో ముదురుతున్న గోడ వివాదం

వాషింగ్టన్, జనవరి 18: అమెరికా ప్రభుత్వంలో ఉన్నత స్థానంలో ఉన్న నేతల మధ్య అభిప్రాయబేధాలు ముదురుతున్నాయి. దేశంలో ఆర్థిక పరిస్థితి బాగాలేదనే కారణంపై స్పీకర్ నాన్సీ పెలోసీ బ్రస్సెల్స్, ఆఫ్గనిస్తాన్ పర్యటనలకు అనుమతి లభించలేదు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ ప్రకటించారు. గోడ వివాదంతో రిపబ్లికన్లు, డెమాక్రట్ల మధ్య దూరం పెరిగింది. దీంతో స్పీకర్ నాన్సీ పర్యటనకు ట్రంప్ నో అన్నారు. దేశంలో ఫెడరల్ కార్యాలయాల్లో 27 రోజులుగా ఉద్యోగులు విధులకు హాజరు కాని పరిస్థితి తలెత్తింది. హౌస్ ఆఫ్ రిప్రెజెంటేటివ్‌లో డెమాక్రట్లకు ఆధిక్యత ఉంది. మెక్సికో, అమెరికా సరిహద్దుల మధ్య 5.7 బిలియన్ డాలర్ల విలువ చేసే గోడకు డెమాక్రట్ల ఆమోదం తెలపడంలేదు.

అగ్రవర్ణ పేదలకు పదిశాతం ఈబీసీ కోటా

❖ యూపీలో అమలులోకి వచ్చిన రిజర్వేషన్

❖ రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయం

లక్నో, జనవరి 18: ఈబీసీలకు పదిశాతం రిజర్వేషన్లను కల్పిస్తూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విద్య, ఉద్యోగాల్లో పదిశాతం కోటాను వర్తింపచేస్తున్నట్లు యూపీ మంత్రి వర్గం ప్రకటించింది. అగ్రవర్ణాల్లోని పేదలకు ఈ రిజర్వేషన్లను కల్పిస్తారు. ఈ వివరాలను మంత్రివర్గం తరఫున ప్రతినిధి శ్రీకాంత శర్మ విలేఖర్లకు తెలిపారు. దేశంలో ఇంతవరకు గుజరాత్, జార్కండ్ ప్రభుత్వాలు ఈబీసీలకు పదిశాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ నిర్ణయం తీసుకున్నాయి. ఈ కోటాను అమలు చేసే రాష్ట్రాల్లో యూపీ మూడో స్థానంలో నిలిచింది. 124వ రాజ్యాంగ సవరణకు పార్లమెంటు ఆమోదం తెలిపిన విషయం విదితమే. ఈ సవరణ కింద ఈబీసీలకు పదిశాతం రిజర్వేషన్లను కల్పించే బిల్లుకు పార్లమెంటు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కూడా బిల్లుపై సంతకం చేశారు. ఈ నెల 14వ తేదీ నుంచి ఈబీసీ కోటా అమలులోకి వస్తుందని ప్రతినిధి శ్రీకాంత శర్మ చెప్పారు. రాష్ట్రంలో 49 వర్శిటీలు ఉన్నాయని చెప్పారు. ఇందులోనాలుగు సెంట్రల్ వర్శిటీలు , 15 రాష్ట్ర స్థాయివర్శిటీలు, 27 ప్రైవేట్ వర్శిటీలు ఉన్నాయి. మొత్తం అన్ని విభాగాల్లో కలిపి 44వేల సీట్లు ఉన్నాయి. రాష్ట్రంలోని ఉన్నత విద్యా రంగంలో అన్ని విద్యా సంస్థల్లో కూడా ఈబీసీ కోటా కింద పదిశాతం రిజర్వేషన్లను అమలుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు యూపీ ఉపముఖ్యమంత్రి దినేష్ శర్మ చెప్పారు.

విశ్వరూపంతో పార్టీల నిజస్వరూపం తేలుతుంది

★ తెలంగాణ కంటే ఏపీలోనే మాదిగల సంఖ్య ఎక్కువ
★ ప్రధాన పార్టీలు ద్వంద్వవైఖరి విడనాడాలి
★ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 18: ఫిబ్రవరిలో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభ నాటికి ఏపీలో పార్టీల నిజ స్వరూపం తేలనుందని, మాదిగల పట్ల పార్టీల కుట్రపూరిత వ్యవహారం బయటపడుతుందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. విభజన అనంతరం ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో మాదిగల ఉనికిని దెబ్బతీసే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. జిల్లాల పర్యటనలో భాగంగా శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం వచ్చిన మందా కృష్ణ మాదిగ స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో విలేఖర్లతో మాట్లాడారు. ఏపీలో స్వార్థపరుల వత్తిడికి తలొగ్గిన కొన్ని ప్రధాన రాజకీయ పక్షాలు ఎస్సీ వర్గీకరణ పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు.

ఏపీలో మాదిగలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎక్కడైతే మాదిగల ఉనికిని రాజకీయ పార్టీలు స్వార్థపూరితం చేస్తున్నాయో, అక్కడే తామేంటో చూపించడానికి ఫిబ్రవరి 19న అమరావతిలో మాదిగల విశ్వరూప మహాసభ కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తున్నామన్నారు. ఏపీలో మాదిగలు లేరనే వాదనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ కంటే ఏపీలోనే మాదిగల జనాభా ఎక్కువన్నారు. తెలంగాణలో మాదిగల జనాభా 35 లక్షలు వుంటే, మాలల జనాభా 15 లక్షలు మాత్రమేనన్నారు. ఏపీలో మాదిగల సంఖ్య 39 లక్షలు కాగా, మాలల సంఖ్య 41 లక్షలు ఉంటుందన్నారు.

మాలలతో పోల్చుకుంటే ఏపీలో మాదిగల జనాభా కేవలం 2 లక్షలు మాత్రమే తక్కువన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకై నిర్వహించిన సర్వే అనంతరం జారీచేసిన జీవో నెంబర్ 25 ద్వారా ఈ గణాంకాలు తేటతెల్లమయ్యాయన్నారు. మాదిగలు రెండు లక్షలు మాత్రమే తక్కువ ఉన్నప్పటికీ లేరని, దుష్ప్రచారం చేస్తూ అవకాశాలకు గండి కొడ్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. మాల మాదిగలు ఉమ్మడిగా అనుభవించాల్సిన సంక్షేమ పథకాలను మొత్తం అధికార పార్టీ మాలల చేతిలోనే పెట్టడమే ఇందుకు ప్రబల సాక్ష్యమన్నారు.

ఈ మేరకు దళితుల సంక్షేమ శాఖకు మంత్రిగా నక్కా ఆనందబాబును, ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా జూపూడి ప్రభాకర్‌ను, ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా కారెం శివాజీని నియమించారన్నారు. ఈ విధంగా చేయడం వల్ల మాదిగలు సంక్షేమ అవకాశాలు కోల్పోతున్నారన్నారు. అదే సమయంలో దళిత క్రైస్తవులకు ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌లో మాల మాదిగలు ఇద్దరూవుంటే నతానియేల్‌ను నియమించారన్నారు. సంక్షేమం అందకుండా చేస్తున్న ఆ సామాజికవర్గ కుట్రకు అధికార ప్రతిపక్ష పార్టీలు వత్తాసు పల్కుతూ మాదిగల ఉనికిని ప్రశ్నార్థకం చేశారన్నారు. చంద్రబాబునాయుడు ఏపీలో ఒక విధంగా, తెలంగాణాలో మరో విధంగా ద్వంద్వ వైఖరితో వ్యవహరిస్తున్నారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా వుండగా అసెంబ్లీలో తీర్మానం జరిగిందని, ఆయన కూడా ప్రధానికి లేఖలు రాసారని, ఆయన కుమారుడు జగన్ కూడా వర్గీకరణకు అనుకూలంగా కేంద్రానికి లేఖలు రాశారన్నారు. అదే ప్రతిపక్ష నేత జగన్ వర్గీకరణకు అవకాశం లేదని వ్యతిరేకిస్తూ ఏపీలో మాట్లాడుతున్నట్టు రుజువులు కనిపిస్తున్నాయన్నారు. విశ్వరూప సభకు ముందుగా జిల్లాల పర్యటన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విపక్ష నేత వైఎస్ జగన్, వామపక్ష నేతలు మధు, రామకృష్ణ, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, కాంగ్రెస్ అధ్యక్షుడు రఘువీరా తదితరులందరినీ కలసి ఆహ్వానిస్తామన్నారు. ఈ సభ కంటే ముందే తమ శత్రువులెవరో, మిత్రులెవరో తేలనుందన్నారు. విలేఖర్ల సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేతలు చిన సుబ్బారాయుడు, వైరాల అప్పారావు, కొత్తపల్లి రఘు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోం

★ కేటీఆర్, జగన్ కలయిక హక్కుల సాధనకే
★ వైసీపీ ప్రాంతీయ కోఆర్డినేటర్ ధర్మాన ప్రసాదరావు

ఆంధ్రభూమి బ్యూరో

శ్రీకాకుళం, జనవరి 18: వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోమని వైసీపీ రీజనల్ కోర్డినేటర్ ధర్మాన ప్రసాదరావు స్పష్టం చేసారు. శుక్రవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తప్పుతోవపట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేక హోదా కోసం జగన్ చేస్తున్న కృషిని అందరూ హర్షించాలన్నారు. కేంద్రప్రభుత్వం మాటమీద నిలబడలేదని, కేంద్రం ఇచ్చిన ప్యాకేజీకి ఆమోదించి, అభినందనలు తెలిపిన ఏపీ ముఖ్యమంత్రి, ఆయన కేబినెట్ ఇప్పుడు ప్రత్యేక హోదా ఇవ్వలేదని బీజేపీ ప్రభుత్వంపై నింద మోపడం సరికాదన్నారు. పార్లమెంటు తీసుకున్న నిర్ణయం, తదుపరి ఆనాడు ఉన్న ప్రభుత్వం ప్లానింగ్ కమిషన్‌కు పంపించిన విషయాన్ని గుర్తుచేసారు. ఈ దేశానికి అత్యున్నతమైన రాజ్యాంగ సభలు ఏకగ్రీవంగా అంగీకరించిన తర్వాత ఆ హక్కులు అమలుకు నోచుకోలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కొంతకాలం ప్రత్యేక హోదా అవసరం లేదని, ప్యాకేజీ కావాలని, మళ్ళీ ఇప్పుడు ప్రత్యేక హోదా నినాదంతో అధికారాన్ని చేజిక్కించుకునే జిమ్మికులు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ తరుణంలో వైసీపీ అన్ని విధాలుగా నష్టపోయిన ప్రజలకు న్యాయం జరగాలని, జీవనప్రమాణాలు పెరగాలని, పరిశ్రమలు రావాలని, తద్వారా ఉద్యోగావకాశాలు కల్పించాలనే జగన్ పోరాటం చేస్తున్నారన్నారు. ప్రభుత్వంపై అభద్రతాభావం కలిగినప్పుడు పక్కనున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ అంటూ ఆహ్వానించారన్నారు. కలిసి పోటీ చేస్తామని వారు చర్చ జరపలేదని, చెప్పలేదని స్పష్టం చేసారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం వైసీపీ దేనికైనా సిద్ధంగా ఉందన్నారు. హైకోర్టును ఏదో బడ్డీకొట్టు నడిపినట్టు చిన్న గదుల్లో నడిపించే బాబు రాజధాని నిర్మించగలరా అంటూ ప్రశ్నించారు. కేంద్రంలో రాష్ట్రాల హక్కులు సాధించుకోవడం కోసం ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్నప్పుడు వైసీపీ ప్రత్యేక హోదా సాధన కోసం కలిసి పనిచేసేందుకు జగన్ సిద్ధపడ్డారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం దేశంలో ఏ రాజకీయ పార్టీతోనైనా కలిసి పోరాటం చేసేందుకు వైసీపీ సిద్ధంగా ఉందన్నారు. కేంద్రప్రభుత్వంపై పోరాటం చేసేందుకే ఒక వేదిక కోసం కేసీఆర్ కలిసి పోరాడతామంటే కలిసి పనిచేయడానికి ముందుకు వెళ్ళామని, అటువంటి పార్టీలు దేశంలో ఎవరు ఆహ్వానించినా వారితో పనిచేస్తామన్నారు. టీఆర్ఎస్ పార్టీతో కలిసి పోటీ చేస్తామని అబద్ధపు ప్రచారాలను చేయవద్దంటూ బాబుకు, ఆయన కేబినెట్ మంత్రులకు హెచ్చరించారు. బాబు ఇచ్చే హామీలపై ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు

ఆయేషా కేసులో సీబీఐ దర్యాప్తు వేగవంతం

★ కావాలనే ఇరికించారని సత్యంబాబు సంచలన వ్యాఖ్యలు

విజయవాడ (క్రైం), జనవరి 18: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన బి ఫార్మసీ విద్యార్థిని ఆయేషామీరా హత్య కేసు విచారణను సిబిఐ ముమ్మరం చేసింది. దీనిలో భాగంగా ఈ కేసులో గతంలో జైలుశిక్ష అనుభవించి నిర్దోషిగా విడులైన పిడతల సత్యంబాబును అధికారులు విచారించారు. ఇదే సమయంలో తొలుత నుంచీ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న దివంగత మాజీ మంత్రి కోనేరు రంగారావు మనుమడు కోనేరు సతీష్‌ను కూడా అధికారులు ప్రశ్నించారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన బి ఫార్మసీ విద్యార్థినీ ఆయేషామీరా కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నంలోని దుర్గాహాస్టల్‌లో అత్యాచారం, హత్యకు గురైన ఘటన గతంలో రాష్ట్ర వ్యాప్తంగా సంచలన కలిగిస్తోంది. ఈ కేసు దర్యాప్తులో ఎన్నో మలుపుల అనంతరం కృష్ణాజిల్లా నందిగామ అనాసాగరానికి చెందిన పిడతల సత్యంబాబును నిందితునిగా విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో అతన్ని దోషిగా నిర్ధారిస్తూ విజయవాడ కోర్టు గతంలో జీవితఖైదు విధించింది. ఆ తర్వాత కొనసాగిన విచారణలో సత్యంబాబును నిర్దోషిగా నిర్ధారిస్తూ హైకోర్టు విడుదల చేసింది. అయితే అసలు దోషులను ఎవరో తేల్చాలని న్యాయస్థానం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పునర్విచారణ ప్రారంభించింది. అయితే సిట్‌పై తమకు నమ్మకం లేదని ఆయేషా తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించిన మీదట రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలతో కేసు సిబిఐకి బదిలీ అయింది. రంగంలోకి దిగిన సిబిఐ విచారణలో కేసుకు సంబంధించి రికార్డులు విజయవాడ కోర్టులో ధ్వంసం చేసినట్లు గుర్తించి ఇందుకు కారణమైన కోర్టు సిబ్బందిపై కేసు నమోదు చేసి హైకోర్టుకు నివేదించింది. ఈనేపథ్యంలో ఘటనపై దర్యాప్తు వేగవంతం చేసిన సిబిఐ అధికారులు శుక్రవారం బృందాలుగా ఏర్పడి కృష్ణా జిల్లా వచ్చారు. ఓ బృందం నందిగామ అనాసాగరంలోని సత్యంబాబు ఇంట్లో అతన్ని ప్రశ్నించారు. ఇదే సమయంలో మరో బృందం కృష్ణాజిల్లా గూడవల్లిలోని కోనేరు సతీష్ నివాసంలో విచారణ జరిపారు. కోనేరు రంగారావు మనుమడైన సతీష్ అప్పట్లో ఈకేసుకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొన్నారు. అయితే సతీష్‌ను తాజాగా సిబిఐ అధికారులు పలు అంశాలపై ప్రశ్నించారు. ఇదే సమయంలో ఘటన జరిగిన దుర్గాహాస్టల్‌కు చెందిన సిబ్బందిని కూడా సిబిఐ విచారించనుంది.

కావాలనే ఇరికించారు : సత్యంబాబు

ఇదిలావుండగా సిబిఐ అధికారుల విచారణలో పిడతల సత్యంబాబు సంచలన వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. 'అప్పటి పోలీసు అధికారులు మా అమ్మని చెల్లిని చంపేస్తామని, నన్ను ఎన్‌కౌంటర్ చేస్తామని బెదిరించారు.. ఆ హత్య కేసులో నాకు ఎలాంటి సంబంధం లేదు, నన్ను కావాలనే బెదిరించి ఈ కేసులో ఇరికించారు. కొంతమంది అధికారులు కేవలం ప్రమోషన్ల కోసం కక్కుర్తి పడి నున్న ఇరికించారు.' అంటూ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. కాగా సత్యంబాబును సిబిఐ బృందం సుమారు ఐదు గంటల పాటు విచారించినట్లు సమాచారం.

విశాఖ ఉక్కులో భారీ ప్రమాదం

★ బ్లాస్ట్ ఫర్నేస్ క్యాస్ట్‌హౌస్‌లో పేలిన బ్లోయర్లు
★ ఆస్తి నష్టం సుమారు రూ. 50 కోట్లకు పైమాటే
★ ఏడు ద్విచక్ర వాహనాలు దగ్ధం

ఉక్కునగరం, జనవరి 18: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో బ్లాస్ట్‌ఫర్నేస్-3లో గల క్యాస్ట్‌హౌస్‌లో శుక్రవారం ఉదయం భారీ ప్రమాదం సంభవించింది. అదృష్టవశాస్తు ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. ఆస్తి నష్టం మాత్రం దాదాపు 50కోట్ల రూపాయల వరకు ఉంటుందని కార్మిక వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రమాదం కారణంగా బ్లాస్ట్‌ఫర్నేస్‌లో గల యంత్ర పరికరాలతో పాటు ఒక జేసీబీ, రెండు ఫోర్క్‌లిఫ్ట్‌లు, కార్మికులకు చెందిన ఏడు ద్విచక్ర వాహనాలు కాలి బూడిదయ్యాయి. బ్లాస్ట్‌ఫర్నేస్-3లో క్యాస్ట్‌హౌస్ పల్వరైజ్డ్ కోల్ (పిసిఐ)ను పంపించే క్రమంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో బ్లోయర్ పైపు భారీ శబ్ధంతో పేలింది. దీని కారణంగా సింటర్, కోకో, హాట్ మెటల్ వంటి రా-మెటీరియల్స్ ఎగజిమ్మడంతో భారీగా శబ్ధాలు, మంటలు వ్యాపించాయి. పేలుళ్లతో అప్రమత్తం అయిన ఉద్యోగులు, అధికారులు, కార్మికులు పరుగులు తీశారు. సంఘటనా స్థలాన్ని ఉక్కు సీఎండీ పీకే రథ్‌తో పాటు ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు పరిశీలించాయి.

తృతీయఫ్రంట్‌కు అవకాశం లేదు

★ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

మడకశిర, జనవరి 18: త్వరలో జరగనున్న దేశ వ్యాప్త సార్వత్రిక ఎన్నికల్లో తృతీయఫ్రంట్ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఏమాత్రం లేవని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎస్.రఘువీరారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం జిల్లా మడకశిరలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 42 ప్రాంతీయ పార్టీలు కలిసి విజయం సాధించినా అధికారం చేపట్టే అవకాశాలు లేవన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ప్రధాన అంశమైన ప్రత్యేక హోదా గురించి మాట్లాడకుంటే ఓటమి తప్పదన్న భయం ప్రతి పార్టీని పట్టుకుందన్నారు. అందుకే ప్రజలను ఆకట్టుకునేందుకు పెన్షన్ల రెట్టింపుప్రకటనలు చేస్తున్నాయన్నారు. అయితే ప్రజలు వారి మాయమాటలను నమ్మి ఓట్లు వేసే పరిస్థితి లేదన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో పోటీ చేస్తే కాంగ్రెస్ స్వాగతిస్తుందన్నారు. తెలంగాణ అంశం ఎంత ముఖ్యమో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రత్యేక హోదా కూడా అంతే ముఖ్యమన్నారు. ఎన్నికల కమిషన్ ఇప్పటికిప్పుడు పార్లమెంటు ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీకి 200 సీట్లు దక్కుతాయన్నారు.

సరైన సమయానికి ఎన్నికలు నిర్వహిస్తే మ్యాజిక్ ఫిగర్ కంటే ఎక్కువ స్థానాల్లో విజయం సాధిస్తామని రఘువీరా ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీకి చెప్పుకోదగిన రాష్ట్రం ఏదీ లేదన్నారు. రాష్ట్రంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితా తెలంగాణ తరహాలో ఆలస్యం చేయకుండా ముందుగానే ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్ పాల్గొన్నారు.

దరఖాస్తుదారులందరికీ హజ్ యాత్రకు అవకాశం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 18: 2019 హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకున్న వారందరినీ ఎంపిక చేసినట్లు హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ లియాఖత్ అలీ శుక్రవారం ప్రకటించారు. 2,135 మంది పెద్దలు, రెండేళ్ళ లోపు ముగ్గురు చిన్నారులు మొత్తం 2,138 మంది ఈ ఏడాది ఏపీ నుంచి హజ్ యాత్రకు వెళ్ళనున్నారు. ఇందులో 40 మంది 70 ఏళ్ళు పైబడిన వారు ఉన్నారు. అనంతపూర్ జిల్లా నుంచి 298, చిత్తూరు జిల్లా నుంచి 206, తూర్పు గోదావరి జిల్లా నుంచి 39, గుంటూరు జిల్లా నుంచి 326, కడప జిల్లా నుంచి 241, కృష్ణాజిల్లా నుంచి 230, కర్నూలు జిల్లానుంచి 473, నెల్లూరు జిల్లా నుంచి 121, ప్రకాశం జిల్లా నుంచి 43, శ్రీకాకుళం జిల్లా నుంచి 7గరు, విశాఖపట్నం జిల్లానుంచి 90, విజయనగరం జిల్లా నుంచి 24, పశ్చిమ గోదావరి జిల్లా 37 మంది డ్రాతో నిమిత్తం లేకుండా హజ్ యాత్రకు ఎంపికైయ్యారు. 70 ఏళ్ళు పైబడిన యాత్రికులు 40 మంది కూడా డ్రాతో సంబంధం లేకుండా ఎంపికయ్యారు. ఇక ఈ హజ్‌యాత్రకు ఎంపికైన ప్రతి హజ్ యాత్రికుడు మొదటి విడత రూ.81,000లు ఫిబ్రవరి 5వ తేదీ లోపు సెంట్రల్ హజ్ కమిటీకి చెల్లించాల్సి ఉందన్నారు.

'భోజనం' వంట చార్జీల పెంపు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 18: రాష్ట్రంలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి వంట చార్జీలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఒక విద్యార్థికి చెల్లిస్తున్న చార్జీలపై 5.35 శాతం మేర పెంచుతూ పాఠశాల విద్యా శాఖ నిర్ణయం తీసుకుంది. పెరిగిన చార్జీలను గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. దీని వల్ల అదనంగా 7.8 కోట్ల రూపాయలను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సి ఉంటుంది.

1వ పేజీ తరువాయి

రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం

9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ప్రకటించిన ఏకైక ప్రభుత్వం తెలుగుదేశమేనని గుర్తుచేశారు. కౌలురైతులను ఆదుకోవాలనే తలంపుతో ఇటీవల రాష్ట్రంలో సంభవించిన పెథాయ్ తుఫాన్ ప్రభావం వల్ల దెబ్బతిన్న ధాన్యాన్ని కనీస మద్దతు ధర కంటే కేవలం రూ.200 తగ్గించి కొనుగోలు చేసేలా ఆదేశాలు ఇచ్చామని పేర్కొన్నారు. దేశంలోనే అభివృద్ధి కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేస్తున్న ఏపీ ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో 670 అవార్డులు దక్కాయని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

ముగ్గురు మోదీల తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదు

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు ముగ్గురు మోదీలు కుట్రలు పన్నుతున్నారని, వీరి తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని, అంతిమంగా ప్రజా సంక్షేమమే తనకు ప్రధానమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. మోదీతో సఖ్యతగా ఉన్నంతకాలం తెలంగాణ ముఖ్యమంత్రి కూడా మనతో బాగానే ఉన్నారని, ఎప్పుడైతే మోదీతో విభేదించామో నాటి నుంచి కేసీఆర్ కూడా రాష్ట్రంపై కక్షగట్టారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కులాల మధ్య చిచ్చుపెట్టి అశాంతిని సృష్టించేందుకు నరేంద్రమోదీ, తెలంగాణ మోదీ కేసీఆర్ , ఏపీ మోదీ జగన్ కలిసి కుట్రలు చేస్తున్నారని, ఎన్ని పన్నాగాలు పన్నినా దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. తెలుగుజాతి యావత్తు కలిసి ఉండాలని తాము కాంక్షించామని, అయితే కేసీఆర్ మాత్రం ఇక్కడి ప్రజలు, నాయకులపై ఎప్పుడూ నోరు పారేసుకుంటూనే ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతిపక్ష నేత జగన్‌పై కోడికత్తి దాడి జరిగితే తనకేమి సంబంధమని, కోడికత్తి పార్టీ తనపై విమర్శలు చేయడం అర్థరహితమన్నారు. బీజేపీ నీతిమాలిన రాజకీయాలు చేస్తోందన్నారు. రాష్ట్రపతి ఎన్నికల సమయంలో టీడీపీతో పొత్తు పెట్టుకుని, మరోవైపు వైసీపీ సహకారం తీసుకుందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. అవినీతిని అంతం చేస్తామంటూనే మరోవైపు జగన్ కేసుల మాఫీకి వత్తాసు పలుకుతున్నారంటూ ధ్వజమెత్తారు. కోడికత్తి కేసులో కేంద్రం జోక్యాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్ర హక్కులను హరించే అధికారం కేంద్రానికి లేదని స్పష్టంచేశారు. ఇంటికొకరు తెలుగుదేశం పార్టీకి అండగా ఉండి రాష్ట్రంపై జరిగే దాడిని కలసికట్టుగా తిప్పికొట్టాలన్నారు.

శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు మాట్లాడుతూ సినిమా నటునిగా, సేవామూర్తిగా, తిరుగులేని రాజకీయ నాయకునిగా, ప్రపంచంలో తెలుగుజాతికి గుర్తింపుతెచ్చిన నేతగా దివంగత ఎన్టీ రామారావు చరిత్రలో నిలిచే ఉంటారన్నారు. ఆయన 23వ వర్థంతిని పురస్కరించుకుని సత్తెనపల్లిలోని 53 ఎకరాల చెరువులో 40 అడుగుల పీఠంపై, 36 అడుగుల ఎత్తులో స్వర్గీయ ఎన్టీ రామారావు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, 7 ఎకరాల్లో ఎన్టీఆర్ గార్డెన్‌ను రూపొందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సరావుపేట ఎంపీ రాయపాటి సాంబశివరావు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ షేక్ జానీమూన్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, కలెక్టర్ కోన శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పొత్తుతో బాబు సాధించేదేమిటి!

అక్రమాలతో 50 ఏళ్లపాటు సుదీర్ఘంగా పాలించిన కాంగ్రెస్ దేశాన్ని భ్రష్టుపట్టించిందన్నారు. అలాంటి పార్టీతో చేతులు కలిపిన ఏ పార్టీ బతికిబట్టకట్టలేదని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దిన ఆంధ్రుడిగా కీర్తిపొందిన దివంగత ప్రధాని పీవీ నరసింహరావు చనిపోతే ఆయన పార్థివ దేహాన్ని పార్టీ కార్యాలయంలోకి కూడా రానివ్వని కాంగ్రెస్ పార్టీ దుష్ట నిర్ణయాన్ని ప్రజలు గమనించారన్నారు.

రాష్ట్ర విభజన చట్టంలోని అంశాల్లో 80 శాతం హామీలను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెబుతున్న మాటల్లో వాస్తవం లేదన్నారు. రాష్ట్రం అభివృద్ధికి సంబంధించి కేంద్రం విడుదల చేసిన నిధుల సమాచారం ఇవ్వలేదన్నారు. కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు బాబు సహకరించలేదని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకహోదా పేరుతో కేంద్ర ప్రభుత్వం, మోదీపై విమర్శలు చేయడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రగతికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. అన్ని రకాలుగా చేయూతనిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని విమర్శించారు. ఇద్దరు ఎంపీలతో ప్రారంభమై 30 ఏళ్ల తర్వాత సొంతంగా కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని స్థాపించిన బీజేపీ, నరేంద్రమోదీ సారథ్యంలో ఎన్‌డీఏలోని ప్రధాన పార్టీలను కలుపుకుని దేశాన్ని ఆర్థికంగా ప్రగతిబాట పట్టించిందని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. ఆర్థికాభివృద్ధిలో నాలుగేళ్ల క్రితం 9వ స్థానంలో ఉన్న భారతదేశం నేడు 6వ స్థానంలోకి చేరిందన్నారు. 2030 నాటికి భారతదేశం ప్రపంచ అగ్రదేశాల్లో 3వ స్థానంలో నిలిచే విధంగా మోదీ కృషి చేస్తున్నారన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిన వెళ్లిన కాంగ్రెస్ పార్టీ విధివిధానాలను చక్కదిద్ది అవినీతి లేని పరిపాలనాదక్షుడిగా ప్రధాని నరేంద్రమోదీ కీర్తిమన్ననలు పొందారన్నారు. శతృదేశమైన పాకిస్తాన్ నేలలోనే అక్కడి తీవ్రవాదులను మన సైనికులు మట్టుబెట్టడంలో నరేంద్రమోదీ చేపట్టిన చర్యలు ప్రపంచాన్నే అబ్బురపరిచాయన్నారు. దేశవ్యాప్తంగా 32 కోట్ల మందితో జన్‌ధన్ బ్యాంకు అకౌంట్ తెరిపించి కోట్లాది కుటుంబాలను ఆదుకున్న ఘనత ఆయనదేనన్నారు. సుమారు 70 సంవత్సరాలు తర్వాత భారతదేశంలో ప్రతి కుటుంబానికి గ్యాస్ కనెక్షన్ ఇప్పించి ఆదుకున్న ఘనత ఆయనదేనన్నారు. దేశంలో వెనుకబడిన కులాలను దృష్టిలో ఉంచుకుని 10 శాతం రిజర్వేషన్లు కల్పించి లక్షలాది కుటుంబాలకు చేయూతనిచ్చిన ఘనత మోదీదే అన్నారు.

రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని వందల కోట్ల రూపాయలతో వాటర్ షెడ్లు చేపట్టామని గుర్తుచేశారు. ఆయుష్మాన్ పథకం కింద కోట్లాది మందికి ఆరోగ్యం అందించే బాధ్యత ప్రధాని మోదీ చేపట్టారన్నారు. కేంద్రం చేపట్టిన పలు పథకాలను పోలింగ్ కేంద్రాల వారీగా ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేపట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో రాయలసీమ పరిధిలోని 8 పార్లమెంట్ స్థానాల్లో విజయకేతనం ఎగురవేసే దిశగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్, జాతీయ కార్యదర్శి సత్యకుమార్, రాష్ట్ర ఇంచార్జి సునీల్ దేవదర్జి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు కందుల రాజమోహన్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పురంధరేశ్వరి తదితరులు ప్రసంగించారు.

కోల్‌కతాకు చంద్రబాబు

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉన్నారనే వాదనను ఇప్పటికే చంద్రబాబు విస్తృత ప్రచారం చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటవుతోందని ఇందులో భాగస్వామ్యం కావాలని ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్‌ను టీఆర్ఎస్ ఆహ్వానించటం తదితర అంశాలన్నింటినీ జాతీయ నేతల భేటీలో వివరించేందుకు చంద్రబాబు సిద్ధమవుతున్నారు. ర్యాలీకి ఏఐసీసీ అధినేత రాహూల్ గాంధీని కూడా ఆహ్వానించినట్లు సమాచారం. అయితే పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ సీనియర్ నేతలు వారించటంతో పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మల్లికార్జున ఖర్గే తదితర నేతలను పంపే అవకాశం ఉందని సమాచారం. మొదటి నుంచి కేంద్రంలో రెండే రెండు కూటములు ఉంటాయని అవి కాంగ్రెస్, బీజేపీ నేతృత్వంలో ఉంటాయని ఇప్పటికే చంద్రబాబు ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తున్న పశ్చిమబెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్‌తో పాటు ఉత్తరప్రదేశ్‌లోని ప్రతిపక్ష బహుజన సమాజ్, సమాజ్‌వాదీ పార్టీల నేతలతో కూడా మరోసారి చర్చలు జరిపి ఎన్నికల అనంతరం బీజేపీయేతర కూటమికి మద్దతిచ్చేలా కూడగట్టేందుకు ఆయా పార్టీల నేతలతో సమావేశం కానున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా కోల్‌కతా ర్యాలీ తరహాలోనే ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ నేతృత్వంలో త్వరలో మరో ర్యాలీ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం. రాష్ట్రాల వారీగా నిర్వహిస్తున్న ర్యాలీలతో పాటు అమరావతిలో జాతీయ నేతలతో కలసి ధర్మపోరాట దీక్ష నిర్వహించటంతో వచ్చే ఎన్నికలకు కార్యాచరణ రూపొందించుకోవాలని టీడీపీ అధినేత చంద్రబాబు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు.

పేలిన సిలిండర్

★ ధ్వంసమైన ఇల్లు, ఆసుపత్రి ★ ఇద్దరు మృతి
★ ముగ్గురికి తీవ్రగాయాలు ★ రోడ్డుపై పరుగులు తీసిన ప్రజలు

కుషాయిగూడ (హైదరాబాద్), జనవరి 18: ఇంట్లో అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి ఇద్దరు మృతిచెందగా, ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. కాప్రా తహశీల్దార్ కార్యాలయం సమీపంలో మోహన్‌లాల్ చౌదరి (45) అతని భార్య నీలాదేవీ (35), కుమారుడు గోవింద్ చౌదరి(14), కూతురు నిఖిత(10) నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ఒక్కసారిగా భారీ శబ్ధంతో సిలిండర్ పేలడంతో ప్రజలు రోడ్డుపై పరుగులు తీశారు. పేలుడు ధాటికి రెండు అంతస్థుల భవనం గోడలు సుమారు 500 మీటర్ల దూరంలో పడిపోవడంతో రోడ్డుపై వెళ్తున్న ఎల్లగందులు రవి(35) అక్కడికక్కడే మృతిచెందాడు. ఒక్కసారిగా భారీగా శబ్ధం, దుమ్ముదూళి చేరిపోయి చీకటి కమ్ముకోవడంతో ప్రజలు ఇళ్లు నుంచి పరుగులు తీశారు. ఏమి జరుగుతుందో తెలుసుకునే సమయనికే ఇరుగుపొరుగు ఇళ్ల కిటికీ అద్దలు పగిలిపోయి విధ్వంసం సంభవించింది. సిలిండర్ పేలుడు ధాటికి రెండు అంతస్థుల భవనం పైనుంచి మోహన్‌లాల్ చౌదరి కింద పడిపోవడంతో వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా మృతిచెందాడు. తీవ్ర గాయలపాలైన నీలాదేవీ, కొడుకు గోవింద్ చౌదరి, కూతరు నిఖితను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తునట్లు పోలీసులు పేర్కొన్నారు. అగ్నిమాపక అధికారులు చేరుకొని పేలుడు విధ్వంసంపై పూర్తి వివరాలు సేకరిస్తునట్లు పేర్కొన్నారు. పేలుడు ధాటికి సమీపంలోని లైఫ్‌లైన్ ఆసుపత్రి భవనానికి పగుళ్లు వచ్చాయి. సుమారు రూ.5లక్షల నష్టం కలిగిందని అంచనా వేస్తున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్

పేలుడు ధాటికి ధ్వంసమైన సంఘటన స్థలాన్ని రాచకొండ కమిషనర్ మహేష్ భగవత్, జాయింట్ కమిషనర్ సుధీర్ బాబు, అల్వాల్ డీసీపీ ఉమా మహేశ్వర శర్మ, ఏసీపీ శివకుమార్, సీఐ చంద్రశేఖర్ సందర్శించారు. పేలుడు తీవ్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇంట్లో సిలిండర్ రీఫిల్లింగ్ చేస్తుండగా పేలుడు సంభవించినట్లు ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు తెలిపారు. సంఘటన స్థలాన్ని క్లూస్ టీమ్, బాంబు స్క్వాడ్స్, డీఆర్ఎఫ్ సిబ్బందితో దర్యాప్తు చేసి వివరాలు వెల్లడించనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా: మేయర్

సిలిండర్ పేలుడు సంఘటనలో మృతిచెందిన బాధిత కుంటంబలకు మూడు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను గ్రేటర్ మేయర్ బొంతు రామ్మోహన్ ప్రకటించారు. పేలుడులో తీవ్ర గాయలైన క్షతగాత్రులు సికింద్రాబాద్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. పేలుడు సంఘటనపై వివరాలు సేకరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పేలుడుతో ధ్వంసమైన ఇంటిని వెంటనే పూర్తిగా కూల్చివేయాలని కాప్రా టౌన్‌ప్లానింగ్ అధికారులకు సూచించారు. సంఘటన వివరాలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి మృతుల కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఉప్పల్ టీడీపీ ఇన్‌చార్జి తూళ్ల వీరేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

టీసీఎల్పీనేతగా భట్టి విక్రమార్క

★ కాంగ్రెస్ అధినేత రాహుల్ నిర్ణయం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 18: తెలంగాణ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, శాసన సభ్యుడు మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడుగా నియమితులయ్యారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఈమేరకు భట్టివిక్రమర్కను సీఎల్పీ నేతగా ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకున్నారని ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడి ఎంపికపై తీవ్ర ఉత్కంఠత నెలకొన్న సంగతి తెలిసిందే. రాహుల్ ఆదేశం మేరకు రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సమక్షంలోనే కాంగ్రెస్ వర్గాలు గొడవపడ్డాయి. సీఎల్పీ నాయకుడి ఎంపికపై పార్టీ శాసన సభ్యులు, ఇతర నాయకుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవటంతో ఈ అంశాన్ని రాహుల్ గాంధీ నిర్ణయానికి వదలివేశారు. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సీఎల్పీ నాయకుడుగా ఎంపిక చేయడాన్ని పలువురు శాసన సభ్యులతోపాటు పీసీసీ సీనియర్ నాయకులు సైతం వ్యతిరేకించారు. వేణుగోపాల్ ఢిల్లీకి వచ్చిన వెంటనే రాహుల్ గాంధీకి తెలంగాణ లెజిస్లేచర్ పార్టీలో నెలకొన్న వివాదాల గురించి వివరించారు. మొత్తం పరిస్థితిని సమీక్షించిన పార్టీ అధినేత ఎస్సీ వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు, శాసన సభ్యుడు మల్లు భట్టివిక్రమార్కను ఎంపిక చేశారు.

క్రీడాభూమి

ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టెన్నిస్

ప్రీ క్వార్టర్స్‌కు ఫెదరర్, నాదల్



రాఫెల్ నాదల్



రోజర్ ఫెదరర్

మెల్బోర్న్, జనవరి 18: డిఫెండింగ్ చాంపియన్, స్విట్జర్లాండ్ వీరుడు రోజర్ ఫెదరర్, ప్రపంచ రెండో ర్యాంక్ ఆటగాడు రాఫెల్ నాదల్ ఇక్కడ జరుగుతున్న ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ మూడో రౌండ్‌లో తమతమ ప్రత్యర్థులను ఓడించి, ప్రీ క్వార్టర్ ఫైనల్స్ చేరారు. మూడో సీడ్‌గా బరిలోకి దిగిన ఫెదరర్ 6-2, 7-5, 6-2 ఆధిక్యంతో టేలర్ ఫ్రిట్జ్‌పై గెలుపొందాడు. అతను తర్వాతి మ్యాచ్‌లో స్టెఫానెస్ సిట్సిపాస్‌ను ఢీకొంటాడు. మరో మూడో రౌండ్ మ్యాచ్‌లో సిట్సిపాస్ 6-3, 3-6, 7-6, 6-4 తేడాతో నికొలొజ్ బాసిలాష్‌పై విజయం సాధించాడు. నాదల్ 6-1, 6-2, 6-4 స్కోరుతో 27వ ర్యాంకర్ అలెక్స్ డి మినార్‌ను ఓడించి ప్రీ క్వార్టర్స్‌లోకి అడుగుపెట్టాడు. అతను క్వార్టర్ ఫైనల్స్‌లో స్థానం కోసం థామస్ బెర్డిచ్‌తో తలపడతాడు. బెర్డిచ్ మూడో రౌండ్‌లో 18వ ర్యాంక్ ఆటగాడు డిగో స్వార్ట్‌మన్‌పై 5-7, 6-3, 7-5, 6-4 తేడాతో విజయాన్ని నమోదు చేశాడు. గ్రిగర్ దిమిత్రోవ్ 7-6, 6-4, 6-4 తేడాతో థామస్ ఫాబియానోపై గెలుపొంది, ఫ్రాన్సెస్ తియాఫోతో నాలుగో రౌండ్ మ్యాచ్‌ని ఖాయం చేసుకున్నాడు. తియాఫో 6-7, 6-3, 4-6, 6-4, 6-3 స్కోరుతో ఆండ్రియాస్ సిప్పీపై గెలిచాడు.



స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: అలెక్స్ కారే సీ విరాట్ కోహ్లీ బీ భువనేశ్వర్ కుమార్ 5, ఆరోన్ ఫించ్ ఎల్‌బీ భువనేశ్వర్ కుమార్ 14, ఉస్మాన్ ఖాజా సీ అండ్ బీ యుజువేంద్ర చాహల్ 34, షాన్ మార్ష్ స్టంప్డ్ మహేంద్ర సింగ్ ధోనీ బీ యుజువేంద్ర చాహల్ 39, పీటర్ హ్యాండ్స్‌కోమ్ ఎల్‌బీ యుజువేంద్ర చాహల్ 58, మార్కస్ స్టొయినిస్ సీ రోహిత్ శర్మ బీ మహమ్మద్ షమీ 26, జే రిచర్డ్‌సన్ సీ కేదార్ జాదవ్ బీ యుజువేంద్ర చాహల్ 16, ఆడం జంపా 10 నాటౌట్, బిల్లీ స్టాన్‌లేక్ బీ మహమ్మద్ షమీ 0, ఎక్స్‌ట్రాలు 10, **మొత్తం (48.4 ఓవర్లలో ఆలౌట్) 230.**

వికెట్ల పతనం: 1-8, 2-27, 3-100, 4-101, 5-123, 6-161, 7-206, 8-219, 9-228, 10-230.

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 8-1-28-2, మహమ్మద్ షమీ 9.4-0-47-2, విజయ్ శంకర్ 6-0-23-0, కేదార్ జాదవ్ 6-0-35-0, రవీంద్ర జడేజా 9-0-53-0, యుజువేంద్ర చాహల్ 10-0-42-6.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ సీ షాన్ మార్ష్ బీ పీటర్ సిడిల్ 9, శిఖర్ ధావన్ సీ అండ్ బీ మార్కస్ స్టొయినిస్ 23, విరాట్ కోహ్లీ సీ అలెక్స్ కారే బీ జే రిచర్డ్‌సన్ 46, మహేంద్ర సింగ్ ధోనీ 87 నాటౌట్, కేదార్ జాదవ్ 61 నాటౌట్, ఎక్స్‌ట్రాలు 8, **మొత్తం (49.2 ఓవర్లలో 3 వికెట్లకు) 234.**

వికెట్ల పతనం: 1-15, 2-59, 3-113.

బౌలింగ్: జే రిచర్డ్‌సన్ 10-1-27-1, పీటర్ సిడిల్ 9-1-56-1, బిల్లీ స్టాన్‌లేక్ 10-0-49-0, గ్లేన్ మాక్స్‌వెల్ 1-0-7-0, ఆడం జంపా 10-0-34-0, మాస్కస్ స్టొయినిస్ 9.2-0-60-1.

ధోనీ జాదూ.. చెలరేగిన చాహల్..

వన్డే సిరీస్ మనదే

మెల్బోర్న్, జనవరి 18: ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా విజయం పరిపూర్ణంగా ముగించింది. మెల్బోర్న్ మైదానంలో శుక్రవారం జరిగిన మూడు వన్డేల్లో చివరిది, మూడోది అయిన కీలక మ్యాచ్‌లో ఏడు వికెట్ల తేడాతో ఘన విజయాన్ని నమోదు చేసింది. మహేంద్ర సింగ్ ధోనీ బ్యాటింగ్‌లో, యుజువేంద్ర చాహల్ బౌలింగ్‌లో విజృంభించడంతో, భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ సేన అద్భుత విజయాన్ని అందుకుంది. ఆసిస్ మైదానంలో ఇంతవరకు ఆడిన ఏ భారత జట్టు కూడా సాధించని ఘనతను టీమిండియా సొంతం చేసుకుంది. ఆస్ట్రేలియా టూర్‌లో భాగంగా తొలుత తలపడిన టీ-20 ఇంటర్నేషనల్ సిరీస్‌ను 1-1తో సమం చేసిన కోహ్లీ సేన ఆ తర్వాత జరిగిన నాలుగు టెస్టుల సిరీస్‌ను సైతం 2-1తో గెల్చుకుంది. ఇపుడు తాజాగా జరిగిన మూడు వన్డేల ద్వైపాక్షిక సిరీస్‌లో సైతం 2-1తో ప్రత్యర్థిపై పైచేయి సాధించి విదేశీ గడ్డపై భారత పతాకాన్ని సగర్వంగా ఎగిరేలా చేసింది. మెల్బోర్న్‌లో శుక్రవారం ఇరు జట్ల మధ్య జరిగిన అత్యంత కీలకమైన ఆఖరి వన్డేలో టీమిండియా గెలుపులో దిగ్గజ ఆటగాడు, మాజీ కెప్టెన్, వికెట్ కీపర్, మిస్టర్ కూల్ మహేంద్ర సింగ్ ధోనీ తన మాయతో జట్టును విజయ తీరాలకు చేర్చడంలో కీలక భూమిక పోషించాడు. బౌలింగ్‌లో మణికట్టు మాంత్రికుడు యుజ్వేంద్ర చాహల్ చెలరేగి 6 వికెట్లు తీసి ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ వెన్నులో వణుకు పుట్టించాడు. ఆఖరి వన్డేలో కెప్టెన్ విరాట్ కోహ్లీ సైతం సమయోచితంగా ఆడి జట్టు గెలుపునకు తన వంతు పాత్రను పోషించాడు.

తొలుత టాస్ గెలిచిన కోహ్లీ సేన ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. తొలి వన్డేలో అద్భుత విజయాన్ని అందుకున్న ఆరోన్ ఫించ్ సేన రెండో మ్యాచ్‌ను కోల్పోయినప్పటికీ అత్యంత కీలకమైన మూడోది, ఆఖరి వన్డేను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పోరాడింది. 49.4 ఓవర్లలో 230 పరుగులకు ఆలౌటైంది. అనంతరం 231 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన భారత్ 49.2 ఓవర్లలో కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 234 పరుగులు చేసి విజయాన్ని ఖాయం చేసుకుని సిరీస్‌ను కైవసం చేసుకుంది.

వికెట్ కీపర్ అలెక్స్ కారే 11 బంతులు ఎదుర్కొని 1 బౌండరీతో 5 పరుగులు చేసి భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో విరాట్ కోహ్లీకి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ దారిపట్టాడు. 24 బంతులు ఎదుర్కొన్న కెప్టెన్ ఆరోన్ ఫించ్ 1 బౌండరీతో 14 పరుగులు చేసి భువనేశ్వర్ కుమార్ చేతిలో ఎల్బీడబ్ల్యూగా వెనుతిరిగాడు. షాన్ మార్ష్ 54 బంతులు ఎదుర్కొని 2 బౌండరీలతో 39 పరుగులు చేసి యుజ్వేంద్ర చాహల్ బౌలింగ్‌లో ధోనీ చేతిలో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. 51 బంతులు ఎదుర్కొన్న ఉస్మాన్ ఖాజా 2 బౌండరీలతో 34 పరుగులు చేసి యుజ్వేంద్ర చాహల్ బౌలింగ్‌లో అతనికే క్యాచ్ ఇచ్చాడు. మార్కస్ స్టొయిన్‌సిస్ 20 బంతులు ఎదుర్కొని 1 బౌండరీతో 10 పరుగులు చేసి యుజ్వేంద్ర చాహల్ బౌలింగ్‌లో రోహిత్ శర్మకు క్యాచ్ ఇచ్చి వెనుతిరిగాడు. గ్లెన్ మాక్స్‌వెల్ 19 బంతులు ఎదుర్కొని 5 బౌండరీలతో 26 పరుగులు చేసి మహమ్మద్ షమీ బౌలింగ్‌లో భువనేశ్వర్ కుమార్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ దారిపట్టాడు. 23 బంతులు ఎదుర్కొన్న జే రిచర్డ్‌సన్ 1 బౌండరీతో 16 పరుగులు చేసి యుజ్వేంద్ర చాహల్ బౌలింగ్‌లో కేదార్ జాదవ్‌కు క్యాచ్ ఇచ్చాడు. పీటర్స్ హ్యాండ్స్‌కాంబ్ 63 బంతులు ఎదుర్కొని 2 బౌండరీలతో 58 పరుగులు చేసి యుజ్వేంద్ర చాహల్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుతిరిగాడు. ఆడమ్ జంపా 14 బంతులు ఎదుర్కొని 8 పరుగులు చేసి యుజ్వేంద్ర చాహల్ బౌలింగ్‌లో 8 పరుగులు చేసి విజయ్ శంకర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుతిరిగాడు. బిల్లీ స్టాన్‌లేక్ 2 బంతులు ఎదుర్కొని పరుగేమీ చేయకుండానే మహమ్మద్ షమీ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. 11 బంతులు ఎదుర్కొన్న పీటర్ సిడిల్ 1 బౌండరీతో 10 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో యుజ్వేంద్ర చాహల్ అత్యధికంగా 6 వికెట్లు పడగొట్టాడు. 10 ఓవర్లు వేసిన చాహల్ 42 పరుగులు మాత్రమే ఇచ్చాడు. భువనేశ్వర్ కుమార్ 8 ఓవర్లలో 28, మహమ్మద్ షమీ 9.4 ఓవర్లలో 47 పరుగులిచ్చి తలో రెండు వికెట్లు తీసుకున్నారు.

అనంతరం 231 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన టీమిండియాకు శుభారంభం దక్కలేదు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన రోహిత్ శర్మ 17 బంతులు ఎదుర్కొని 1 బౌండరీతో 9 పరుగులు చేసి పీటర్ సిడిల్ బౌలింగ్‌లో షాన్ మార్ష్‌కు క్యాచ్ ఇచ్చి నిరాశపరిచాడు. మరో ఓపెనర్ శిఖర్ ధావన్ 46 బంతులు ఎదుర్కొని 23 పరుగులు చేసి మార్కస్ స్టొయిన్‌సిస్ బౌలింగ్‌లో అతనికే క్యాచ్ ఇచ్చి పెవిలియన్ దారిపట్టాడు. మందకొడి పిచ్‌పై పరుగులు తీయడం కష్టసాధ్యమైనా దానిని సుసాధ్యం చేయడంలో భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ కృతకృత్యుడయ్యాడు. 62 బంతులు ఎదుర్కొన్న కోహ్లీ 3 బౌండరీలతో సమయోచితంగా ఆడాడు. 46 పరుగులు చేసి అర్ధసెంచరీకి చేరువలో జే రిచర్డ్‌సన్ బౌలింగ్‌లో అలెక్స్ కారేకి క్యాచ్ ఇచ్చి కోహ్లీ వెనుతిరిగాడు. వికెట్ కీపర్ మహేంద్ర సింగ్ ధోనీ 114 బంతులు ఎదుర్కొని 6 బౌండరీలతో 87 పరుగులతో, 57 బంతులు ఎదుర్కొన్న కేదార్ జాదవ్ 7 బౌండరీలతో 61 పరుగులతో అజేయంగా అర్ధ సెంచరీలు పూర్తి చేసుకుని చివరివరకూ నాటౌట్‌గా నిలిచారు. ఆస్ట్రేలియా బౌలర్లలో పీటర్ సిడిల్ 9 ఓవర్లలో 56, మార్కస్ స్టొయిన్‌సిస్ 9.2 ఓవర్లలో 60, జే రిచర్డ్‌సన్ 10 ఓవర్లలో 27 పరుగులిచ్చి తలో వికెట్ తీసుకున్నారు.

ఏ స్థానంలోనైనా ఆడగలను: ధోనీ

టీమిండియాలో ఏ స్థానంలో చోటు దక్కినా ఆడేందుకు తాను సిద్ధమేనని మాజీ కెప్టెన్, మిస్టర్ కూల్ మహేంద్ర సింగ్ ధోనీ స్పష్టం చేశాడు. 'జట్టుకు అవసరమైనపుడు ఏ స్థానంలోనైనా ఆడేందుకు నేను సిద్ధమే. 14 ఏళ్ల కెరీర్‌లో ఆరో స్థానంలో ఆడనని చెప్పలేను' అని అన్నాడు.

అంకితభావం గల వ్యక్తి ధోనీ: కోహ్లీ

భారత క్రికెట్‌లో మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీకి మించిన అంకితభావం గల క్రికెటర్ ఎవరూ లేరని కెప్టెన్ విరాట్ కోహ్లీ ప్రస్తుతించాడు. 'ఈ సిరీస్‌లో మా టీమంతా ఎంతో ఆనందంగా ఉందంటే దానికి కారకుడు ధోనీనే. అతనికి జట్టులో ఐదో స్థానం ఎంతో అనువైనది. మా అందరి కంటే ఎక్కువ పరుగులు తీసింది అతనే. దేశం కోసం తన వంతు పాత్రను పోషించాడు' అని అన్నాడు.



షరపోవా చేతిలో వొజ్నియా ఔట్


మెల్బోర్న్, జనవరి 18: ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ మహిళల సింగిల్స్‌లో మూడో ర్యాంక్ క్రీడాకారిణి కరోలిన్ వొజ్నియాకికి రష్యా బ్యూటీ మరియా షరపోవా షాకివ్వగా, రెండో ర్యాంకర్ ఏంజెలిక్ కెర్బర్ ముందంజ వేసింది. మూడో రౌండ్‌లో వొజ్నియాకిని 6-4, 4-6, 6-3 తేడాతో ఓడించిన షరపోవా ప్రీ క్వార్టర్ ఫైనల్స్ చేరింది. కాగా, ఏంజెలిక్ కెర్బర్ అద్వితీయ ఫామ్‌ను కొనసాగిస్తూ మూడో రౌండ్‌లో తన ప్రత్యర్థి కింబర్లీ బిరెల్‌ను 6-1, 6-0 తేడాతో చిత్తుచేసింది. 15వ సీడ్‌గా బరిలోకి దిగిన ఆష్లే బార్టీ 7-5, 6-1 స్కోరుతో మరియా సకారీపై విజయం సాధించింది. 11వ ర్యాంక్ క్రీడాకారిణి అరినా సబలెన్కా 3-6, 2-6 తేడాతో అమందా అనిసిమొవా చేతిలో పరాజయాన్ని ఎదుర్కొంది. ఐదో ర్యాంకర్ స్లొయేన్ స్టెఫెన్స్ 7-6, 7-6 ఆధిక్యంతో పెట్రా మార్టిక్‌పై గెలుపొందింది. 19వ ర్యాంక్ క్రీడాకారిణి కరోలిన్ గార్సియాను డానియెల్ కొలిన్స్ 6-3, 6-2 తేడాతో ఓడించి ప్రీ క్వార్టర్స్ చేరింది. అనస్టాషియా పవ్లిచెన్కొవా 6-0, 6-3 తేడాతో అలక్సాండ్రా సస్నోవిచ్‌పై, ఎనిమిదో సీడ్ పెట్రా క్విటోవా 6-1, 6-4 తేడాతో బెలిండా బెన్సిక్‌పై విజయాలను నమోదు చేశారు.

బులియన్

ముంబయిలో		హైదరాబాద్‌లో	
బంగారం (22 క్యారెట్స్)		**బంగారం (22 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 2,907.00	1 గ్రాము:	రూ. 2,856.00
8 గ్రాములు:	రూ.23,256.00	8 గ్రాములు:	రూ. 22,848.00
10 గ్రాములు:	రూ. 29,070.00	10 గ్రాములు:	రూ. 28,560.00
100 గ్రాములు:	రూ.2,90,700.00	100 గ్రాములు:	రూ. 2,85,600.00
బంగారం (24 క్యారెట్స్)		**బంగారం (24 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,109.091	1 గ్రాము:	రూ. 3,054.545
8 గ్రాములు:	రూ. 24,872.728	8 గ్రాములు:	రూ. 24,436.360
10 గ్రాములు:	రూ. 31,090.910	10 గ్రాములు:	రూ. 30,545.450
100 గ్రాములు:	రూ. 3,10,909.10	100 గ్రాములు:	రూ. 3,05,454.50
వెండి		**వెండి**	
8 గ్రాములు:	రూ. 319.20	8 గ్రాములు:	రూ. 319.00
10 గ్రాములు:	రూ. 399.00	10 గ్రాములు:	రూ. 395.00
100 గ్రాములు:	రూ. 3,990.00	100 గ్రాములు:	రూ. 3,950.00
ఒక కిలో:	రూ. 39,900.00	ఒక కేజీ:	రూ. 39,500.00

మరింతగా కరెన్సీ ఆవశ్యకత

విస్తరిస్తున్న జీడీపీ పరిమాణం ● ఆర్‌బీఐ అధికారి వెల్లడి



కోల్‌కతా, జనవరి 18: దేశ స్థూలోత్పత్తి (జీడీపీ) పరిమాణం పెరుగుతున్న దృష్ట్యా ఆర్థిక రంగంలో మరింతగా కరెన్సీ ఆవశ్యకత ఏర్పడుతోందని రిజర్వు బ్యాంకుకు చెందిన అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. 2016 నవంబర్‌లో జరిగిన డీమోనిటరైజేషన్ సమయంలో 500, 1000 కరెన్సీ నోట్లను ప్రభుత్వం రద్దు చేసినపుడు పెద్దయెత్తున కరెన్సీ లోటు ఏర్పడిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీడీపీ) పెరుగుతున్న క్రమంలో ఆర్థిక రంగంలోకి మరింతగా కరెన్సీ రావాల్సిన అవసరం ఏర్పడిందని ఇక్కడ జరిగిన ఓ ముఖాముఖి సందర్భంగా ఆ అధికారి వెల్లడించారు. డీ మానిటరైజేషన్ తర్వాత కేంద్ర ప్రభుత్వం 500 రూపాయల కరెన్సీని కొత్తగా తీసుకువచ్చినప్పటికీ రూ.1000 కరెన్సీని మాత్రం తీసుకురాలేదు. ఐతే 2000 రూపాయల కరెన్సీ నోట్‌ను మాత్రం ఆర్‌బీఐ తీసుకువచ్చింది. కాగా కౌంటర్‌ఫీయట్ నోట్ల కొరత ప్రస్తుతం ఉందని, ప్రస్తుతం చలామణిలో ఉన్న ఈ నోట్లు సరైన ప్రమాణాల్లో లేవని ఆ అధికారి వివరించారు. మరిన్ని సెక్యూరిటీ ఫీచర్లతో కూడిన కరెన్సీని తీసుకువచ్చేందుకు ఆర్బీఐ కృషి చేస్తోందన్నారు. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ) విషయానికి వస్తే వీటి డిపాజిట్ల సమీకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అంబుడ్స్‌మెన్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ఆర్‌బీఐకి చెందిన మరో అధికారి తెలిపారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించి డిజిటల్ అంబుడ్స్‌మెన్ అమలులో ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆర్థిక మంజూర్ల విషయంలో ఆర్బీఐ జాతీయ స్థాయి వ్యూహాన్ని అనుసరిస్తోందని మరో ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ)లకు అడ్డగోలు నిబంధనలు లేకుండా రుణ సదుపాయం పొందేలా చూసేందుకు ఆర్బీఐ ఓ అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిందని ఆ అధికారి పునరుద్ఘాటించారు. బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలతో ఆర్బీఐ సమన్వయంతో వ్యవహరిస్తూ వినియోగదారులకు సహకరిస్తున్నట్టు చెప్పారు.

లక్ష్య సాధనలో వెనుకంజ

'డిజిన్వెస్ట్‌మెంట్'తో రూ.80వేల కోట్ల సమీకరణ ★ రూ.20 వేల కోట్లు తగ్గవచ్చని అంచనా


అదుపు లేని ఆర్థిక లోటే కారణం

ముంబయి, జనవరి 18: దాదాపు రూ.80వేల కోట్లు పెట్టుబడులను వెనక్కు తీసుకునే 'డిజిన్వెస్ట్‌మెంట్' లక్ష్యాలను కేంద్ర ప్రభుత్వం వంద శాతం అందుకునే అవకాశాలు లేవని ఆర్థిక రంగ నిపుణులు అంచనావేస్తున్నారు. ఇందులో దాదాపు 20వేల కోట్ల రూపాయలు తగ్గవచ్చని ఇందుకు ఈ సంవత్సరం ఆర్థిక లోటు 3.5శాతానికి చేరుకున్న ఆర్థిక లోటే కారణమని అంటున్నారు. ఈ యేడాది ఆర్థిక లోటును 3.3 శాతానికి మించనీయ కూడదని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నా అది దాదాపుగా అసాధ్యమైంది. దీనికి డిసిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాల సాధనలో తేడా రావడంతోబాటు, జీఎస్టీ పన్ను వసూళ్లలో తగ్గుదల నమోదు కావడమే కారణాలని రేటింగ్ ఏజెన్సీ 'కేర్ రేటింగ్స్' శుక్రవారం నాడిక్కడ విశ్లేషించింది.'ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 80 వేల కోట్ల పెట్టుబడులు 'డిసిన్వెస్ట్‌మెంట్' ద్వారా వెనక్కు తీసుకోవాలన్న ప్రభుత్వ లక్ష్యం ఓ సవాలుగా మారిందని ప్రత్యేకించి మార్కెట్లలో స్థిరమైన ఆర్థిక పరిస్థితులు లేకపోవడమేనని ఆ విశ్లేషణ వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో డిసిన్వెస్ట్‌మెంట్ లక్ష్యంలో 60 వేల కోట్లు మాత్రమే సాధించే వీలుందని ఆ నివేదిక స్పష్టం చేసింది. గత నాలుగేళ్లుగా 2017-18లో మినహా ఏ సంవత్సరమూ ఈ డిసిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని ప్రభుత్వం చేరుకోలేకపోయిందని తెలిపింది. సరాసరి 65 శాతం మాత్రమే 2014, 2017 సంవత్సరాల్లో లక్ష్యసాధన జరిగిందని, 2014లో మరీ అథమంగా 53 శాతం మాత్రమే లక్ష్య సాధన జరిగిందని అధ్యయన నివేదిక వెల్లడించింది. 2018 ఆర్థిక సంవత్సరంలో మొత్తం డిసిన్వెస్ట్‌మెంట్ ఒక ట్రిలియన్ రూపాయల మేర చేయాలని లక్ష్యం పెట్టుకుంది. ఇది ముందే నిర్దేశించిన రూ.72,500 కోట్లకు అధికం. ఇంకా రెండు నెలల కాలం ఉండగా డిసెంబర్ నాటికి లక్ష్యంలో 43 శాతం 32,142 కోట్ల రూపాయలు సమీకరించింది. కేంద్ర ప్రభుత్వ రంగ ఎంటర్‌ప్రైజెస్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్) ద్వారా సుమారు రూ. 25,325 కోట్ల సమీకరణ జరిగింది. తద్వారా ఏకకాలంలో వివిధ సీపీఎస్ఈల్లో సింగిల్ ఆఫరింగ్ ద్వారా ప్రభుత్వ వాటాల విక్రయానికి వీలు కలిగింది. రెండోదఫా 'ఆఫర్ ఫర్ సేల్' రూ.5,218 కోట్లకు వచ్చే అవకాశాలున్నాయి.

తొలిదశలో 1,500 కోట్ల రూపాయలు బైబ్యాక్‌ల ద్వారా సమీకరించడం జరిగింది. ఈ క్రమంలో 'భారత్ 22 ఈటీఎఫ్' పేరిట మరో ట్రాంచేను తీసుకవచ్చే యత్నాలను ప్రభుత్వం ఆరంభించింది. దీని ద్వారా రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్‌లో 52.63 శాతం వాటాలను విక్రయించి 14వేల కోట్ల సమీకరించేందుకు నిర్ణయించిందని నివేదిక వెల్లడించింది. అలాగే ప్రభుత్వ రంగ యూనిట్ల నుంచి మరో 12 వేల కోట్ల రూపాయలు సమీకరించాలని నిర్ణయించినట్టు వివరించింది. ఐతే ఈ చర్యలు ఆర్థికలోటును ఎంతమేర భర్తీ చేస్తాయన్నది తెలియాల్సివుంది.

మార్కెట్‌కు 'రిల్' ఊతం

న్యూఢిల్లీ, జనవరి 18: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (రిల్)కు చెందిన చెందిన షేర్లు శుక్రవారం రెండు శాతం లాభాల వృద్ధిని నమోదు చేసి, మార్కెట్‌కు ఊతమిచ్చాయి. ప్రైవేటు రంగంలో కేవలం త్రైమాసికంలోనే రూ.10వేల కోట్ల లాభాలు గడించిన సంస్థగా రికార్డు సృష్టించడంతో ఈ సంస్థ వాటాల పెరుగుదలకు ఊతం లభించింది. మార్కెట్లలో ఉదయం సానుకూల పరిస్థితుల్లో ఆరంభమైన ఈ కంపెనీ వాటాలు 2శాతం పెరుగుదల నమోదుచేసి 1,156.55 కోట్ల రూపాయల అదనపు రాబడి చేకూరింది. పెట్రో కెమికల్, రీటెయిల్, టెలికాం వాణిజ్య విభాగాల్లో ఈ సంస్థ భారీగా లాభాలను ఆర్జించడంతో వాటివైపు మదుపర్లు మొగ్గుచూపారు. రీఫైనరీ మార్జిన్లు మాత్రం కొత్త తగ్గుదల నమోదు చేశాయి. కాగా గడచిన డిసెంబర్ 31తో ముగిసిన త్రైమాసికంలో ఈ కంపెనీ 8.8 శాతం వృద్ధిని నమోదు చేసి రూ.10,215 కోట్ల లాభాలను ఆర్జించింది. అంటే ఒక్కో షేర్‌పైన 17.3 రూపాయలు ఈ కంపెనీకి లాభాలు వచ్చాయి. గత సంవత్సరం ఇదే కాలానికి కంపెనీకి రూ.9,420 కోట్ల లాభాలు వచ్చాయి. 2013లో జనవరి నుంచి మార్చి వరకు 14,512.81 కోట్లు స్థూల ఆదాయాన్ని ఆర్జించిన ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) భారతీయ సంస్థల్లో అత్యధిక త్రైమాసిక లాభాలు గడించిన సంస్థగా గణుతికెక్కింది.



గాంధీనగర్‌లో గురువారం జరిగిన 'వైబ్రెంట్ గుజరాత్ గ్లోబ్ సమ్మిట్-2019'కు హాజరైన సందర్భంగా హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (హెచ్‌డీఎఫ్‌సీ) చైర్మన్ దీపక్ పరేఖ్‌తో కరచాలనం చేస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (రిల్) చైర్‌పర్సన్ ముఖేష్ అంబానీ.

వాణిజ్యభూమి

నామమాత్రపు లాభం


స్టాక్ మార్కెట్‌లో కొనసాగిన అనిశ్చితి

'రిల్' దూకుడు

రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (రిల్) శుక్రవారం దూకుడుగా ముందుకు దూసుకెళ్లింది. ఆ కంపెనీ స్టాక్స్ ఏకంగా 4.43 శాతం లాభాలను ఆర్జించాయి. ఒక ఆర్థిక సంవత్సరంలో 10,000 కోట్ల రూపాయలకుపైగా త్రైమాసిక లాభాన్ని ప్రకటించిన భారత తొలి కంపెనీగా రికార్డు సృష్టించిన రిల్ షేర్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. పెట్టుబడిదారులు ఈ కంపెనీ షేర్లను కొనేందుకు ఆసక్తిని ప్రదర్శించడంతో, మిగతా కంపెనీల షేర్ల ట్రేడింగ్ నత్తనడకన సాగింది. రిల్ తర్వాత లాభపడిన కంపెనీల్లో కోటక్ మహీంద్ర, హెచ్‌సీఎల్ టెక్, ఓఎన్‌జీసీ, ఏషియన్ పెయింట్స్ ఉన్నాయి. కాగా, సన్ ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, ఎల్ అండ్ టీ, యాక్సిస్ బ్యాంక్, ఎస్ బ్యాంక్ కంపెనీల షేర్లు నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. నిఫ్టీలోనూ రిల్ భారీ లాభాలను ఆర్జించింది. ఈ కంపెనీ వాటాల ధర 4.53 శాతం పెరిగాయి. విప్రో 3.32, కోటక్ మహీంద్ర 1.66, హిందాల్కో 1.43, హెచ్‌సీఎల్ టెక్ 1.39 శాతం చొప్పున లాభపడ్డాయి. బాంబే స్టాక్ ఎక్ఛేంజ్ (బీఎస్ఈ)లో సన్ ఫార్మా అత్యధికంగా 8.52 శాతం పతనాన్ని చవిచూడగా, నిఫ్టీలోనూ ఆ కంపెనీ షేర్లకు డిమాండ్ పడిపోయింది. 8.51 శాతం నష్టంతో షేర్ల అమ్మకాలు కొనసాగాయి. భారతీ ఎయిర్‌టెల్ 6.47, గెయిల్ 3.28, హెచ్‌పీసీఎల్ 2.01, ఎల్ అండ్ టీ 1.97 శాతం నష్టాలను ఎదుర్కొన్నాయి.

ముంబయి, జనవరి 18: భారత స్టాక్ మార్కెట్‌లో లావాదేవీలకు ఈవారం చివరి రోజైన శుక్రవారం కూడా అనిశ్చితి కొనసాగింది. లాభనష్టాల మధ్య ఊగిసలాడిన సెనె్సక్స్ చివరికి నామమాత్రపు లాభంతో బయటపడింది. మొదటి నుంచి మదుపరులు అనాసక్తిని ప్రదర్శించడం, అంతర్జాతీయ సూచీల్లో సానుకూల ధోరణులు లేకపోవడం వంటి అంశాలు స్టాక్ మార్కెట్‌పై ప్రభావం చూపాయి. అటు అమ్మకాలు ఒత్తిళ్లుగానీ, ఇటు కొనుగోళ్ల హోరుగానీ పెద్దగా లేకపోవడంతో, ఒడిదుడుకుల ప్రయాణం కొనసాగించిన ట్రేడింగ్ చివరికి 12,53 పాయింట్లు (0.03 శాతం) పెరిగి, 36,386.61 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 1.75 పాయింట్లు (0.02 శాతం) పెరిగి, 10,906.95 పాయింట్లుగా నమోదైంది. కాగా, ఈవారం మొత్తంలో జరిగిన లావాదేవీలను గమనిస్తే, సెనె్సక్స్ లాభాలను ఆర్జించిందికానీ, అవి నామాత్రంగానే ఉండడం గమనార్హం. మొత్తంగా చూస్తే, ఈవారం సెనె్సక్స్ 378.77 పాయింట్లు లాభపడింది.





తగ్గిన బంగారం ధర

న్యూఢిల్లీ, జనవరి 18: బులియన్ మార్కెట్‌లో వరుసగా నాలుగు రోజులు లాభాల బాటలో పరుగులు తీసిన బంగారం ధర శుక్రవారం స్వల్పంగా తగ్గింది. 10 గ్రాముల బంగారం ధర 80 రూపాయిలు పతనం కావడంతో 33,220 రూపాయలుగా ముగిసింది. ఆభరణాల అమ్మకం దారుల నుంచి ఆశించిన స్థాయిలో డిమాండ్ లేకపోవడంతో, బులియన్ మార్కెట్‌కు నష్టం తప్పలేదు. అయితే, పారిశ్రామిక రంగం నుంచి డిమాండ్ పెరగడంతో, కిలో వెండి ధర 180 రూపాయలు పెరిగి, 40,380 రూపాయలకు చేరింది.




అంతర్జాతీయ హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్‌లో ఎగిరేందుకు సిద్ధంగా ఉన్న బెలూన్లు, ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న పర్యాటక శాఖ మంత్రి అఖిలప్రియ, ఎండీ, ఐటీడీఏ పీవో

అరకులోయలో హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్

హాజరైన 15 దేశాల ఔత్సాహికులు

అనుకూలించిన వాతావరణం ❖ పర్యాటక శాఖ హ్యాపీ

అరకులోయ, జనవరి 18: ప్రముఖ పర్యాటక కేంద్రమైన విశాఖ జిల్లా అరకులోయలో అంతర్జాతీయ హా ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఆంధ్రా ఊటీ అరకులోయలో నిర్వహిస్తున్న అతి పెద్ద బెలూన్ ఫెస్టివల్‌ను పాడేరు ఐటీడీఏ పీవో డీకే బాలాజీ ప్రారంభించారు. గిరిజన యువకులతో కలిసి బెలూన్ బుట్టలో ఎక్కి విదేశీ ప్రతినిధుల సమక్షంలో గాలిలో విహరించారు. దేశంలోనే పెద్దదైన ఈ ఫెస్టివల్‌లో 15 దేశాలకు చెందిన ఔత్సాహికులు 20 హాట్ బెలూన్లతో విన్యాసాలు ప్రదర్శించారు. అమెరికా, ఇంగ్లండ్, రష్యా, కెనడా, మలేషియా, స్విట్జర్లాండ్, బ్రెజిల్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా సహా పదిహేను దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్న బెలూన్ ఫెస్టివల్‌ను ఈ సారి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నాలుగు కోట్ల రూపాయలు వెచ్చించి నిర్వహిస్తున్న ఈ వేడుకకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విస్తృత ఏర్పాట్లు చేసారు. అరకులోయలో మొదటి సారి 2017 నవంబర్‌లో నిర్వహించిన బెలూన్ ఫెస్టివల్ వాతావరణం అనుకూలించక అనుకున్నంతగా విజయవంతం కాలేదు. భారీ వర్షాల కారణంగా ఈ ఉత్సవం పర్యాటకులను ఆకట్టుకోలేకపోయింది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ సంవత్సరం ముందు జాగ్రత్తలు తీసుకుని బెలూన్ ఫెస్టివల్‌కు శ్రీకారం చుట్టారు. అరకులోయలో తొలిసారి నిర్వహించిన బెలూన్ ఫెస్టివల్‌ను మన దేశానికి చెందిన రెండు బెలూన్లు, పదమూడు దేశాల నుంచి పదహారు బెలూన్లు విన్యాసాల్లో పాల్గొన్నాయి. అయితే ఈ సారి మాత్రం పదిహేను దేశాలకు చెందిన ప్రతినిధులతో 21 బెలూన్లతో విన్యాసాలు చేపడుతూ చూపరులకు కనువిందు చేస్తున్నారు. దేశంలో 21 బెలూన్లతో ఈ ఉత్సవాలను నిర్వహించడం ఇదే ప్రథమం కావడం విశేషం. సముద్ర మట్టానికి అత్యంత ఎత్తైన భాగంలో ఉన్న అరకులోయలో బెలూన్ ఫెస్టివల్ నిర్వహించడానికి అనుకూలంగా ఉండడంతో పర్యాటక శాఖ ఈ వేడుకకు ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుంది. ఈ నెల 18 నుంచి 20 వరకు మూడు రోజుల పాటు నిర్వహించే బెలూన్ ఫెస్టివల్‌లో ప్రజలను భాగస్వామ్యం చేసా రు. అయితే దట్టంగా కురుస్తున్న పొగ మంచు, చలిగాలుల కారణంగా బెలూన్లను ఎగురవేసే సమయాల్లో కొద్దిపాటి మార్పులు చేయాల్సి వచ్చింది. ఉదయం ఆరు గంటలకు బెలూన్లను ఎగురవేయాల్సి ఉండగా పొగ మంచు కారణంగా తొమ్మిది గంటలకు మార్పు చేసారు. బెలూన్ ఫెస్టివల్ ప్రారంభం రోజు విభిన్న ఆకారాలతో కూడిన బెలూన్లను ఎగురవేయడంతో పలువురు ఆసక్తిగా వీటిని వీక్షించారు. జోకర్, గుడ్డు, తేనెటీగ, బేబీ కారు ఆకారాలు గల బెలూన్లు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ బెలూన్లు గాలిలో నాలుగు వేల అడుగుల ఎత్తుకు ఎగిరి అమితంగా ఆకట్టుకున్నాయి. మూడు రోజుల పాటు జరిగే బెలూన్ ఫెస్టివల్‌కు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అరకులోయ పరిసర ప్రాంతాలకు చెందిన గిరిజనులు చలిని కూడా లెక్క చేయకుండా ఈ వేడుకలను వీక్షించేందుకు తరలివస్తుండడంతో ఈ ప్రాంతమంతా సందడిగా మారింది. బెలూన్ ఉత్సవం ప్రారంభోత్సవంలో పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ హిమాంశు శుక్లా, పర్యాటక శాఖ జిల్లా అధికారులు ప్రసాదరెడ్డి, పూర్ణిమా దేవి, ఫెస్టివల్ బృంద నాయకుడు కెప్టెన్ కరీముల్లా సయ్యద్, ఆర్గనైజర్ సుమిత్ గార్గ్, అఖిల భారత అడ్వంచర్ టూర్ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏ రాజకీయ పార్టీలోనూ చేరను

❖ బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ సీటు నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా
❖ అన్ని పార్టీల్లో చిత్తశుద్ధి లోపించింది ❖ సినీనటుడు ప్రకాశ్ రాజ్



బెంగళూరు, జనవరి 18: తాను ఏ రాజకీయ పార్టీలో చేరనని కాని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని సినీనటుడు ప్రకాశ్ రాజ్ ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న రాజకీయ పార్టీల్లో చిత్తశుద్ధి లోపించిందని, దివాళాకోరు రాజకీయాలకు పాల్పడుతున్నాయన్నారు. శుక్రవారం ఇక్కడ ఆయన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ, తాను బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేస్తానని చెప్పారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏ పార్టీలో చేరినా మూడు నెలల కంటే మించి ఉండలేనన్నారు. తాను ప్రజల వాణిని బలంగా వినిపించే నేతగా ఉండాలనుకుంటున్నానని చెప్పారు. విధేయత లేని ప్రజల పట్ల కూడా ఆగ్రహం ఉండాలన్నారు. కర్నాటకలో ఏ పార్టీ, కూటమిల పట్ల తనకు నమ్మకం లేదన్నారు. ఈ పార్టీలు కీచులాడుకుంటున్నాయన్నారు. బీజేపీ అనే పార్టీ విధేయత, చిత్తశుద్ధిలేని నేతల పార్టీ అన్నారు. వీరు తమకు తాము గోభక్తిపరులమని చెప్పుకుంటారన్నారు. మకర సంక్రాంతి రోజు బీజేపీ ఎమ్మెల్యేలు కర్నాటకలో ఉండకుండా హర్యానా హోటళ్లలో మకాం చేశారన్నారు. తాను బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ సీటు నుంచి పోటీ చేయడం వల్ల లౌకిక పార్టీ అభ్యర్థుల ఓట్లకు గండిపడుతుందనే వాదనను ఆయన కొట్టివేశారు. తన గెలుపు కోసం సెక్యులర్ పార్టీలు కృషి చేయాలన్నారు. మతతత్వశక్తులకు వ్యతిరేకంగా ఏర్పాటవుతున్న మహాకూటమిలో చేరేందుకు తాను వ్యతిరేకం కానన్నారు. తాను పుట్టిపెరిగి చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకునేందుకు కారణమైన బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ సీటు నుంచి పోటీచేస్తానన్నారు. బీజేపీ వత్తిడి వల్ల తనకు బాలీవుడ్ చిత్రపరిశ్రమ సినిమాల్లో పాత్రలు ఇవ్వడం లేదన్నారు.

వ్యాధుల నిర్ధారణకు ఎంజైమ్ పరీక్ష!

❖ ఖర్చుతక్కువ.. ఫలితం ఎక్కువ ❖ లండన్ శాస్త్రవేత్తల ముందడుగు

లండన్, జనవరి 18: వ్యాధుల నిర్ధారణ, చికిత్స వ్యయం పెరిగిపోతున్న నేపథ్యంలో పరిశోధకులు అతి తక్కువ ఖర్చుతో అన్ని రకాల వ్యాధులను నిర్ధారించే ఓ ప్రక్రియను వెలుగులోకి తెచ్చారు. తక్కువ ఖర్చు కావడమే కాకుండా చాలా వేగంగా పనిచేసే ఈ ఎంజైమ్ పరీక్ష ద్వారా వ్యాధులను కచ్చితంగా నిర్ధారించ వచ్చని, బ్యాక్టీరియా పరమైన దోషాలను లోపరహితంగా గుర్తించవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. యూకేలోని క్వీన్స్ యూనివర్శిటీకి చెందిన శాస్త్రవేత్తలు ఈ దిశగా పరీక్షలు జరిపి అనుకున్న ఫలితాలను సాధించారని మనుషులు, జంతువులకు సంబంధించి వ్యాధులను నిర్ధారించడంతోపాటు ఆహారపదార్థాల్లో కూడా కాలుష్యాన్ని ఈ పరీక్ష ద్వారా పసిగట్టవచ్చని స్పష్టం చేశారు. ప్రోటియాసిస్‌గా పేర్కొనే ఈ ఎంజైమ్ మార్కర్లను ఈ పరీక్ష ద్వారా నిర్ధారించ వచ్చని చెబుతున్న శాస్త్రవేత్తలు 'మానవ శరీరంలో అతి సూక్ష్మజీవుల వృద్ధికి ప్రోటియాసిస్ కారణమవుతోంది. అంతేకాకుండా అనేక వ్యాధులు ప్రబలం కావడానికి ఇదే మూలం'అని తమ పరిశోధన పత్రంలో వెల్లడించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తుల మూత్రలో ప్రోటీయాసిస్ స్థాయి అధికంగా ఉంటుందని, అదే విధంగా అంటువ్యాధులకు దారితీసే గాయాల్లో కూడా ఇది ఎక్కువగా కనిపిస్తుందని చెప్పారు. ప్రస్తుతం ప్రోటీయాసిస్ నిర్ధారణ పద్ధతులు అత్యంత వ్యయంతో కూడినవిగా ఓపట్టాన తేలనివి కావడంతో ఈ ఎంజైమ్ పరీక్షా విధానాన్ని తాము అభివృద్ధి చేసినట్టు తెలిపారు. పైగా ప్రస్తుతం ఉన్న వ్యాధి నిర్ధారణ విధానాలు కచ్చితంగా రోగాలను గుర్తించే పరిస్థితి లేదని వెల్లడించిన పరిశోధకులు 'మేం రూపొందించిన నానో సెన్సార్ ద్వారా ప్రోటీయాస్‌ను వేగంగా, కచ్చితంగా నిర్ధారించవచ్చు. లేబొరెటరీ పరిస్థితులకు అతీతంగానే ఈ వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరపవచ్చు'అని క్వీన్స్ వర్శిటీ ప్రొఫెసర్ క్లెయిర్ మెక్‌వీ వెల్లడించారు.

మరింత ప్రమాదకర స్థాయికి కేంద్ర బడ్జెట్ లోటు

తక్షణం సమీక్షించుకోవాల్సిన ఆవశ్యకత

రైతులకు నగదు పథకం పెడితే మరింతగా ఆర్థిక లోటు ❖ ఆర్థిక రంగ నిపుణుల హెచ్చరిక



ఢిల్లీ, జనవరి 18: ఇటీవలి ఎన్నిల ఫలితాలు, రానున్న సార్వత్రిక ఎన్నికల క్రమంలో బడ్జెట్ లోటుపై కేంద్ర ప్రభుత్వం సమీక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. మరోవైపురైతులకు ధన రూపేణా చెల్లింపులు చేసే అవకాశం ఉందన్న ఊహాగానాలూ పెరుగుతున్నాయి. వరుసగా రెండో సంవత్సరం కూడా కేంద్ర ప్రభుత్వం సాహసోపేతమైన క్లిష్టతర చర్యలతో నిర్దిష్ట ప్రణాళికా లక్ష్యాలకు తిలోదకాలిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో దేశ స్థూల ఉత్పత్తి (జీడీపీ)లో 3.5 శాతం తేడా వచ్చే అవకాశాలున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈక్రమంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 1న లోక్‌సభలో బడ్జెట్ అంచనాలను ప్రవేశపెట్టనున్నారు. దీంతో ఇంకా నెల రోజుల ముందునుంచే రాబోయే బడ్జెట్‌పై, ప్రధానంగా ప్రభుత్వ సాహసోపేత నిర్ణయాలపై సర్వత్రా చర్చ మొదలైంది. ప్రధాన లక్ష్యాలకు ఈ సంవత్సరం సైతం నీళ్లొదిలే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. రానున్న ఎన్నికలు సవాలుగా మారిన క్రమంలో జనాదరణ,ప్రఖ్యాతిపైనే దృష్టి నిలిపిన కేంద్ర ప్రభుత్వం అందుకు సంబంధించిన పథకాలను వచ్చే బడ్జెట్ లోప్రకటించే అవకాశం ఉందంటున్నారు.ప్రత్యేకించి తెలంగాణ ప్రభుత్వ తరహాలో రైతులకు నగదు రూపేణా లబ్ధిచేకూర్చే అంశాన్ని, అలాగే పన్ను మినహాయింపులను కల్పించే విషయాన్ని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిసింది. ఈక్రమంలో రానున్న ఎన్నికల్లో ఓటర్ల దృష్టిని ఆకట్టుకునే విషయాలపైనే వచ్చే బడ్జెట్ అంచనాలు కేంద్రీకృతం అయ్యే అవకాశాలున్నాయంటున్నారు. ప్రత్యేకించి ఇటీవలి ఎన్నికల్లో ప్రధాన రాష్ట్రాల్లో బీజేపీ నియంత్రణ కోల్పోవడంతో కేంద్ర దృక్పథంలో మార్పు వచ్చిందంటున్నారు. దీంతో మార్చి నాటికి ముగిసే ఆర్థిక సంవత్సరంలో దేశ స్థూల ఉత్పత్తి (జీడీపీ)లో సుమారు 3.5 శాతం తేడా వచ్చే అవకాశం ఉందని, ఇది ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అంచనా 3.3 శాతం కన్నా అధికమని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రైతులకు నేరుగా ఆర్థిక లబ్ధి చేకూర్చాలన్న ప్రణాళికలు దేశ ఆర్థిక లోటుకు మరిన్ని సవాళ్లు విసిరే అవకాశం ఉందని న్యూయార్క్‌కు చెందిన ప్రఖ్యాత ఆర్థిక నిపుణుడు విలియమ్ ఫోస్టర్ అభిప్రాయపడుతున్నారు. ఇందువల్ల సమీప భవిష్యత్తులోప్రభుత్వం తన ఆర్థిక వనరులు పెంచుకునే అవకాశాలు తగ్గుతాయన్నారు. మోదీ ప్రభుత్వం 2017లో దేశాన్ని అరుదైన అభివృద్ధి పథంలో నడిపింది. ప్రత్యేకించి పలు సంస్కరణలకు తెరలేపి పన్ను విధానంలో లోటుపాట్లు, బ్యాంకుల్లో అవినీతిని అరికట్టేందుకు చేపట్టిన చర్యలు దీర్ఘకాలంలో దేశ ఆర్థిక రంగానికి విస్తృత ప్రయోజనాలు చేకూర్చేలా వున్నాయని అంతర్జాతీయ ఆర్థిక నిపుణులు సైతం కితాబిస్తున్నారు.

బాండ్ల ద్వారా..

కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే వార్షిక ఆర్థిక లోటు లక్ష్యాలను గడచిన అక్టోబర్ నాటికే అధిగమించింది. ప్రత్యక్ష పన్ను వసూళ్లలోనూ భారీ తగ్గుదల నమోదైంది. ఇక ప్రభుత్వ రంగ కంపెనీల ఆస్తుల అమ్మకాలు, డివిడెండ్ చెల్లింపుల ద్వారా సమకూరిన ఆదాయ వివరాలు అందాల్సివుంది. కాగా మదుపర్లు ఇప్పటికే బలహీన రంగాల్లోని పెట్టుబడుల అమ్మకాలకు పాల్పడుతున్నారు. వచ్చే పదేళ్ల కాలానికి లబ్ధిచేకూర్చే ఆర్థిక అంశాలు గత కొన్ని వారాలుగా తగ్గుముఖం పట్టాయి. ప్రధాన కారణం రూపాయి విలువ తగ్గడమేనని అంటున్నారు. ఇలావుండగా ప్రస్తుత ఆర్థిక స్థితిగతులను పరిగణలోకి తీసుకుంటే ఈ ఆర్థిక సంవత్సరంలో రైతులకు నగదు లబ్ధిచేకూర్చే పథకం అమలులోకి రాకపోచ్చని ముంబయికి చెందిన ఆర్థిక నిపుణురాలు అభిప్రాయపడ్డారు. ప్రాథమిక అంచనాల దృష్ట్యా ఈ పథకానికి సుమారు 2 లక్షల కోట్ల రూపాయలు ఖర్చువుతుందని తెలుస్తోంది. ఇది దేశ జీడీపీలో 1.2 శాతం. ఒక వేళ రాష్ట్రాలు ఇందులో భాగస్వామ్యం అయితే ఆర్థిక భారం కొంత తగ్గవచ్చు. ఇలాంటి నగదు బదిలీ పథకం వల్ల ప్రస్తుతం ఉన్న ఆహారం, ఎరువులు వంటి ప్రధాన సబ్సిడీలకు విఘాతం కలగవచ్చని అంటున్నారు. కాగా రైతుల నగదు బదిలీ పథకంలో రాష్ట్రాలనూ భాగస్వాములను చేస్తే అదనంగా మరో లక్ష కోట్ల ఆర్థిక భారం పెరుగుతుందని, అందువల్ల వార్షిక ఆర్థిక లోటు 3.5 శాతానికి మించుతుందని మరికొంత మంది నిపుణులు అంచనావేస్తున్నారు.

చిన్న తరహా పొదుపు పథకాలతో లబ్ధి

ప్రభుత్వ చిన్నతరహా పొదుపథకాల్లో వచ్చే ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ప్రత్యేకించి దేశానికి అదనపు ఆదాయాన్ని చేకూర్చే విషయంలోప్రస్తుతం ఇన్వెస్టర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఆపద్బాంధవుడిగా రిజర్వు బ్యాంకు వ్యవహరించే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఆ బ్యాంకు మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించడం ఒక్కటే మార్గంగా కనిపిస్తోందని అభిప్రాయపడుతున్నారు.

అంపశయ్య నవీన్‌కు నేడు లోక్‌నాయక్ ఫౌండేషన్

అవార్డు ప్రదానం



Ampashayya Naveen

విశాఖపట్నం, జనవరి 18: లోక్‌నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వర్గీయ ఎన్టీ రామారావు, స్వర్గీయ హరివంశరాయ్ బచ్చన్‌ల స్మృత్యర్థం ఏటా నిర్వహించే ఆంధ్ర జ్ఞానపీఠ్ అవార్డును ఈ ఏడాది ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్‌కు ఈనెల 19న విశాఖలో ప్రదానం చేస్తామని లోక్‌నాయక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. విశాఖలోని లోక్‌నాయక్ ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్య వికాసంలో విశేష కృషి చేసిన నవీన్‌కు ఈ ఏడాది అవార్డును అందించేందుకు కమిటీ నిర్ణయించిందన్నారు. వీరితో పాటు బాలల వికాసానికి కృషి చేస్తున్న గుంటూరుకు చెందిన ఎన్.మంగాదేవికి, దివ్యాంగుల, కళా సాహిత్య సాంస్కృతిక రంగాలకు చేసిన సేవలకు గుర్తింపుగా హైదరాబాద్‌కు చెందిన వంశీ రామరాజుకు రూ.50 వేల నగదుతో పాటు జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేస్తామన్నారు. ఇప్పటి వరకూ 15 ఏళ్లుగా రాష్ట్రంలోని వివిధ రంగాల్లో సేవ లందించిన వారికి అవార్డులు ప్రదానం చేశామన్నారు. ఆంధ్రజ్ఞానపీఠ్ అవార్డుతో పాటు రూ.1.50 లక్షల నగదును నవీన్‌కు అందిస్తామన్నారు. విశాఖలోని కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శరద్ అరవింద్ బాబ్డే, జస్టిస్ లావు నాగేశ్వరరావు, విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్ హాజరువుతారన్నారు. అవార్డుల పురస్కార ప్రధానోత్సవంలో భాగంగా ప్రయోగం థియేటర్ గ్రూపు వారితో మొక్కపాటి నరసింహమూర్తి నవలకు నాటక రూపం బారిస్టర్ పార్వతీశం నాటికను ప్రత్యేకంగా ప్రదర్శిస్తామన్నారు.

అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

అక్రమ ఆయుధాలు సరఫరా చేస్తున్న ఇద్దరు సభ్యులు



ముఠా సభ్యుల వివరాలను వెల్లడిస్తున్న రాచకొండ సీపీ మహేష్ భగవత్

హైదరాబాద్, జనవరి 18: అక్రమంగా ఆయుధాలను సరఫరా చేస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర మూఠా సభ్యులను రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద రెండు పిస్టల్స్, రెండు రౌండ్ల బుల్లెట్లు, రెండు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఎల్బీనగర్ సీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సీపీ మహేష్ భగవత్ తెలిపిన వివరాల ప్రకారం - మహారాష్ట్ర థానే జిల్లా బీవండి గ్రామానికి చెందిన దత్తు వీరేష్ కోలి(31) గార్మెంట్ వ్యాపారం చేసేవాడు. అదే గ్రామానికి చెందిన శ్యాం సుందర్ భూమయ్య వడ్డెపల్లి (29) ప్రవేటు వ్యాపారం చేస్తున్నాడు. వీరు ఇద్దరు స్నేహితులు. దత్తు వీరేష్ కోలికీ నేర చరిత్ర ఉంది. యూపీ, బిహార్ రాష్ట్రాల నుంచి అక్రమంగా ఆయుధాలను కొనుగోలు చేస్తూ వివిధ రాష్ట్రాలలో విక్రయిస్తుంటాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అజంగర్‌కు చెందిన అక్రమ ఆయుధాలను సరఫరా చేసే జంషీర్ అలీయాస్ హసన్‌తో వీరేష్ కోలికీ పరిచయం ఏర్పడింది. జంషీర్ వద్ద తక్కువ ధరకు ఆయుధాలను కొనుగోలు చేసి రూ.లక్షకు ఇతర నగరాల నుంచి తనను సంప్రదించిన వ్యక్తులకు దత్తు వీరేష్ కోలి.. పిస్టల్స్, బుల్లెట్స్‌ను సరఫరా చేస్తుంటాడు. ఎల్బీనగర్‌లోని సాయి లాడ్జిలో బసచేసి తమ వెంట తెచ్చుకున్న రెండు పిస్టల్స్, రెండు రౌండ్ల బుల్లెట్లను కస్టమర్లకు అమ్మేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసుల సహకారంతో ఎల్బీనగర్ పోలీసులు మూకుమ్మడిగా ఎల్బీనగర్‌లోని సాయి లాడ్జిపై దాడులు నిర్వహించారు. ఆయుధాలు సరఫరా చేస్తున్న అంతరాష్ట్ర ముఠా సభ్యులైన దత్తువీరేష్ కోలి, అతనికి సహకరించిన శ్యాంసుందర్ భూమయ్య వడ్డెపల్లిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద ఉన్న రెండు పిస్టల్స్, రెండు రౌండ్ల బుల్లెట్స్, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని, పరారీలో ఉన్న జంషీర్‌తో పాటు వారికి సహకరించిన ముఠా సభ్యులను త్వరలో అరెస్ట్ చేస్తామన సీపీ వెల్లడించారు.

కర్నాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశానికి

నలుగురు గైర్హాజరు

ప్రభుత్వానికి ముప్పేమీలేదు: మాజీ సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు, జనవరి 18: కర్నాటక కాంగ్రెస్ లెజిస్లేచర్ సమావేశానికి నలుగురు అసమ్మతి ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. జేడీఎస్, కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వానికి ప్రతిపక్ష పార్టీ బీజేపీ కూటమి నుంచి ముప్పుపొంచి ఉండడంతో బల ప్రదర్శనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల సమావేశం శుక్రవారం జరిగింది. కాగా ఈ ఎమ్మెల్యేలు గైర్హాజరుకావడం వల్ల ప్రభుత్వానికి వెంటనే వచ్చే ముప్పేమీ లేదని కాంగ్రెస్ నేతలంటున్నారు. ఏడు నెలల క్రితం కర్నాటకలో జేడీఎస్, కాంగ్రెస్ పార్టీ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. కాగా గైర్హాజరైన ఎమ్మెల్యేలు పార్టీని వీడితే తీవ్రపరిణామాలు ఉంటాయని మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హెచ్చరించారు. మాజీ మంత్రి రమేష్ జర్కిహోలీ, బీ నాగేంద్ర, ఉమేష్ జాదవ్, మహేష్ కుమదహళ్లి అనే ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. తాను అనారోగ్య కారణాల వల్ల సమావేశానికి హాజరు కావడం లేదని జాదవ్ అనే ఎమ్మెల్యే లేఖ రాశారు. కోర్టు కేసు వల్ల సమావేశానికి రాలేకపోతున్నట్లు బీ నాగేంద్ర ఎమ్మెల్యే తెలిపారు. సీఎల్‌పీ సమావేశానికి సీనియర్ కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ హాజరయ్యారు.

పోర్టుల అభివృద్ధి దిశగా చైనా

పాకిస్తాన్, శ్రీలంకలో ఏర్పాటు చేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు

వాషింగ్టన్, జనవరి 18: హిందూ మహాసముద్రంలో సైనికాధిపత్యం కోసం చైనా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. సముద్రతీర ప్రాంతాల్లో పోర్టులను మరింత అభివృద్ధి చేసే దిశగా ప్రయత్నిస్తోంది. ఇందుకు అనుగుణంగా వ్యూహాత్మకంగా ముందుకు సాగేందుకు కసరత్తులు ప్రారంభిస్తోంది.

పాకిస్తాన్‌లోని గ్వాదర్, శ్రీలంకలోని హమ్‌బ్యాన్‌టోటా ప్రాంతాల్లో పోర్టులను అభివృద్ధి చేసే దిశగా చైనా వ్యూహాత్మంగా ముందుకు వెళ్తోందని పెంటగాన్ తెలిపింది. ఆయా ప్రాంతాల్లో తమ సైనిక పాటవాన్ని మరింత బలపరచుకునేందుకు తద్వారా అన్నింటా ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నాలు ప్రారంభిస్తోంది. ఆఫ్రికాతో పాటు దక్షిణాసియా, మధ్యప్రాచ్య దేశాలతో సముద్రతీర ప్రాంతాల్లో సరకు రవాణాతోపాటు సైనిక పాటవాన్ని మరింత పెంపొందించేందుకు కృషి చేస్తోంది. పోర్టుల అభివృద్ధి కోసం చైనా చేస్తున్న ప్రయత్నాల గురించి, తద్వారా చైనా సాయుధ సంపత్తిని మరింత శక్తివంతం చేసుకుంటున్న అంశాలపై అమెరికాకు చెందిన రక్షణ వ్యవహారాల శాఖ తెలిపింది. ది పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ నేవీ (పీఎల్ఏఎన్) సైతం వాణిజ్య పోర్టులతోపాటు పౌర విమానయాన రంగాల్లో సైతం అంతర్జాతీయ పరంగా, దేశీయంగా రవాణారంగాల్లో తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నట్టు ఆ వర్గాలు పేర్కొన్నాయి. స్పార్ట్‌లీ, పారాసెల్ దీవుల్లో ప్రధాన రవాణా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు వీలుగా దక్షిణ చైనా సముద్రతీర ప్రాంతాలను విరివిగా ఉపయోగించుకోనుందని ఆ వర్గాలు తెలిపాయి.

కొలంబో పోర్టుకు 1.5 బిలియన్లు..

ప్రపంచంలోని వివిధ దేశాల్లో పోర్టుల అభివృద్ధి దిశగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న చైనా తాజా భారీ ఎత్తున నిధులు వెచ్చించి కొలంబోలో పోర్టు సిటీ ప్రాజెక్టును ఏర్పాటు చేయడానికి శ్రీకారం చుట్టింది.

ఇందుకు అనుగుణంగా కొలంబో పోర్టు ఏర్పాటుకు 1.5 బిలియన్ డాలర్లు ఖర్చు చేయనున్నట్టు చైనా రాయబార వర్గాలు బుధవారం వెల్లడించాయి. 269 ఎకరాల విస్తీర్ణంలో కొలంబోలో భారీ ఎత్తున పోర్టు ఏర్పాటు చేయనున్న విషయమై చైనా రాయబారి చెంగ్ జుయుయాన్ ఇక్కడ జరిగిన ఒక సమావేశం సందర్భంగా పేర్కొన్నారు. శ్రీలంక ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చే భారీ ప్రాజెక్టు నిర్మాణంలో చైనా కీలక పాత్ర పోషించనుందని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు వల్ల 4000 మంది శ్రీలంక పౌరులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని, ఇప్పటికే తాము 700 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టామని ఆయన పేర్కొన్నారు.

అంతర్జాతీయపరంగా ఎలాంటి మార్పులు జరిగినా, చైనా మాత్రం ఇరుదేశాల మధ్య సంబంధ బాంధవ్యాలను మరింత మెరుగుపరచేందుకు కృషి చేస్తుందని ఆయన తెలిపారు. తాము అనుకున్న సమయం 28 నెలల కంటే 3 నెలల ముందుగానే ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తామనే నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు.

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy**, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
నరకముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

శనివారం, 19 జనవరి 2019



ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తగా జాతీయ అవార్డు అందుకుంటున్న పద్మావతి

ఆత్మీయతకు... ఆమె ప్రతిరూపం



కడుపులో పెరుగుతున్న బిడ్డ భవిష్యత్తు గురించి అమృతం లాంటి ప్రేమను పంచే అమ్మ ఎన్నెన్నో కలలు కంటుంది. పుట్టగానే బిడ్డకు భాష నేర్పడానికి తానూ మూగదై బిడ్డకు అర్థమయ్యే ఊసులతోనే భాష నేర్పడానికి ప్రయత్నిస్తుంది అమ్మ. మాట్లాడటం పూర్తిగా రాని చంటి పిల్లాడు మాట్లాడే కొత్త కొత్త మాటలకు అర్థాలు చెప్పే నిఘంటువు అమ్మ. గతంలో అయితే పిల్లలకు 6 సంవత్సరాల వయసు నిండే వరకు ఆప్యాయతా అనురాగాలతో తల్లి చాటునే ఉంచుకుని తరువాత చదువుకునేందుకు బడికి పంపేవారు. అయితే ప్రస్తుతం బిడ్డ పుట్టి అప్పుడప్పుడే నడక నేర్చుకుని మాట్లాడే తీరు కూడా సరిగా తెలియని వయసులోనే బడికి పంపేస్తున్న కాలమిది. పట్టణాల్లో అయితే ప్లే స్కూళ్ళకు పంపుతారు. అదే గ్రామీణ ప్రాంతాల్లో అయితే అంగన్ వాడీ కేంద్రాలకు పంపుతారు. వేలకు వేలు డబ్బులు తీసుకునే ప్లేస్కూళ్ళలోని సంరక్షకులు అమ్మ ప్రేమను చూపుతారో లేదో గానీ అంగన్‌వాడీ కేంద్రాల్లోని అంగన్‌వాడీ వర్కర్లు మాత్రం తమ కేంద్రాలకు వచ్చే చిన్న పిల్లలకు అమ్మ ప్రేమను చూపుతున్నారనే చెప్పుకోవచ్చు. ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలకిస్తూ ఆరు మాసాలు నిండిన పిల్లలకు తల్లిలా అన్నప్రాసన, బుడిబుడి అడుగులేస్తూ తనకు వచ్చీరాని నత్తినత్తి భాషతో మురిపించే చిన్నారులకు ఓ ఉపాధ్యాయినిలా అక్షరాభ్యాసం, యుక్త వయసులోని బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలియబరుస్తూ రక్తహీనతకు గురికాకుండా జాగ్రత్తలు చెబుతూ తీసుకోవాల్సిన పౌష్టికాహారాన్ని అందజేసే ఓ వైద్యురాలిలా, గర్భం దాల్చిన మహిళకు శీమంతం చేసే ఓ తోబుట్టువులా, పురిటి నొప్పులొచ్చిన మహిళకు తోడుండి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళే మంచి స్నేహితురాలిలా ఇలా ఎన్నో పనులు చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో విధి నిర్వహణలో బాధ్యత మరవకుండా వ్యవహరిస్తున్నవారున్నారు. దాంతో పాటు తమకు సంబంధం లేకపోయినా మండల స్థాయి అధికారులు ఏపనులు చెప్పినా తూ.చ. తప్పకుండా చేయాల్సిందే. ఇలా తన పరిధిలోని బాధ్యతను ఏనాడూ మరువకుండా తన కేంద్రానికొచ్చే పిల్లలను తన కన్నబిడ్డల్లా ఆదరిస్తూ విధినిర్వహణను కొనసాగిస్తూ జిల్లా అధికారులతో మెప్పు పొంది జాతీయ స్థాయిలో ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తగా జాతీయ అవార్డును పొందింది ఎం.పి.పద్మావతి. ఈమె అనంతపురం జిల్లాలోని మారు మూల ప్రాంతం కర్ణాటక సరిహద్దు గ్రామమైన అమరాపురంలోని నాలుగవ అంగన్‌వాడీ సెంటర్లో అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తోంది. అంగన్‌వాడీ బాటను నిర్వహించి తన సెంటర్ పరిధిలోని ప్రతి ఇంటినీ పరిశీలించి 3 ఏళ్ళ వయసున్న పిల్లలను తన సెంటర్‌ను పంపండి మీ పిల్లల భద్రత నా బాధ్యత అంటూ పిల్లల తల్లిదండ్రులకు భరోసా కల్పించి తన కేంద్రంలో పిల్లలకు అమ్మ ప్రేమను చూపెడుతూ విధులు నిర్వహిస్తోంది. గర్భం దాల్చిన మహిళలకు వారి, వారికి పుట్టబోయే పిల్లల ఆరోగ్య జీవనం కోసం ఏ సమయంలో ఏ సూదిమందులు వినియోగించాలో నిత్యం సలహాలు సూచనలివ్వడం, ఓ తోబుట్టువులా ప్రేమను పంచుతూ శీమంతాలు చేయడం, ప్రసవం కోసం ఆసుపత్రులకు స్వయంగా తీసుకెళ్ళడం, బాలింత ఆరోగ్యంతో పాటు పుట్టిన బిడ్డ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియబరుస్తూ నిరంతరం అందుబాటులో వుంటోంది. తన కేంద్రంలోని పిల్లల పుట్టిన రోజున స్వయంగా కేకులు తీసుకువచ్చి పుట్టినరోజు వేడుకలు చేయడం, పండుగల సమయంలో రంజాన్, సంక్రాంతి, క్రిస్మస్ వేడుకలు చంటి పిల్లలతో జరపడం, తన కేంద్రంలోని పిల్లలకు అక్షరాలు నేర్పి బడికి పంపే వయసొచ్చాక కచ్చితంగా ప్రభుత్వ బడికే పంపాలని తల్లిదండ్రులకు చెప్పి ప్రభుత్వ బడుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించే కార్యక్రమాలను కూడా చేస్తోంది. తన పరిధిలో విధినిర్వహణలో ఎక్కడా రాజీపడకుండా వ్యవహరిస్తున్న పద్మావతి సేవలను గుర్తించి 2018 ఆగస్టు 15న అనంతపురం జిల్లాలో ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తగా మంత్రి దేవినేని ఉమామహేశ్వర్‌రావు చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందజేశారు. తాను చదివింది 12వ తరగతి. అక్షర జ్ఞానంపై పట్టు అంతంతమాత్రమే వున్నా ఏ ఇంట్లో అయినా పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరించేది అమ్మేననీ, ఆ అమ్మతనమే తన బాధ్యతను మరువకుండా చేస్తూ విధినిర్వహణలో గుర్తింపు తెస్తోందని పద్మావతి చెప్తోంది. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా చంటిపిల్లలు, యువతులు, గర్భిణీలు, బాలింతలకు వచ్చే పౌష్టికాహారాన్ని అంతంతమాత్రంగా అందజేస్తూ పబ్బం గడుపుకునే అంగన్‌వాడీ కార్యకర్తలూ లేకపోలేదు. అయితే అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేసుకున్న పిల్లలు, యువతులు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం అందజేసి వారి ఆరోగ్య జీవనం కోసం విధులు నిర్వహించడం తనకెంతో తృప్తినిస్తోందని పద్మావతి సంతోషం వ్యక్తం చేస్తోంది. ఆమె చేస్తున్న సేవలను కేంద్రప్రభుత్వం కూడా గుర్తించి జనవరి 7- 2019న కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి మేనకా గాంధీ చే దేశరాజధాని ఢిల్లీ నగరంలో ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తగా పద్మావతి అవార్డును అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై ఎన్నో విమర్శలు చోటు చేసుకుంటున్న ఈ రోజుల్లో మారుమూల గ్రామానికి చెందిన ఓ సామాన్య అంగన్‌వాడీ కార్యకర్త ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తగా జాతీయ అవార్డును పొందడం చాలా గర్వించదగ్గ విషయం. పద్మావతి లాంటి అంగన్‌వాడీ కార్యకర్తను స్ఫూర్తిగా తీసుకుని విధులు నిర్వహిస్తే మహిళా శిశుసంక్షేమ శాఖ ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారం పూర్తి స్థాయిలో వినియోగపడి పిల్లలు, మహిళలు రక్తహీనతకు గురికాకుండా ఆరోగ్యకరమైన జీవనం కొనసాగించడం సాధ్యమే.. విధి నిర్వహణలో పిల్లలకు అమ్మ ప్రేమను పంచుతూ, మహిళలకు తోబుట్టువులా ఆదరిస్తున్న ఎం.పి.పద్మావతికి జాతీయ అవార్డు దక్కడం ప్రశంసనీయం.



అనంతపురం జిల్లాలో ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తగా అవార్డును తీసుకుంటున్న దృశ్యం

-నల్లమాడ బాబ్‌జాన్
85000 83799





కాలం కాదు.. మారాల్సింది మనమే..

మనం చూస్తుండగానే వారాలు, నెలలు, సంవత్సరాలు కాలగర్భంలో కలసి పోతుంటాయి.. కాలగతిలో మన ఊహకందని మార్పులెన్నో.. కాలం ఎవరి కోసమూ ఆగదు.. కాలం గడచిపోతోందని డీలా పడడం అంటే జీవితానికి దిశానిర్దేశం లేనట్టే.. అందుకే మనం కాలానికి ఎదురీదాలి.. గమ్యాన్ని చేరుకొనేందుకు గమనాన్ని మనమే సరిచూసుకోవాలి.. గాలివాటం ప్రయాణం కాదు, జీవన పథంలో గెలుపుతీరాన్ని మనం చేరుకోవాలంటే కాలం విలువను తెలుసుకోవాలి.. అనుభవం నేర్పిన పాఠాలతో అలుపెరుగని ప్రయాణం చేయాలి.. 'మార్పు' మనలో మొదలైతే ఇతరులకు ఎన్ని నీతులైనా చెప్పగలం.. సంకల్పబలంతో ముందుకు సాగేవారే ఇతరులకు స్ఫూర్తిదాతలవుతారు..

* చాలావరకు ఇతరులను మార్చాలని తెగ ఆరాటపడతాం. ఇతరులపై మనం పెట్టుకున్న అంచనాలు తలక్రిందులయ్యాయని రోదిస్తాం. నిజంగా చెప్పాలంటే ఎవ్వరూ తమ మౌలిక స్వభావాన్ని వీడి అందుకు భిన్నంగా ప్రవర్తిస్తారని అనుకోవడం మన భ్రమ. పలు సందర్భాల్లో మనం ఎదుటివారితో సన్నిహితంగా ఉన్నపుడు మనతో వారి ప్రవర్తనతో మనం వారిని అంచనా వేయొచ్చు. అందుకు భిన్నంగా ఉండాలనుకోవడం పొరపాటు. భిన్న అభిప్రాయాలు ఉన్నా సాహచర్యం అనివార్యమైనపుడు ఎదుటివారిపై మనం ఒక అంచనాకు వస్తే చాలు. వారేంటో మనకు తెలిస్తే చాలు, ఆ మాత్రం ఎరుక ఉంటే సరిపోతుంది. వారు మారాలని అనుకోద్దు. ఎవ్వరూ మారరు. వారేంటో మనకు ఎన్నో సందర్భాల్లో చెబుతూనే ఉంటారు. మనం మన ప్రేమ మైకంలో వాస్తవాలను గుర్తించం. మనసుకు బాధ అయినపుడు మాత్రం మనకు ఎదుటివారు అర్థం అవుతారు. అందుకు చింతించవద్దు. మనకు ఒక అంచనా ఇచ్చినందుకు ఎదుటివారికి మనం మనసులో కృతజ్ఞతలు తెలపాలి. మనకు సానుకూలంగా ఉంటే స్నేహం వర్ధిల్లుతుంది. లేకుండే వారితో మనం జాగ్రత్తగా వ్యవహరించాలి. లేదంటే వారికి దూరంగా వెళ్లిపోవడం శ్రేయస్కరం. సమాజంలో శతృభావన వద్దు. మనకు సమాజం పట్ల వ్యక్తులను అంచనా వేయడంపట్ల మనం నూరు శాతం ఎరుకతో ఉండాలి.

* విశ్వంలో అంతా భ్రమణమే ఉంది. సూర్యుని చుట్టూ మన నవగ్రహాలు భ్రమణం చెందుతూ ఉంటాయి. ఆయా గ్రహాలు తమ స్వీయ కక్ష్యల్లో భ్రమణం చెందుతూ ఉంటాయి. వేలాది నక్షత్రాలు ఆయా నక్షత్ర మండలం న్యూక్లియస్ చుట్టూ భ్రమణం చెందుతాయి. పరమాణువుల్లో ఎలక్ట్రాను నూక్లియస్ చుట్టూ భ్రమణం చెందుతూ ఉంటాయి. మనం కూడా కొన్ని ఊహలతోనూ, కొందరిపై ప్రేమానుబంధాలతోనూ కొందరి చుట్టూ భ్రమణం చెందుతూ ఉంటాం. మన దేవుని గుడిలో దైవం చుట్టూ భ్రమణం చెందుతూ ఉంటాం. మన భ్రమణం, మన కక్ష్య ఎలా ఉందో సమీక్షించుకోవాలి అనుక్షణం. అపుడు మన భ్రమణం కూడా సార్థకత ఏర్పడుతుంది.

* మనకు ప్రామాణికం అయింది ఎదుటివాడికి ప్రామాణికం కావాలని భావించడం సరికాదు. ఎవరి భావనలకు అనుగుణంగా వారు నమ్మిందే సత్యమని వారు భావిస్తారు. మన భావనలే ఎదుటివారిలో ఉండాలని వెర్రి భ్రమలు వద్దు. మనం, మనం నమ్ముకున్న భావాలను చాలా హెచ్చు స్థాయిని ఇచ్చి కీర్తిస్తాం. మెరుపులు అద్దుతాం. గొప్ప అలంకారం అద్దుతాం. బోల్డంత సొగసులు అద్దుతాం. అదంతా వట్టి భ్రమే. నిజమేంటో మనం పైపై మెరుగుల్ని చూసి మోసపోవద్దు. వాస్తవాలను మనం సొంతంగా అన్వేషించాలి.

* మనం ఎవ్వరికీ ఏమీ చెప్పలేం. ఎవ్వరూ మనం చెప్పేది వినేందుకు తయారుగా ఉండరు. మనం చెబుతుంటే నువ్వేమి చేస్తావు? అని ప్రశ్నిస్తారు. ఎవరికీ మనం ఉచిత సలహాలు ఇచ్చి ప్రయోజనం లేదు. మనల్ని నీ మిత్రుడు నిజంగా తనలోకి ఎంతమేరకు ఆహ్వానిస్తాడని ప్రశ్నించుకుని సమీక్షించుకుంటే నిజాలు తెలుస్తాయి.

* ప్రతి ఒక్కరూ నేటి సమాజంలో స్వీయ ప్రయోజనాల కాంక్షతో ఎదుటివాడిని వాడుకునేందుకే ప్రయత్నిస్తాడు. వీడు మనకు ఎంతమేర ఉపయోగపడతాడు? అని ఆలోచిస్తారు. ఉపయోగమనేది ఉందంటే వాడుకోవడానికి నిస్సిగ్గుగా మన వెంట పడతారు. ఇది నిజం. మన వల్ల ప్రయోజనం ఏ మాత్రం లేదంటే మనం తల తిప్పి చూసే సమయంలోనే అదృశ్యమవుతారు. తమాషాగా అన్పిస్తుంది.



* పూజలు, పునస్కారాలు, పండుగలు మనలను దైవం విశిష్టతను తెలుపుతాయి. మనం కావాల్సిన అంశాలపట్ల మనం ప్రాజెక్టు వర్క్ చేయాల్సిందే. హోంవర్క్ చేయాల్సింది. అది మనుషులైనా, ఏ అంశమైనా.

* గమ్మత్తేమంటే, మనం మన చుట్టూ వున్న సమాజాన్ని మొత్తంగా అర్థం చేసుకున్నామని, మోసం ఎక్కడుందో కనిపెట్టేసామని తెగ సంబరపడతాం. రహస్యాలు, మర్మం మనకు ఒక్కరికే తెలిసిపోయిందని ఆర్కిమెడిస్‌లా యురేకా! అని సంబరపడతాం. విచిత్రమేమంటే మనకంటే ముందే మనుషుల మధ్య సంబంధాల రహస్యం అందరికీ తెలిసే ఉంటుంది. ఇది బహిరంగ రహస్యం. మనకు తెలిసేటప్పటికి అది అందరికీ తెలిసే ఉంటుంది.

* పద్ధతి కాబట్టి ఆచరిస్తారు. వదిలేస్తారు. పండగలైనా, సంప్రదాయాలైనా, లోకం కోసం కొన్ని మనం నటిస్తాం. కానీ ఆ పనుల మర్మం తెలుసుకోం. వినాయక చవితి, బోనాలు, దసరా, జాతీయ పర్వదినాలు, ఇలా ప్రతిదీ గొప్పగా చేస్తాం. భక్తుల్లా, దేశభక్తుల్లా తెగఫోజు ఇస్తాం. కానీ వాస్తవంలో మన మనసులో ఏ మార్పు ఉండదు. సమాజ పోకడ అలా ఉంది కాబట్టే చేస్తాం. ఎంతో నిష్ఠగా, కానీ నిజంగా మనలో ఏ మార్పు ఉండదు. ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం.

* మనం కుటుంబంలో కీలకం కావాలి, సమాజంలో కీలకం కావాలి. ప్రగతిలో కీలకం కావాలి. మన సత్తా చూపాలి.

* ఎదుటివారిని మనం వారి విజయాల ఫైల్ ఆధారంగా అంచనా వేస్తాం, ప్రేమిస్తాం. ఓడిపోయినవాడిని మనం మనిషిగా కూడా గుర్తించం. విజేత తోక పట్టుకుని తెగ సంబరపడిపోతాం. పరాజితులను ఒంటరివారిని చేస్తాం. పరాజయాన్నీ మనం ఆహ్వానించాలి. పడిలేచేలా మనం ఓదార్చాలి. ఓడిపోయినవాడు మంచివాడు కాకుండాపోడు. ఓడిపోవడానికి కారణాలు చెప్పి బాగుపర్చాలి. ఎదిగేందుకు మనం సోపానాలు వేయాలి. ఓటమి గెలుపునకు నాంది అని తెలపాలి.

* మనం ముఖ్యంగా మన భావాలను పదిమందితో పంచుకోవాలి. మనకు ఏం కావాలో, మన భావాలేంటో, మన బాధలేంటో, దుఃఖమేంటో, సంతోషమేంటో చెప్పుకోవాలి. మనం మనలోనే ఉండిపోకూడదు. పదిమందికి మనం పరిచయం కావాలి. అపుడే ఆపదల్లో వారు మన వెంట ఉంటారు.

* శూన్యం అంటే మనకు చాలా బోరు. ఎప్పుడూ మనం బిజీగా ఉండేందుకే ప్రయత్నిస్తాం. శూన్యంగా, మౌనంగా ఉండేందుకు ప్రయత్నించం. మౌనంగా, ఒంటరిగా ఉండాలంటే మనకు భయం. ఉక్కిరిబిక్కిరైపోతాం. కానీ మనం ఒంటరితనాన్ని, శూన్యాన్ని ప్రశాంతతను భరించే శక్తిని అలవర్చుకోవాలి.


* మనం ఏ భావజాలం లేకుండా, ఏ వినోదం లేకుండా, ఏ కాలక్షేపం లేకుండా, టైంపాస్ లేకుండా, అలవాట్లు లేకుండా, విజయాలు లేకుండా ఒంటరిగా ఉండలేం. బుర్రను ఖాళీగా ఉంచలేం. కానీ ఒంటరితనాన్ని, ఎవ్వరూ, ఏమీ లేనితనాన్ని అలవర్చుకోవాలి. ఎందుకంటే, మనం జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు అలాంటి పరిస్థితిని ఎదుర్కొంటాం. అపుడు మౌనంగా విలపించడమే, జీవితాన్ని చాలించడమో చేస్తాం. అపజయాల్ని ఒంటరితనాన్ని మనం భరించాలి.

* చట్రంనుంచి బైటపడాలి. మనం ఒక్కసారి మన చట్రాన్ని మార్చుకోవాలి. అపుడుగాని మన పట్ల సమాజం ఏమనుకుంటుందో తెలుస్తుంది.

* మనం ఒక్కోసారి మన తాజదనాన్ని కోల్పోతాం. మనం పల్లెనుంచి పట్నంకు వచ్చి మన ఆత్మీయులకు, స్నేహితులకు దూరంగా మన పల్లె పరిమళానికి దూరంగా ఉండిపోయి మనకు మనం దూరం అవుతాం. పిచ్చెక్కుతుంది. పట్నంలో పలకరించేవారు ఉండరు. మనం మనల్ని ఎక్కడో జారవిడుచుకుంటాం. మన బంధువులకు దూరంగా వచ్చేసి మనం ఆత్మీయతకు దూరమవుతాం. కానీ మనం చింతించాల్సిన పనిలేదు, మన పల్లెకు, మన అనుబంధాలకు అప్పుడప్పుడు దగ్గరగా వెళ్లాలి. మనం మన స్వీట్ మెమొరీస్‌ను కోల్పోవాల్సిన అవసరం లేదు. మనం ఒక్కసారి మన పాత జీవితంలోకి వెళ్లి వస్తూ ఉండాలి. అపుడు మనం మళ్లీ రిఫ్రెష్ అవుతాం. తాజాగా మారిపోతాం.

-తంగెళ్ళపల్లి కనకాచారి
87908 74028

చిత్తరువుతో ఛత్రపతికి నివాళి..



జాతీయతా భావాన్ని రగిలించి జనహృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ అంటే ఆమెకు ఎనలేని గౌరవం.. పరిపాలనాదక్షుడిగానే గాక ప్రజానేతగా కీర్తిశిఖరాలను అందుకున్న శివాజీ ఆలోచనలు, ఆకాంక్షలు ఇప్పటి తరానికి తెలియజేయాలన్నదే ఆమె తపన.. తరాలు గడచినా ఎప్పటికీ స్ఫూర్తిదాతగా నిలిచే 'ఛత్రపతి'కి వినూత్న రీతిలో నివాళి అర్పించాలని ఆమె సంకల్పించింది.. దాదాపు పది నెలలపాటు శ్రమించి 19 అడుగుల వెడల్పు, 8 అడుగుల పొడవుతో ఓ అద్భుత చిత్తరువును ఆమె ఆవిష్కరించింది. జనం మధ్యలో రథంపై శివాజీ మహారాజు ఊరేగుతున్న దృశ్యం ఆ చిత్తరువులో నయన మనోహరంగా కనిపిస్తుంది. మహారాష్ట్రలోని సతారా పట్టణానికి చెందిన శ్రుతి దండేకర్ 20,888 గుడ్డపీలికలను కుట్టుపనితో అలంకరించి ఈ భారీ చిత్తరువును తీర్చిదిద్దారు. కుట్టుపనిలో నైపుణ్యం, రంగుల మేళవింపుతో రూపొందిన ఈ చిత్తరువుకు 'డిజిటల్ ఉమెన్స్ అవార్డు' దక్కింది. జయ జయ ధ్వానాలు చేస్తున్న జనంతో శివాజీ మహారాజు నడివీధిలో నడయాడినట్లు ఆ చిత్తరువును చూస్తే ఎవరికైనా అనిపిస్తుంది. అవార్డును స్వీకరించిన సందర్భంగా శ్రుతి మాట్లాడుతూ, తాను సృష్టించిన భారీ చిత్తరువు కన్నా జీవితం ఎంతో విశాలమైనదని అభివర్ణించారు. గత ఏడాది మార్చిలో చిత్తరువుకు సంబంధించిన కుట్టుపనిని ప్రారంభించి, ఈనెల 6న ఆమె పూర్తి చేశారు. పెయింటింగ్స్‌లో కనిపించే రంగుల మేళవింపు, కళా నైపుణ్యం ఈ చిత్తరువులో చోటుచేసుకోవడాన్ని ఎంతోమంది ప్రముఖులు ప్రశంసించారు. ప్రతి గుడ్డపీలికనూ జాగ్రత్తగా అతుకుతూ విభిన్న రంగులతో ఓ దృశ్యాన్ని ఆవిష్కరించడం ఎంతో శ్రమతో కూడినపని అని శ్రుతి చెబుతున్నారు. తల్లిగా బాధ్యతలు నిర్వహిస్తూనే ఇంతటి భారీ చిత్తరువును పూర్తి చేయడంలో కుటుంబ సభ్యులు ఎంతగానో సహకరించారని ఆమె తెలిపారు. ఛత్రపతి శివాజీకి నివాళిగా రూపొందించిన ఈ చిత్తరువు పూర్తవగానే తాను పడ్డ శ్రమను మరచిపోయి ఎంతో సంతృప్తికి లోనయ్యానని ఆమె గుర్తు చేస్తున్నారు. ఏ పని పూర్తి చేయాలన్నా సహనం, ఓర్పు, నైపుణ్యం, ఏకాగ్రత అవసరమని తాను తెలుసుకొన్నానని ఆమె చెబుతున్నారు. చిత్తరువు పని ప్రారంభించినపుడు తనను ఎవరు పట్టించుకొన్నా, పట్టించుకోకపోయినా- పది నెలల శ్రమ తర్వాత తన ప్రతిభను అంతా కొనియాడుతున్నారని శ్రుతి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



శ్రీనరసింహ శతకము

సీ. భువన రక్షక! నిన్నుఁ బొగడ నేరని నోరు
ప్రజ కగోచరమైన- పాడుబొంద
సురవరార్చిత! నిన్నుఁ జూడఁ గోరనికనుల్
జలములోపల వెల్లి - సరపు గుండ్లు
శ్రీరమాధిప! నీకు సేవఁ జేయని మేను
కూలి కమ్ముడువోని కొలిమితిత్తి
వేడ్కతో నీ కథల్ వినని కర్ణంబులు
కఠిన శిలాదులఁ గలుగు దొఱలు
తే. పద్మలోచన! నీమీద భక్తి లేని
మానవుఁడు రెండు పాదాల మహిషమయ్య
భూషణ వికాస ! శ్రీధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

భావం: ఓ నరసింహ ప్రభూ! నీ స్తుతి చేయని నోరు పాడు గొయ్యి. నిన్ను చూడని కండ్లు నీటిలోని మొగ్గలు, నీ సేవ చేయని శరీరం పనికిరాని కొలిమితిత్తి. ఇనీ కథలు వినని చెవులు రాతితొఱ్ఱలు, నీ పై భక్తి లేని మానవులు రెండు గాళ్ల పశువే.

అనంతం

39 -గోపరాజు నాగేశ్వరరావు

"తగినన్ని పోలీసు బలగాలు లేవుకదా."

"అదనపు బలగాలకోసం కబురువెళ్ళింది"అని చెప్పాడు ఎమ్మెల్యే.

గరుడాచలం స్థిమితపడ్డాడు.

కొంతసేపటికి ఎవ్వరో పోలీసు ఉద్యోగి వొచ్చాడు. ఎమ్మెల్యేకి నమస్కరించి వినయంగా నిల్చున్నాడు.

"కొండ దగ్గరి విశేషాలేమిటి"అని అతన్ని ఎమ్మెల్యే అడిగాడు.

"రెడ్డియానాయక్ తండావాళ్ళు రాగ్యా కోసం వెతుకుతున్నారు సార్" అన్నాడతను.

"అనుకున్నదే కదా! రాగ్యా ఏం చేస్తున్నాడు."

"అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసి, తండా వాళ్ళకి ఎదురువెళ్తున్నాడు"

'సెక్యూరిటీ జాగ్రత్త."

"ఇబ్బందేమీ లేదు సార్! రాగ్యాని నీడలా అనుసరిస్తూ సివిల్ డ్రెస్‌లో చాలామంది కానిస్టేబుళ్ళున్నారు. వాళ్ళ దగ్గర రివాల్వర్లున్నాయి! అవసరమైతే కాల్పులు జరుపుతారుకానీ రాగ్యాకి ప్రమాదం జరగనివ్వరు."

"సరే..వెళ్ళు! ఎప్పటికప్పుడు విషయాలు నాకు తెలుస్తుండాలి! అందరూ అలర్టుగా వుండండి"అని చెప్పాడు ఎమ్మెల్యే.

పోలీసు ఉద్యోగి సెల్యూట్ చేసి వెళ్ళిపోయాడు.

⁂

"రాగ్యా గాడడుగో.." అని, ఓ అడవి పుత్రుడు అరిచాడు.

బాణావతుతో సహా అందరూ అటువైపు చూసారు.

కొంపలు మునిగినట్టు పెద్దపెద్ద అడుగులు వేస్తూ చాలా హడావుడిగా తమవైపే వస్తూ రాగ్యా కనిపించాడు దూరంగా!

తండా వాళ్ళకది విచిత్రంగా తోచింది.

పంచాయితీకి భయపడి, నాగరికుల గుడారాల్లో తల దాచుకున్న రాగ్యా అంత నిర్భయంగా ఎందుకు వస్తున్నట్టు?

పశ్చాత్తాపం కలిగి పరివర్తన చెంది, చేసిన తప్పు ఒప్పుకొని స్వచ్ఛందంగా శిక్ష అనుభవించాలని వస్తున్నాడా?

ప్రశ్నలు, సందేహాలూ కలుగుతున్నాయి!

ఏదిఏమైనా రాగ్యాని బంధించాలి. చెట్టుదగ్గర పంచాయితీ పెట్టాలి. కఠినంగా దండించాలి!

ఇవ్వాళ, దేవర జాతరనీ, మరో కారణమనీ రాగ్యాని విడిచిపెడితే- తండాలో రేపు చాలా మంది రాగ్యాలు పుట్టుకొస్తారు!

కట్టుబాట్లు సడలిపోతాయి.


తండా పెద్దలు చులకనైపోతారు.

ఆచారాలు మంటకలిసిపోతాయి.

"ఇడ్సిపెట్టగాకండి"అన్నాడు బాణావతు.

తండావాళ్ళు వేగం పెంచారు. గబగబా నడుస్తున్నారు!

రాగ్యా దగ్గరికొస్తున్నకొద్దీ ఆయుధాలమీద



వాళ్ళచేతులు మరింత బిగుతుగా బిగుసుకుంటున్నయి. కోపంతో బుసలు కొడుతున్నారు!

తండా దుండుకీ, రాగ్యాకీ మధ్య దూరం తగ్గుతున్నకొద్దీ అందర్లోనూ ఉత్కంఠ పెరుగుతున్నది.

ఏం జరుగుతుందో అని ఊపిరి బిగపట్టి చూస్తున్నారు.

రాగ్యా వెంట చాలామంది దృఢకాయుల్ని తండావాళ్ళు అపుడు గమనించారు!

"ఏదో పతకవే" అన్నాడు నగ్గూరాం అనుమానంగా చూస్తూ.

"పతకవే అయితే ఇడ్చిపెట్టను వాడ్ని! కొడుకని గూడా సూడకుండా నరికేస్తాను" అన్నాడు కాళీచరణ్.

బాణావతు మౌనంగా రాగ్యా వస్తున్న వైపే చూస్తూ నడుస్తున్నాడు.

కొద్దిదూరంలో రాగ్యా ఆగాడు.

వెంట వచ్చిన దృఢకాయుల్ని అక్కడే ఆపి, ఒంటరిగానే నడుస్తూ తండావాళ్ళని సమీపించాడు!

రెండుచేతులూ ఎత్తి అందరికీ దణ్ణం పెడుతూ-

"ఒక్కమాట సెబ్తా, యినుకోండి.. ఇన్నాక నన్ను సంపండీ..కొట్టండి! అందరికీ దణ్ణంవెట్టి సెబ్తుండాను! నాకోసరవ్ గాదిప్పుడు నేనొచ్చింది.. మీకోసరవ్" అన్నాడు రాగ్యా.

"మాకోసరవా! నీకేంటిది పని" నగ్గూరాం అడిగాడు.

అందరూ రాగ్యా వైపు చూస్తున్నారు!

"మొత్తంగా మన జాతే నసిచ్చిపోయిద్దని భయ్యంగుంది! అందుకే మీకాడికి లగెత్తుకొత్తుండాను'

"నసిచ్చిపోయిద్దా? ఎట్టా?" అని బాణావతు అడిగాడు.

"ప్రైవాదవ్ ముంచుకొత్తుంది"

"ఒకేపు దేవర జాతర జరుగుతుంటే ప్రైవాదవా? ఎందుకొచ్చుద్ది? ఏంటి కొచ్చుద్ది? మమ్ముల గాసే దేవరుండంగా అసువంటిదేవీ జరగదులే గానీ- యిసయవ్ జెప్పు! నీయన్నీ మాయ మాటలు గదూ?" అని కొడుకు వైపు తీక్షణంగా చూసాడు కాళీచరణ్.

రాగ్యా ఉన్నట్టుండి పెద్దగా ఏడుపు లంకించుకున్నాడు.

అడవి పుత్రులు బిత్తరపోయారు!

ఇంతవరకు రాగ్యా అలా ఏడ్చిన దాఖలా లేదు!

ఏడిపించటం తప్ప ఏడవటం తెలియని వాడు అలా ఏడుస్తున్నాడంటే- మొత్తానికి ఏదో జరిగిందనుకున్నాడు బాణావతు.

"ఇయసవేంటిదో తొందరగా జెప్పు" అన్నాడు. రాగ్యా కన్నీళ్లు తుడుచుకుంటూ, అందరివైపూ ఒకసారి కలియచూసి-

"జాతర లేదు, గీతరా లేదు" అన్నాడు.

తండావాళ్ళ మొహాలు వాడిపోయాయి!

"ఏంటికి లేదూ" అని కాళీచరణ్ అడిగాడు.


"అయ్యా! నమ్మండి, నమ్మకపోండి! జల్మనిచ్చిన అయ్యకి అబద్దవ్ సెప్తారా, ఓర్రైనా? సత్తె జెప్పరు!'

"యిసయవేంటిది?" బాణావతు అసహనంగా అడిగాడు. అందరి దృష్టీ రాగ్యా వైపునకు మళ్లింది!

"కొండదేవరకి మనమీన కోపం వచ్చింది! ఆగ్గరంతో వూగిపోతుండు. ముక్కెంగా మన తండాని నల్సకతింటానంటుండు" చెప్పాడు రాగ్యా! అందరూ ఆలకించి వింటున్నారని గ్రహించి-"మన గుడిసెలకింక అగ్గి అంటుద్ది.. బుగ్గగుతయ్యి.. దేవరంపిన దెయ్యాలు మనల్ని నల్సక తింటయ్యి.. తండా యిడ్చిపెట్టి యాడికి బోవాలె మనవంతా" అన్నాడు.

(ఇంకా ఉంది)

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
ఇంతవరకు అనుభవించిన కష్టాలన్నీ క్రమేణా తొలగిపోతాయి. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా వుంటుంది. బంధు, మిత్రులతో కలిసి సరదాగా కాలక్షేపం చేస్తారు. ఆకస్మిక ధనలాభముంటుంది. గొప్ప వ్యక్తిని కలుస్తారు.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశముంది. స్థిరాస్తుల విషయంలో మిక్కిలి జాగ్రత్త అవసరం. క్రీడాకారులకు మానసికాందోళన తప్పదు. నూతన కార్యాలు వాయిదా వేసుకోవడం మంచిది.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. ఆకస్మిక భయాందోళనలు దూరమవుతాయి. ఋణప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి. కుటుంబంలో మనశ్శాంతి లోపిస్తుంది. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. రహస్య శత్రుబాధలుండే అవకాశం వుంది.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)**
అనారోగ్య బాధలను అధిగమిస్తారు. నూతన కార్యాలకు ఆటంకాలున్నా సత్ఫలితాలు పొందుతారు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. వృత్తి వ్యాపార రంగాల్లో ధననష్టమేర్పడకుండా జాగ్రత్త వహించాలి. ఆత్మీయుల సహాయ, సహకారాలకై వేచి వుంటారు. దైవదర్శనం లభిస్తుంది.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
అనారోగ్య బాధలు అధికమవుతాయి. అకారణంగా కలహాలేర్పడే అవకాశాలుంటాయి. అనవసర భయానికి లోనవుతారు. విద్యార్థులు చంచలంగా ప్రవర్తిస్తారు. వ్యాపార రంగంలోనివారు జాగ్రత్తగా నుండుట మంచిది. స్త్రీలు పిల్లలపట్ల మిక్కిలి శ్రద్ధ వహిస్తారు.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
నూతన వస్తు, వస్త్ర, వాహన, ఆభరణ లాభాలను పొందుతారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది. శుభవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. ఒక ముఖ్యమైన కార్యక్రమం పూర్తి అవుతుంది.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
ఆకస్మిక ధనలాభముంటుంది. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఇతరులకు ఉపకారం చేయుటకు వెనుకాడరు. ఋణబాధలు తొలగిపోతాయి. శత్రుబాధలుండవు.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
కుటుంబ కలహాలు దూరమవుతాయి. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. వృథా ప్రయాణాలవల్ల అలసట చెందుతారు. చెడు పనులకు దూరంగా వుండుట మంచిది. అందరితో స్నేహంగా నుండుటకు ప్రయత్నించాలి. ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా వుంటాయి.


● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరును. బంధు, మిత్రులతో సరదాగా గడుపుతారు. ప్రయాణాలవల్ల లాభం చేకూరును. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ధనచింత ఉండదు. సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి. అన్నివిధాలా సుఖాన్ని పొందుతారు.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభంలో ఆనందంగా వుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో సఫలీకృతులవుతారు. కీర్తి, ప్రతిష్ఠలు అధికమవుతాయి. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
ప్రయాణాలు ఎక్కువగా చేయాల్సి వస్తుంది. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. అనవసరంగా డబ్బు ఖర్చుగుటచే ఆందోళన చెందుతారు. విదేశయాన ప్రయత్నాలకు మార్గం సుగమమవుతుంది. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించక తప్పదు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరింపబడతాయి. నూతన గృహ కార్యాలపై శ్రద్ధ వహిస్తారు. ఆకస్మిక ధనలాభంతో ఆనందిస్తారు. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. దైవదర్శనం చేసుకుంటారు. భక్తిశ్రద్ధలధికమవుతాయి.

మాటాట నిర్వహణ: సుధామ 1849



అడ్డం — ఆధారాలు — నిలువు

అడ్డం:
1. గురుగోవింద్ సింగ్ సిక్కులకు ఏమగును
4. ఉన్మాదము
5. ఇరువది దస్తాల కాగితపు కట్ట
7. ఖర్జూరంలో వుండేది. నాటబడేది
8. పడవ
9. అవివాహిత స్త్రీ
11. మన్మథపత్ని
13. ఈ స్టార్‌గా కృష్ణంరాజు ప్రసిద్ధుడు
14. భారము

నిలువు:
2. దోషము
3. పక్షి ధ్వని
4. తమ్ముని భార్య
5. కారణము, హేతువు
8. కూరమీది పీచు
11. చరవాణి నిత్య వ్యవహారంలో
12. రెమ్మ

మాటాట-1848 సమాధానాలు

అడ్డం: 2. రామారావు 5. రాట్నము 7. దివి 8. నేత 9. ఉపమ 10. తూర్పు 11. చేప 12. నీరుకావి 13. కప్ప 14. వరం

నిలువు: 1. నీరాట 3. మాత 4. మయిలావు 6. ముదిత 8. నేర్పు 10. తూలిక 11. చేరువ ★

స్పష్టాస్పష్ట అభివ్యక్తి

పఠనీయం

లోయ మరికొన్ని కథలు - రచన:బి.అజయ్‌ప్రసాద్, వెలె:రూ.140/-, ప్రతులకు:విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ మరియు విశాలాంధ్ర బుక్‌హౌస్ వారి అన్ని బ్రాంచీలు

కల్పన, అభివ్యక్తి- ఈ రెంటినీ రెండు కళ్ళుగా చేసుకుని, భౌతిక చక్షువును దాటి మరింత లోతుగా మనిషిలోకి చూడగలుగుతాడు 'లోయ మరి కొన్ని కథలు' సంకలనకర్త బి.అజయ్‌ప్రసాదు.

ఏకకాలంలో- "ఆమె కళ్ళు గతాన్నీ, భవిష్యత్తునీ కలిపి, శూన్యంలోకి 'చూడగలగటం' ఆయన సృష్టించిన 'లోయ'లోని చెన్నమ్మ పాత్రకే సాధ్యమవుతుంది. ఒకసారి గాలితో చీకటిని ఊపుతాడు; మరో సారి చీకటితో గాలిని ఊపేస్తాడు (మృగశిర కథ) గాలి; చీకటి- రెండూ అభౌతికాలే. అయినా ఈ రచయిత రెంటినీ తన స్వంతం చేసుకుని పాఠకుల గుండె నూపుతాడు. వచనంలో కవిత్వపు ధోరణులను ఒలికించగలిగే ఈ సంకలనంలో 15 కథలున్నాయి. ఇవన్నీ-2005 నుండి 2017-అంటే ఓ పుష్కర కాలంలో పలు ప్రజాదరణ పొందిన పత్రికల్లో ప్రచురించబడి, ఇపుడు సంకలన రూపంలో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్ వారు పాఠకులకందిస్తున్నారు. ఈ కథల్లో కనబడే పాత్రలు- ఏడుకొండలు చల్లపరెడ్డి (చివరి నీడ) జీవానంద్, మాధవ రావు (భెయాస్) గురిగాడు, పేరులేని బైరాగి, మానిక్యం (జాగరణ) జయమ్మ, చెన్నమ్మ, శీను (లోయ)- అందరూ నిత్య జీవితంలో తారసపడే వ్యక్తులే. నవ్వు, దుఃఖం, కలిమిలేమి, వెన్నెల, చీకటిని అనుభవించే సామాన్య వ్యక్తులే- అయినా వీరందరూ అసామాన్యంగా ఆలోచిస్తారు. పేడను పురుగు చేస్తారు. పసుపు గడ్డిని పులి చేస్తారు. మొక్కను నక్క చేస్తారు (మృగశిర పే.101). అపుడే 'వెన్నెల వెలుగును చూస్తారు.

అప్పుడే చెట్ల ఆకుల్లోకి చొచ్చుకు వస్తున్న వెన్నెలతో, చీకట్లను విరుచుకుతినేలా చేస్తారు (జాగరణ). సాలార్‌జంగ్ మ్యూజియంలో 'వీల్డ్ రెబెకా' అనే పాలరాతి శిల్పం ఉంటుంది. రెబెకా ముఖాన్ని పల్చటి మేలి ముసుగు కప్పి ఉంటుంది. సందర్శకులు ఏకకాలంలో రెబెకా ముఖాన్నీ, ముఖంమీద కప్పిన మేలి ముసుగునీ చూడగలుగుతారు.

అలాగే ఈ సంకలనంలోని కథలన్నీ అర్థం అయ్యీ అవనట్లుంటాయి.ఆ పాడుబట్ట ఇంట్లో, ఆ రాత్రి మానిక్యంతో బాటు వచ్చిన ఆవిడ పాదాల్ని చూసి ఆవిడ 'కులీనత'ను ప్రకటించగలిగే బైరాగి, మరికొద్ది సేపటికే ఆవిడతో 'నేనువంటిదాన్ని కాదు సావి' అని అనేలా చేస్తాడు రచయిత (జాగరణ).

కథలూ, కథల్లోని పాత్రలూ ఏ క్షణాన, ఏ మలుపు తిరుగుతాయో పాఠకులు ఊహించలేరు. ఇక్కడే బహుశా ఈ కథా రచయిత ప్రతిభ ద్యోతకమవుతుంది. ఒకటి రెండుసార్లు చదివితేగాని రచయిత భావాలను అర్థం చేసుకోలేము.

-కూర చిదంబరం

అనుక్షణికం

-వడ్డెర చండీదాస్

అనుక్షణికం రచన గొప్పదనం దాని సందేశం వల్లనా, లేక దాన్ని తీర్చిదిద్దిన సాహిత్యంవల్లనా అని అడిగితే- సాహిత్యంవల్లనే అని నిర్ద్వందంగా చెప్పవచ్చు. ఈ నవల సందేశం అన్యాపదేశంగా వుంటుంది.

కానయితే లాజికల్‌గా ఆలోచించినపుడు అక్కడక్కడ చిన్న చిన్న విషయాలలో పాత

వినమరుగైన..

రామిశెట్టి చంద్రశేఖర అజాద్

కుడు రాజీకి రాలేకపోతాడు. శ్రీమంతుడైనా మానవత్వం మూర్తీభవించిన శ్రీపతి విధివంచిత శ్రీగంధం కస్తూరి పడుపు వృత్తితో జీవితాన్ని గడుపుతూ వుంటే, ఆమెను ఆ వృత్తి నుంచి తప్పించాలని ఎందుకనుకోడో అర్థం కాదు. అతను తలచుకుంటే అది ఏమంత కష్టం కాదు. అన్‌సోలిసిటెడ్ అడ్వైస్ కాని, హెల్ప్ కాని చేసే నేచర్ వున్నవాడు కాదని అనుకోవటానికీ వీల్లేదు. అలా చాలామంది విషయంలో చేసినవాడే. అలానే మొదట్లో ఎంతో నిజాయితీగా బ్రతికే రవి, అవినీతిని, అన్యాయాన్ని ఏ రకంగానూ సహించని రవికి- ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజీలో తన పేరు చాలా ముందుగా రిజిష్టర్ అయ్యే విషయంలో, సీనియారిటీని త్రోసిపుచ్చి కాల్ లెటర్స్ వచ్చేలా తనఫ్రెండ్ 'ఆచారి' చేసిన సహాయమూ అవినీతిగా అన్పించవు. వీటిని లోపాలుగా తీసుకోకున్నా, ఇలాంటివి చోటు చేసుకోకుంటే బావుండేది.

మానసిక వైద్యులైన శేషావతారం, కూర్మావతారం పాత్రలు అతి హాస్యానికి అద్దంపట్టి అసహ్యం కలిగేలా చేస్తాయి. మానవ సమాజంలో అన్ని రంగాలలోనూ అనుక్షణం వస్తున్న మార్పులను బాగా ఆకళింపు చేసుకుంటే తప్ప ముఖ్యంగా యూనివర్సిటీ యువతతో కలిసి జీవించి వాళ్ల జీవిత విధానాన్ని పూర్తిగా స్టడీ చేసి అనుభూతి చెందితే తప్ప, అనుక్షణికం లాంటి గొప్ప నవలను వ్రాయటం సాధ్యపడదు.

చండీదాస్ గారి మాటలను కొద్దిగా మార్చి అనుక్షణం నవలను యిలా చెప్పవచ్చు.అంతలోనే అంతమయ్యే ఎంతకూ అంతమవని అనుభూతిని మిగిల్చే నవల అనుక్షణికం అని.

-సమాప్తం

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన -
శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

సూక్ష్మదృష్టితోనే
అద్భుతాలు సాధ్యం

ఒక గురువుగారు ఆశ్రమంలో చెట్ల క్రింద గురుకుల విద్యార్థులకు వేదాలు బోధిస్తున్నారు. అందరూ ఎంతో శ్రద్ధగా గురువుగారు బోధించే పాఠాలను చక్కగా వింటున్నారు. అంతలో ఒక విద్యార్థి లేచి నిలబడి గురువుగారూ మనం దేవునికి పూజలు చేసి నైవేద్యం సమర్పిస్తాము కదా! అపుడు స్వామివారు ఆ నైవేద్యాన్ని స్వీకరిస్తారా? ఒకవేళ ఆ నైవేద్యాన్ని భగవంతుడు గనుక తిన్నట్లయితే ఆ పాత్రలోని నైవేద్యం కాస్తయినా తరిగిపోవాలి కదా! మరెందుకు అలాగే పెట్టింది పెట్టినట్లే ఉంటుంది అని అడుగుతాడు. అయినప్పటికీ ఆ గురువుగారికి వినబడినప్పటికీ పట్టించుకోనట్లుగానే వేదాలు చెబుతూనే ఉంటాడు. అలా ఆ రోజుకి చెప్పాల్సిన శ్లోకాలు చెప్పిన తరువాత సరాసరి ఎవరైతే విద్యార్థి దేవుడు నైవేద్యం తింటాడా అని అడిగాడో, అతని దగ్గరికి వచ్చి, నాయనా! చెప్పిన విషయాలన్నీ అర్థమయ్యాయా అని అడిగినపుడు అర్థమయ్యాయని ఆ విద్యార్థి చెబుతాడు. ఒకసారి చెప్పగలవా వాటిని అనగానే టకటకమని నేర్చుకున్న విషయాన్నంతటినీ చెప్పేస్తాడు. అపుడు ఆ గురువుగారు విద్యార్థినితో నేను చెప్పినదంతా ఈ గ్రంథంలో వుంది. నీవు ఆ గ్రంథంలోని విషయాన్నంతటినీ నేర్చుకొని జ్ఞానాన్ని పొందావు. అంటే ఆ గ్రంథంలోని విషయాలను, సారాంశాన్ని పూర్తిగా అవలోకనం చేసుకున్నావన్నమాట. మరి అలా ఆ గ్రంథంలోని జ్ఞానాన్ని నీ మెదడు ద్వారా తీసుకున్నప్పుడు అందులోని అక్షరాలు తరిగిపోవాలి కదా! మరి ఎందుకని తరిగిపోలేదు?

అంటే ఆ గ్రంథంలోని విషయ పరిజ్ఞానాన్ని సూక్ష్మదృష్టిలో స్వీకరించావన్నమాట. ఇంకా చెప్పాలంటే, కళ్ళతో చూసి, మనసుతో మెదడులోకి ఎక్కించుకున్నావన్నమాట. మరి అలా కళ్ళతో చూసిన విషయాన్ని మనస్సుతో స్వీకరించడంవల్ల ఆ గ్రంథంలోని అక్షరాలు నీవు భౌతికంగా వాటిని తీసుకోలేదు కదా! అదేవిధంగా పూజలు చేసి నైవేద్యాన్ని నివేదించినపుడు ఆ భగవంతుడు తన మనస్సుతో భక్తులు పెట్టిన నైవేద్యాన్ని అంతే సూక్ష్మదృష్టిలో స్వీకరిస్తాడు. అలా నివేదన చేసిన నైవేద్యాన్ని మనం దైవప్రసాదంగా స్వీకరిస్తాము. దేవుడికి పెట్టిన నైవేద్యం అయినా, పుస్తకాల్లోని విషయ పరిజ్ఞానం అయినా సూక్ష్మదృష్టితో తీసుకోవాల్సిందే. దానిని భౌతికంగా తీసుకోలేము. అందుకే దేవుడికి నివేదించాల్సిన నైవేద్యం కానీ, పుస్తకాల్లోని జ్ఞానం కానీ తరిగిపోదు.

-పర్వతాల శ్రీనివాస్

స్వాధ్యాయ సందోహం

హిందీ మూలం: స్వామీ వేదానంద తీర్థ తెలుగు అనువాదం:
డా॥ పాలకోడేటి జగన్నాథరావు 9490620512

అందుకే లింగ వివక్ష లేక వారిని విచారింపకయే వధింపమని అథర్వవేదం రాజును ఆదేశించింది. అయితే రాజు ఎవరు ఆతతాయే, ఎవరుకాదో నిర్ణయించే విషయంలో బహుజాగరూకుడైయుండాలి. అందుకై దానికి తగిన న్యాయ- ధర్మవ్యవస్థను, తత్కార్య నిర్వహణ వ్యవస్థను సువ్యవస్థితం చేయవలసి యుంది.

❖

అతిథి పూజ

హిరణ్యస్రగయం మణిః శ్రద్ధాం యజ్ఞం మహో దధత్

గృహే వసతు నో - తిథి.।

తస్మై ఘృతం సురాం మధ్వన్నమన్నం క్షదామహే।

స న.పితేవ పుత్రేభ్య. శ్రేయః శ్రేయశ్చికిత్సతు భుయోభూయాః

శ్వః శ్వో దేవేధ్యో మణిరేత్య॥ అథర్వణవేదం. 10-6-4,5॥

భావం:- మణిలా, బంగారు దండలా సమాదరణీయుడైన ఈ అతిథి శ్రద్ధ- పరోపకార పరాయణత, పూజ్యత మున్నగు సద్గుణ సంపన్నుడుగా వచ్చి మా యింట నివసించుగాక! ఆయనకు బలవర్ధకమైన నేతిని, మధుర పానీయాలను, మధుర పదార్థాలను వివిధ మధురాన్నాలను మేము సమర్పిస్తాం. గౌరవనీయుడైన అతిథి మా యింటికి వచ్చి పుత్రులకు తండ్రివలె దివ్యమైన గుణ సంపద అలవడునట్లుగా నిరంతరం శుభాలు సిద్ధించే రీతిగా ప్రీతితో ప్రత్యేకంగా జ్ఞానం ప్రబోధించుగాక!

వివరణ:- వైది ధర్మం యజ్ఞ ప్రధానమైనది. ప్రతి హిందువు బ్రహ్మయజ్ఞం. వైశ్వదేవయజ్ఞం, దేవయజ్ఞం, పితృయజ్ఞం, అతిథి యజ్ఞం అనే ఐదు యజ్ఞాలు నిత్యమూ విధిగా ఆచరించాలి. వీనిని ఆచరింపకుంటె ఆ వ్యక్తికి పాపం సంక్రమిస్తుంది. వీనిలో అతిథి యజ్ఞాన్ని గురించి అథర్వణ వేదంలో పదునైదవ కాండలో వివరించబడింది. ఆ సందర్భంగా అచట అతిథి మహిమ విశేషంగా వర్ణింపబడింది. ఆర్య సంస్కృతిలో అతిథి చాల వందనీయుడు, పూజనీయుడు. ఈ విషయంపై రెండు మంత్రాలలో సప్రమాణంగా చెప్పబడింది. ప్రధానంగా అతిథి లక్షణాలు నాలుగు చెప్పబడ్డాయి. 1. హిరణ్యస్రుక్ 2. మణిః 3. శ్రద్ధాః 4. పితేవ పుత్రేభ్యః

1. హిరణ్యస్రక్:- బంగారు దండ ధరించిన వాడు అని దీనికి సామాన్యార్థం. అంటే గృహస్థులు పూజ్యభావంతో బంగారు దండలతో సమ్మానించాలని ఒక అర్థం. అంటే అది అంత సులభమైన చౌక బేరమా? కాదు. అయినా ఇంటికి వచ్చిన అతిథిని విలువైన ద్రవ్యాలతో, పదార్థాలతో సమ్మానించాలని మాత్రమే దాని అంతరార్థం. అట్టి సన్మానానికి అతిథి కూడ యోగ్యుడుగా ఉండాలి కదా! మంత్ర మీ అభిప్రాయాన్ని కూడ స్ఫుర్శించియే 'హిరణ్యస్రుక్' అనే పదాన్ని ప్రయోగించింది. అంటే అతడు బంగారంతో తుల్యమైన అనేక సద్గుణాల మాల ధరించినవాడు కావాలని వేద మంత్ర అంతరార్థం. పరోపకార పరాయణత, హితబోధత, త్యాగశీలత మొదలైన గుణాలన్నీ 'హిరణ్యస్రుక్' అన్న పద వాచకాలే.

2. మణిః:- అతిథి స్వయంగా మణియే అయి యుండాలని భావం. మణి ఎంత మూల్యమైనదో ఆ రీతిగా శ్రోత్రియత్వం, శుచిత్వం, తపఃసంపన్నత్వం, కర్మానుష్ఠాన-పరాయణత, అంతర్ముఖత్వం, బ్రహ్మనిష్ఠత మొదలయిన అనర్ఘశీల సంపన్నుడు కావాలని ఆంతర్యం. ఇది అతిథి వ్యక్తిగత సౌశీల్యాన్ని తెలుపుతూంటే 'హిరణ్యస్రుక్' ఆయన లోక సర్వమానవ కల్యాణ సౌశీల్యాన్ని ప్రకటిస్తూంది. ఇట్టి శీల సంపద కలవాడే అతిథి. గృహస్థులకు సదా పూజనీయుడు.

3. శ్రద్ధా:- స్వయంగా సత్కర్మాచరణలో ఎలా శ్రద్ధకలిగియుంటాడో ఇతరులను సత్కర్మాచరణ పరాయణులుగా ప్రబోధన చేసేందుకు కూడ శ్రద్ధ కలిగినవాడై యుండాలి. అనగా తన సత్కర్మాచరణ ఫలాన్ని ఇతరులు కూడ పొందే విధంగా శ్రద్ధాళువై కృషిచేయాలి.

4. పితేవ పుత్రేభ్యః:- తండ్రి పుత్రులకువలె అని ఆమాటకర్థం. ఈ మాటపై

197

శ్రద్ధాళువు శబ్దానికి వివరణయే. ఇతరులను సన్మార్గవర్తులనుగా చేసే పనిని కేవలం మ్రొక్కుబడి పనిగా గాక తండ్రి కుమారులకు అత్యంత క్షమాబుద్ధితో జ్ఞానోపదేశకుడై సన్మార్గవర్తలను చేసే రీతిగా అతిథి ప్రవర్తించాలని భావం. అందుకే అట్టి సద్గుణ సంపన్నులను బాబాజీ అని పిలిచి ఆదరించడం మనం చూస్తూనే ఉన్నాం. అట్టి ఉత్తమ అతిథులను గృహస్థులు ఏ విధంగా సన్మానించాలో అథర్వణవేద మావిధంగా వివరించింది.

తద్య స్యైవం విద్వాన్ వ్రాత్యో- తిథిర్గృహానాగచ్ఛేత్ ॥

స్వయమేన మభ్యుదేత్య బ్రూయాత్ వ్రాత్యక్వా- వాత్సీర్వ్రాత్యోదకం।

వ్రాత్య తర్పయంతు వ్రాత్య యథా తే ప్రియం తథాస్తువ్రాత్య యథా తే।

వశస్తథాస్తు వ్రాత్య యథా తే నికామస్తథాస్త్వితి॥

"సదా వ్రతనిష్ఠుడైన అతిథి ఇంటికి వచ్చినపుడు గృహ యజమాని లేచి ఎదురేగి ఇలా పలకాలి "వ్రాత్య! ఎక్కడుంటారు? వ్రాత్య! ఈ నీటిని స్వీకరించండి. వ్రాత్య! దయ చూపండి. ప్రసన్నులుకండి. వ్రాత్య! మీకేది అభిమతమో ఇక్కడ అలాగే జరుగుతుంది వ్రాత్య! మీకేది ఇష్టమో అదే సమకూర్చబడుతుంది. వ్రాత్య! మీ కోరిక ఏదియో అది నెరవేర్చబడుతుంది."

ఇచ్చట వ్రాత్య శబ్దం పలుమారులు చెప్పబడింది. ప్రస్తుత మంత్రంలో చెప్పబడిన 'హిరణ్యస్రుక్' ఇచ్చటి వ్రాత్యశబ్దం సమానార్థకాలే. అట్టి అతిథి పుంగవులు రాగానే గృహస్థులకు కలిగే ఆనందమెట్టిదో అథర్వణవేదంలో ఇలా వర్ణింపబడింది.

ఇంకావుంది...

అరణ్యంలోని అన్ని జంతువులు ఈ శరభానికి భయపడి అన్ని దిక్కులకు పారిపోయాయి. ఆ శరభం ఆ ప్రాణులను చంపుతూ చాలా సంతోషించింది. అది మాంసం రుచి మరిగి ఫలాలను తినడానికి ఇష్టపడడం లేదు. ఇప్పుడు అది బలిష్ఠంగా ఉంది. దానికి తోడు రక్త పిపాస కలిగింది. కుక్కలకు ఉండే విశ్వాసం దానికి పోయి అది మునినే చంపాలని అనుకుంది. అది ఇలా ఆలోచించింది. ఇతనికి గొప్ప మహిమ ఉంది. కేవలం నోటి మాటతోనే, అన్ని ప్రాణులను భయపెట్టే శరభ మృగంగా మారిపోగలిగాను. ముని దగ్గర ఇంకా చాలా జంతువులు, పక్షులు ఉన్నాయి. అవి కూడా ఏనుగులకు, సింహాలకు భయపడుతూ జీవిస్తున్నాయి. ముని వాటిపైన దయతలచి వాటిని కూడా శరభాలుగా మార్చవచ్చు. పక్షులకు గరుత్మంతుని బలం ప్రసాదించవచ్చు. ముని అలా చేయక మానుపే నేను ఈ మునిని చంపేస్తాను. ముని చనిపోతే నన్నెవ్వరూ ఇక ఎదిరించలేరు".

అరణ్యంలోంచి వచ్చిన శరభం మునికి ఈ విషయం తన తపశ్శక్తి వలన తెలిసింది. అప్పుడు ఆ జ్ఞాని అయిన ముని ఆ కుక్కతో ఇలా అన్నాడు "నువ్వు కుక్కవు. తరువాత చిరుతపులివి అయ్యావు, పెద్దపులివి అయి, ఆ శరీరం నుండి ఏనుగువి అయ్యావు. ఏనుగు నుంచి సింహంగా మారి తర్వాత శరభమృగం అయ్యావు. నీ పట్ల స్నేహం కలిగిన నేను నీ జాతిని విస్మరించాను. పాపాత్ముడా! ఏ పాపం తెలియని నన్ను చంపాలని తలచావు కనుక నీవు నీ అసలు స్వరూపాన్ని పొందెదవు గాక" ఇలా అని ముని దాన్ని మరల కుక్కగా మార్చేశాడు" అది తన కుక్క రూపాన్ని తిరిగి పొందింది.

కుక్క రూపంలో అది చాలా దైన్యస్థితి పొందింది. అది ఋషిని దైన్యంగా తన మీద దయ చూపమని ప్రార్థించింది కాని ముని హుంకరించి దాన్ని తపోవనం నుండి వెళ్ళగొట్టాడు. కనుక ఎవరిపైన అయినా అనుగ్రహం, దయ చూపించే ముందు వారి పరిశుద్ధతను, స్వభావాన్ని ఋజుత్వాన్ని, సత్యవాదిత్వాన్ని వినయం, క్షమ మొదలైన గుణాలు ఉన్నవో లేవో పరీక్షించి అట్టి యోగ్యతగల వానిపై అనుగ్రహం చూపాలి. ఈ కొత్త శరభాన్ని చూసి భయపడి మరల అరణ్యంలోకి పారిపోయింది. ముని చేసిన శరభం సుఖంగా ముని ప్రక్కనే ఉండసాగింది.

ఉష్ణగ్రీవోపాఖ్యానము

పూర్వం సత్యయుగంలో ఒక ఒంటె ఉండేది. దానికి తన పూర్వ జన్మ జ్ఞానం ఉంది. అందువలన అది కఠోర నియమాలను పూని ఆ అరణ్యంలో గొప్ప తపస్సు చేసింది. దాని తపస్సుకు సంతృప్తి చెంది బ్రహ్మ దాని ముందర ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. అప్పుడు ఆ ఒంటె ఇలా ప్రార్థించింది. "దేవా! మీ దయవల్ల నా మెడ పొడవుగా సాగుగాక, దాని వల్ల యోజనాల మేరకు మేయడానికి మెడతో సాగగలను" అన్నది. బ్రహ్మ దానితో "అట్లే అగును" అని వరమిచ్చాడు. ఇలా మంచి వరాన్ని పొంది ఒంటి అరణ్యంలోకి వెళ్ళిపోయింది. కాని వరదానం వల్ల గర్వం వచ్చి ఆ ఒంటె సోమరి అయి మేతకు వెళ్ళడానికి ఇష్టం లేకపోయింది. అది తన పొడవైన మెడను కొన్ని యోజనాల వరకు సారించి విరామం లేకుండా మేయసాగింది. అంతలో పెద్ద గాలి దుమ్ము లేచింది. అప్పుడు ఒంటె తన మెడను ఒక గుహలో దాచింది. ఇంతలో పెద్ద వాన కురిసింది. అప్పుడు ఒక నక్క వర్షానికి వణుకుతూ భార్యతో సహా ఆ గుహలోకి వచ్చింది. మాంసం తినే నక్క గుహలో ఒంటె మెడను చూచి శుభ్రంగా దాన్ని తినేసింది. తనను ఏదో జంతువు తినేస్తోందని తెలుసుకొని ఒంటె ముడుచుకోవడానికి ప్రయత్నించింది. కాని అది పైకీ కిందకీ ఎంతదాకా మెడ కదిలిస్తోందో అంతవరకు నక్క తినేసి గాలివాన తగ్గగానే గుహనుండి వెళ్ళిపోయింది. ఈ విధంగా ఆ ఒంటె చనిపోయింది. కనుక సోమరితనం పనికిరాదు.

ఉష్ణగ్రీవోపాఖ్యానము

103



మహాభారతంలో ఉపాఖ్యానాలు

డాక్టర్ ముదిగొండ ఉమాదేవి



బుద్ధిబలంతో చేసేవి మధ్యమాలు, కాని బలంతో చేసేవి అధమాలు. బరువెత్తుకొనే పనులు అన్నిటికంటె అధమమైనవి.

త్రిపురాసుర వృత్తాంతం

దేవతలకూ అసురులకూ ఎల్లప్పుడూ ఒకరి నొకరు జయించాలనే కోరిక ఉండేది. అందుకని వారికి తారకామయం అనే యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో దేవతలు జయించారు. దైత్యులు ఓడిపోయారు. అప్పుడు తారకాసురుని ముగ్గురు కొడుకులు - తారకాక్షుడు, కమలాక్షుడు, విద్యున్మాలి అనేవారు ఘోర తపస్సు ఉత్తమ నియమనిష్ఠలతో చేశారు. వారు తపస్సుతో తమ శరీరాలను శుష్కింపజేశారు. ఇంద్రియ నిగ్రహం పాటించి సమాధి స్థితిలో ఉండిపోయారు. వారి తపస్సుకు మెచ్చి బ్రహ్మదేవుడు వారికి ప్రత్యక్షమై వరములు ఇవ్వదలిచాడు. అప్పుడు వారు ముగ్గురు కలిసి బ్రహ్మదేవుని ఇలా వరం కోరారు. 'సర్వప్రాణుల వల్ల మాకు చావు లేకుండా ఉండాలి".

అప్పుడు బ్రహ్మ వారితో ఇలా అన్నాడు "అసురులారా! అందరికీ అమరత్వం అసంభవం. కనుకక ఇంకేదైనా వరం కోరుకోండి".

అప్పుడు ఈ ముగ్గురు అసురులు చాలా సార్లు ఆలోచించి బ్రహ్మను ఇలా కోరారు "పితామహా! మాకు ఈ వరం ఇవ్వు. స్వేచ్ఛానుసారం వెళ్లే నగర ఆకార సుందర విమానాన్ని నిర్మించి అందులో నివసించకోరుతున్నాము. ఆ విమానం అభీష్టవస్తు సంపన్నం కావాలి. అది దేవదానవులు నాశనం చేయలేనిది కావాలి. ఆ మూడు పురాలు యక్షులు, రాక్షసులు, పన్నాగులు, ఇతరప్రాణులు, కృత్యలు, శస్త్రాలు, బ్రహ్మవేత్తల శాపాలతో నాశనం అవకుండా ఉండాలి". వారి మాటలు విన్న బ్రహ్మ మరల వారితో ఇలా అన్నాడు. "దైత్యులారా! కాలం తీరితే అన్నీ నశిస్తాయి. ప్రతి వానికి ఎప్పుడో ఒకప్పుడు మరణం తథ్యం. కనుక ఈ మూడు పురాల నాశనానికి ఇంకేమయినా కారణం కోరండి".

దైత్యులు ఇలా కోరారు. "దేవా! నీ అనుగ్రహం వలన మేము మూడు పురాలలో నివసిస్తాము. ఈ భూమండలమంతా సంచరిస్తాము. వేయి సంవత్సరాలకు ఒకసారి మేము ముగ్గురం కలుస్తాము. ఈ పురాలు మూడూ అప్పుడు కలుస్తాయి. ఏకమైన వీటిని ఒకే బాణంతో కొట్టే దేవశ్రేష్ఠుడు మా మృత్యుకారకుడు అవుతాడు". బ్రహ్మ "తథాస్తు" అన్నాడు.

ఆ తర్వాత మహాసుర మయుడు వారి కోసం మూడు పురాలను నిర్మించాడు. అందులో ఒకటి బంగారం, రెండవది వెండిది, మూడవది ఇనుపది. బంగారంతో నిర్మించింది స్వర్గలోకంలో ఉన్నది. వెండితో చేసిన పురము అంతరిక్షంలోను ఇనుముతో చేసినది భూమండలంలోను ఉన్నాయి. ఈ పురాలు మూడు పెద్ద పెద్ద భవంతులతో, క్రీడోద్యానాలతో, ప్రాకారాలు చక్కటి వాకిళ్లతో శోభించాయి. ఆ పురాలలో ఒక్కొక్కరు రాజు అయ్యారు. అందులో తారకాక్షుని నగరం సువర్ణమయం.

కమలాక్షునిది వెండిపురం. విద్యున్మాలిది ఇనుపది. ఈ విధంగా ఆ రాక్షసులు ముల్లోకాలను ఆక్రమించారు. 'ప్రజాపతి అంటే ఎవరు?' అని ప్రశ్నించారు. వారి దగ్గరకు కోట్లమంది దానవులు వచ్చి చేరారు. దేవతల దగ్గర ఓడిపోయిన దైత్యులు వారి దగ్గరకు వచ్చి చేరారు. మయుడు వారికి కావలసిన వస్తు సామగ్రిని సమకూర్చాడు. త్రిపురాసురులను ఆశ్రయించినవారు మనసులో ఏది కోరితే దాన్ని మయుడు సృష్టించి వారికిచ్చేవాడు. తారకాక్షుని కుమారుడు హరి. అతను తీవ్ర తపస్సు చేసి బ్రహ్మను మెప్పించి ఈ వరాన్ని కోరాడు.

-ఇంకావుంది

పరమహంస బోధామృతము

121. అహంకారము ఎట్లును అడగునట్లు నీకు కాన్పింపని యెడల 'దాసోహం' అను రూపమున దానిని నిలిచి యుండనిమ్ము. "నేను భగవంతుని కింకరుడను, నేను వాని భక్తుడను" అను అంకారమువలన నంతగా భయపడవలసినది లేదు. మిఠాయిలు అజీర్ణవాతమును గలిగింపవచ్చును, కాని కలకండ అట్టిది కాదు. భక్తుని 'దాసోహం' అను నహంకారమును పసివాని 'నేను' అను నహంకారమును -పుల్లతో నీటిపై గీచిన గీతవంటివి, అది ఎంతో సేపుండవు.

122. కలకండయందు ఇతరమగు తియ్యని వస్తువులవలె దుర్గుణములు లేని చందమున భగవంతుని కింకరుడనని , భక్తుడనని కాని భావించు పక్వమైన అహంకారములో దోషము లేదు, దానివలన హాని కలుగదు. కాని అపక్వమైన అహంకారము అట్టిది కాదు, దానివలన అనేక బాధలు కలుగును. పక్వమైన అహంకారమో, భగవత్ప్రాప్తిని గలుగజేయుచు భక్తియో గమనదగియున్నది.

123.'దాసోహం' అనుభావము కలవాని కామ క్రోధాదులు ఏ విధముగా నుండును? ఆ మనోభావన సత్యమును మనఃపూర్వకమునైన పక్షమును వాని పూర్వపు కామక్రోధాదులు పేరునకు మాత్రముండును. భగవంతుని దాసుడనను అహంకారము కాని, భక్తుడనను అహంకారము కాని నిలిచి యున్నను సాక్షాత్కారము పొందినవాడెవ్వనికి హాని చేయడు-చేయజాలడు. అట్టి అహంకారమున తానొక వ్యక్తినను విషయమంతయు హరించి పోవును. దాని పూర్వపు రూపు నిలిచియున్నను అది ఎవ్వనికిని హానిచేయజాలదు.

124.నీకు అహంభావమున్న యెడల భగవంతుని సేవకుడనియో పుత్రుడననియో భావన చేసి గర్వపడుము. మహాత్ములు శిశు స్వభావము గలవారై యుందురు. భగవంతుని మ్రోల వారెప్పుడును బిడ్డలే. కావున వారికి అహంభావము ఉండదు. వారి బలమంతయు భగవంతునిదే కాని వారిది కాదు. భగవంతుని నుండియే వారికి బలము లభించును.

125.సమస్తము ఈశ్వరేచ్ఛ చేతనే జరుగుచున్నదను దృఢ విశ్వాసము గలవాడు తాను ఈశ్వరుని చేతిలో కేవలము ఉపకరణమని భావించును. అట్టివాడీ జన్మమునందే ముక్తుడగును. సర్వేశ్వరా! నీవే నీ కార్యమును జేయుచుండ, వీరు, ఆహా! 'నేను జేయుచున్నాను' అందురు.

126.'నేనేరుగుదును' అని కాని, 'ఎరుగను' అని కాని పలుకుచున్నంతవరకు నరుడు తానొక వ్యక్తినని భావించుచుండును. "నీలోని యీ అహంకారమును పూర్తిగా నేను తొలగించినపుడే అఖండ బ్రహ్మ సాక్షాత్కారము సమాధి స్థితియందు గలుగగలదు" అని నా జగజ్జనని పలుకుచున్నది. అంతవరకు 'నేను' అనునది నాలోను నా యెదుటను గూడా నిలిచియే యుండును.

127.కామక్రోధాదులతో తీవ్రమైన పోరాటము సలిపి, ఆత్మజ్ఞానముకొరకై అఖండ సాధన చేసిన పిమ్మట గాని సమాధి స్థితి లభింపదు. అప్పుడే అహంకారము సపరివారముగా తరలిపోవును. కాని సమాధి స్థితిని బొందుట చాలా దుర్లభము. అహంకారమును వేయిసార్లు అణచినను మరల మరల తల యెత్తుచునే యుండును. దాని మూలముననే మరల మరల మనము ఈ లోకమున జన్మమెత్తుచుండుట!

128.ఈశ్వర సాక్షాత్కారము లభింపనిదే, క్షుద్రమైన లోహము పరుసవేది యొక్క స్పర్శచే బంగారముగా మారనిదే, 'నేను క ర్తను' అను భ్రమ తొలగదు. ఈ భ్రమ తొలగకుండునంత వరకు 'నేనీ సత్కార్యమును జేసితిని, ఆ దుష్కార్యమును జేసితిని' అను భేదభావము గలుగుచునేయుండును. ఈ భేదభావమే- ఈ భేద దృష్టియే మాయ- దీని మూలముననే సంసార భ్రమణము నిరంతరముగా సాగుచున్నది.

ఇంకావుంది...

శ్రీ రామకృష్ణ బోధామృతము - పరిశోధితమగు 112 మహోపదేశములుగల శ్రీరామకృష్ణ వాక్య రత్నాకరము - సంగ్రహ జీవిత సహితము - అనువాదకుడు: శ్రీ చిరంతనానందస్వామి


పోరాటము

'ఏలయనగా మనము పోరాడునది శరీరులతో కాదు, గానీ ప్రధానులతోను అధికారులతోను ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాథులతోను ఆకాశ మండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము.' - **ఎఫెసీ 6:12**

మీరు అపవాది తంత్రములను ఎదిరించుటకు శక్తిమంతులగునట్లు దేవుడిచ్చు సర్వాంగ కవచము ధరించుకొనుడి. ప్రభువు యొక్క మహాశక్తిని బట్టి ఆయన యందు బలవంతులై యుండుడి.

మనము పోరాడునది శరీరులతో కాదు. అంటే మనము పోరాడవలసింది మన కుటుంబీకులతో కాదు. ఇరుగు పొరుగు వారితో కాదు. ఆఫీసులో వారితో కాదు. వేరే ఊరి వారితో కాదు. వేరే పట్టణస్తులతో కాదు. రాష్ట్రాలతో కాదు. వేరే దేశాల వారితో కానేకాదు గాని అంధకార సంబంధులగు లోకనాథులతోను ఆకాశమండల మందున్న దురాత్మల సమూహములతో పోరాడవలసి యున్నది.

కానీ లోకములో ఎక్కడ చూసినా మనుషుల మధ్యనే ఎక్కువగా పోరాటాలు జరుగుతున్నాయి. దేశము మీదికి దేశము రాష్ట్రాల మీదికి రాష్ట్రాలు యుద్ధాలకు పాల్పడుతున్నాయి. అక్కడదాకా ఎందుకు ఒక ఇంటిలోనే సొంత అన్నదమ్ములకూ అక్కచెల్లెళ్లకూ మధ్య ఎన్ని గొడవలు.. ఎన్ని కోర్టు కేసులు నడుస్తున్నాయి.



దేవుడు మనుషులను ఎంతో గొప్పగా ప్రేమిస్తున్నాడు. ఆయన స్వహస్తాలతో ఆయన రూపులో చేసుకున్నాడు. ఆయన మహిమ కొరకు చేసుకున్నాడు. ఆయన ప్రాణానికి ప్రాణంగా మనలను ప్రేమించాడు. మానవునికి ఇచ్చిన ముఖ్యమైన ఆజ్ఞ ఒక్కటే. నేను మిమ్మును ప్రేమించినట్లే మీరును ఒకరినొకరు ప్రేమించుడి. ఒకరినొకరు ప్రేమించుకోవటానికి బదులు కరుచుకోవటం అరుచుకోవటం ఎక్కువైంది. దీన్నిబట్టి దేవుని మాట లెక్కచేయటం లేదని తెలుస్తుంది. మరెవరి మాట వింటున్నారు. ఎవరితో పోరాడుతున్నారు. దేవుని పోలికతో ఉన్న దేవుని బిడ్డలతో పోరాడుతున్నారు. అంటే దేవునితోనే పోరాడుతున్నారు.

సాతానుడు మనిషిని మోసము చేసి దేవునికీ మనకూ వైరము కలుగజేసి యున్నాడు. లోకమంతా ఈ మోసములో పడింది. ఇంకా పడుతూనే ఉంది.

'ఆదాము తన భార్యకు హవ్వ అని పేరు పెట్టెను. ఏలయనగా ఆమె జీవముగల ప్రతి దానికి తల్లి.' - **ఆది 3:20**

ఒకే తల్లీబిడ్డల మధ్య మోసముతో ద్వేషాన్ని వైరాన్ని కలుగజేశాడు సాతానుడు. సాతాను పని కేవలము మోసము చేయటమే. అబద్ధాల మాటలు మాయమాటలు చెప్పి లోకాన్ని మోసపరుస్తున్నాడు. రెండవది విడగొట్టుట - ఒకరికి ఒకరు సంబంధం లేకుండా చేయుట. మూడవది నాశనము చేయుట.

దేవుని ఆశీర్వాదము ఫలించి అభివృద్ధి చెందమని. సాతాను చేసిన పని నాశనము చేయుట. ముందు మోసముతో మంచి మంచి మాటలు చెప్పినా చివరకు అది నాశనమే.

దేవుని చిత్తము మనమందరము కలసిమెలసి ఉంటూ ఒకరినొకరు ప్రేమిస్తూ సాతానును ఎదిరించమని. వాడి మాయలో పడవద్దని. సాతాను మాయలో పడకుండా ఉండాలంటే ముందు దేవుని ప్రేమను, ఆయన మనలను ప్రేమించి చేసిన సిలువ యజ్ఞాన్ని నమ్మాలి. ఆయన మన పాపాల కొరకు మరణించాడని, మరణాన్ని గెలిచి లేచాడని నమ్మాలి. ఆయన మాటలను నమ్మాలి. ప్రభువు చెప్పింది చేయాలి. ఆయన మాటలే మనకు ఆయుధము. మనకు బలము. మనకు తెలివిని జ్ఞానాన్ని ప్రసాదిస్తాయి. యేసు ప్రభువు మాటలకు లోబడి అపవాదిని ఎదిరించాలి. అప్పుడు వాడు మన యొద్ద నుండి పారిపోతాడు. సాతాను ఒకప్పుడు దేవునితో ఉన్నాడు. వాడిని మన సొంత జ్ఞానముతో ఎదిరించటానికి లేక పోరాడటానికి ప్రయత్నించకూడదు. ఓడిపోతాము. సాతానుని ఎదిరించడానికి దేవుడిచ్చు సర్వాంగ కవచాన్ని ధరించుకోవాలి. దుష్టకాలములో ఉన్నాము కనుక ఎప్పుడు ఏమి సంభవిస్తుందో, ఎటువైపు నుంచి వస్తుందో ఏ రూపములో వస్తుందో? చిన్న రోదనలా, పెద్దపెద్ద రోదనలా ఏమీ తెలియదు. నాకు వచ్చే శోధన వేరు. నీకు వచ్చే శోధన వేరు. ఒక్కొక్కసారి ఈ శోధన చాలా ఫ్రెండ్లీగా సరదా సరదాగా ఉంటుంది. చివరకు కొంప ముంచుతుంది. సాతానుకు మనకు మధ్య ఉన్న పోరాటం ముఖాముఖి కాదు. మోసపూరిత పోరాటమిది. ముఖ్యంగా మన సొంత వారితోనే పోరాడేటట్లు సాతానుడు ప్రేరేపిస్తాడు. సొంత వాళ్ల చేతనే మోసాలు చేయిస్తాడు. ఇక మోసపోయిన వారు ఊరకుంటారా? పోరాటం మొదలౌతుంది. ఇది జీవితకాలం పట్టవచ్చు సరిచేయడానికి. ఇటువంటి సమయాల్లో దేవుని వైపు చూడాలి. ఆయన సలహాలు పాటించాలి.

❋ **సర్వాంగ కవచము:** నడుమునకు సత్యమనే దట్టి కట్టుకోవాలి. దేవుని వాక్యమే సత్యము. ప్రభువు చెప్పినట్లు నేనే మార్గము సత్యము జీవమని. ఆయనే సత్యము. ఆయన మాటలు సత్యము. సత్యమైన వాక్యమందు నిలిచిన వారైతే ప్రభువుకు శిష్యులమవుతాము. సత్యమేమిటో గ్రహించగలం. అప్పుడు సత్యము మనలను స్వతంత్రులుగా చేస్తుంది. ప్రేమ కలిగి సత్యము చెప్పుచు క్రీస్తు వలె ఉండుటకు అన్ని విషయములలో ఎదుగవలెను. అసత్యముతో ఉన్నప్పుడు ఎన్ని బంధకాలో. స్వాతంత్ర్యం కోల్పోతాం. అదే సత్యముగా ఉన్నప్పుడు ఎంత స్వేచ్ఛగా ఉంటుందో మనకు తెలుసు. సాతాను శక్తి నుండి తప్పించుకుని ఎదిరి నిలువగలము.

❋ **నీతి అనే మైమరుపు** (Breastplate of righteousness) తొడుగుకోవాలి. నీతియు యదార్థమైన భక్తియు గలవారై దేవుని పోలికగా సృష్టింపబడిన నవీన స్వభావమును ధరించుకొనవలెను. అవినీతితో పోరాడాలంటే నీతి కలిగి ఉండాలి. అంటే మన నీతి సరిపోదు. మానవుని నీతి దేవుని ముందు మురికిగుడ్డ లాంటిది. దీనిని బట్టి నీతి లేనట్టే. నీతి లేకుండా పోరాటం ఎవరితో. అది కేవలం దేవునికి వ్యతిరేకమే అవుతుంది. కాబట్టి క్రీస్తు నీతిని ధరించుకోవాలి. ఎందుకనగా మనమాయన యందు దేవుని నీతి యగునట్లు పాపమెరుగని ఆయనను మన కోసము పాపముగా చేసెను. దేవుని యందు విశ్వాసము వలననే, ఆయన ఆజ్ఞలు విని పాటించడం ద్వారా మనము నీతిమంతులము కాగలము. అబ్రహాము దేవుని నమ్మెను. అదే అతనికి నీతి అయింది. విశ్వాసము వలన వచ్చే నీతిని కలిగి ఉంటేనే సాతానును ఎదిరించగలము.

కాబట్టి నమ్మువారు ఆయన కృప చేతనే, క్రీస్తు యేసు నందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు. - **రోమా 3:24**

❋ పాదములకు సమాధాన సువార్త వలననైన సిద్ధ మనస్సును జోడు తొడుగుకొని నిలువబడుడి. యేసే మనకు సమాధానము. యేసును ధరించుకొన్న మనము సమాధానము కలిగి ఎక్కడకు వెళ్లినా ఎక్కడ ఉన్నా సమాధానాన్ని విడువకూడదు. మన సమాధానము క్రీస్తే. సువార్త క్రీస్తే. సమాధానము పొందుకున్న వారు క్రీస్తును కలిగినటువంటి వారు మాత్రమే ఈ పోరాటములో నిలువబడగలరు.

ప్రార్థన

- మద్దు పీటర్
9490651256

❋ **విశ్వాసమను డాలు:** సాతానుడు వేసే బాణాలు ఆర్పటానికి మనకు విశ్వాసమనే డాలు ఉండాలి. (Shield of Faith) ఎన్నో శోధనలు. భయపెట్టే ఆలోచనలు. పాపంలో పడిపోయే ఆశలు. కోరికలు పుట్టించి మనలను ఏదో విధంగా ఓడించి పాపములో పడగొట్టుతాడు. విశ్వాసమందు స్థిరంగా ఉంటేనే మనము ఈ పోరాటములో నిలువగలము. విశ్వాసము సన్నగిల్లినా కోల్పోయినా అపాయమే. మన దేవుడు ఎంత శక్తి కలవాడో, ఎంత జ్ఞానవంతుడో ఎంత సంపన్నుడో అన్నీ ఎరిగి ఉండాలి. ఎంత పరిశుద్ధుడో కూడా పూర్తిగా తెలిసి యుండాలి. విశ్వాస వీరుల సాక్ష్యాలు అనేకములు. వాటిలో కొన్నింటిని హెబ్రీయులకు వ్రాసిన పత్రిక పదకొండవ అధ్యాయములో చాలా తేటగా చూడగలము.

❋ **రక్షణయను శిరస్త్రాణము:** నీతిని కవచముగా ధరించుకొనెను. రక్షణను శిరస్త్రాణంగా తలమీద ధరించుకొనెను - యెషయా 59:17

మనము పగటి వారమై యున్నాము గనుక మత్తులమై యుండక, విశ్వాస ప్రేమలను కవచము రక్షణ నిరీక్షణ యను శిరస్త్రాణములను ధరించుకొందము. - **1 థెస్స 5:8**

రక్షణను గూర్చిన ఆలోచన మనసులో ఉండాలి. పాపము నుండి రక్షింపబడ్డామని గుర్తించాలి. క్రీస్తులో రక్షింపబడిన సంగతి మనము మరువకూడదు. ఆయనే మన అండ. కోట. కొండ. ఆశ్రయ దుర్గము. మనల్ని కాపాడువాడు కునుకడు నిద్రపోడు అనే సంగతి మరువకూడదు. మరణాన్ని గెల్చి లేచిన క్రీస్తు మన రక్షణ అని మరువక ఎల్లప్పుడు జ్ఞాపకముంచుకోవాలి.

❋ దేవుని వాక్యమనే ఆత్మ ఖడ్గమును ధరించుకొనుడి. ఆత్మఖడ్గము మనలను మనం రక్షించుకోవటానికి, శత్రువులను సంహరించటానికి ఉపయోగపడుతుంది. యేసు ప్రభువు మానవునిగా ఉన్నప్పుడు వాక్య ఖడ్గముతో సాతానును ఓడించుట మనకు ఒక మాదిరి. మనము కూడా క్రీస్తు మాటల యందు విశ్వాసముతో శత్రువును ఓడించవచ్చు. శ్రమలలో శోధనలలో వాక్య ఖడ్గమును ఎలా ఉపయోగించాలో తెలిసికొని వ్యవహరించాలి. కాబట్టి బైబిల్‌లో ఉన్న మాటలన్నిటిని నమ్మాలి. చదవాలి. గ్రహించాలి. పాటించాలి. అప్పుడే వాక్యము మనలను సాతానుని బలము నుండి కాపాడుతుంది.

ఈ పోరాటములో నీలోఉన్న దేవుని శక్తి నీకు తెలియాలి. మరణాన్ని గెలిచాడు. సాతానును ఓడించాడు అన్న సంగతి నీకు స్పష్టంగా అర్థమవ్వాలి. దేవుని చేతిలో ఓడిపోయిన సాతాను మాయోపాయము చేత మనలను మోసపరచనీయకుండా చూసుకోవాలి. సర్వాంగ కవచము తలకు ఉంది. నడుముకు ఉంది. చేతికి ఉంది. కాళ్లకు కూడా ఉంది. కానీ, మన వీపునకు కవచము లేదు గనుక ఎట్టి పరిస్థితులలో వెనుకకు తిరుగకూడదు. ఓడిపోతాము. ఓడిపోయి సాతానుని చేతిలో ఓడిపోకుండా ఈ పోరాటంలో నిలిచి గెలిచి దేవుని మహిమ పరచటానికి పరిశుద్ధాత్మ దేవుడు మనకు సహాయము చేయును గాక.

దేవునికి యుగయుగములకు మహిమ కలుగును గాక. ■

ఆంధ్రభూమి

చిత్రభూమి

జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!

శనివారం 19, జనవరి 2019

సెట్స్‌పైకి ‘భీష్మ’!

‘ఛలో’ దర్శకుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్ హీరోగా ‘భీష్మ’ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి ‘సింగిల్ ఫరెవర్’ అనేది ఉప శీర్షిక. ‘ఛలో’ మాదిరిగానే ఈ చిత్రాన్నీ వెంకీ ఎంటర్‌టైనింగ్‌గా మలచనున్నాడట. కాగా సినిమాకి సంబంధించి ప్రీప్రొడక్షన్ వర్క్ పూర్తైంది. ఇక ఈ నెలాఖర్లోనే సినిమా షూట్‌కి వెళ్ళబోతున్నట్లు తెలుస్తోంది. కాగా నితిన్ లాస్ట్ సినిమా శ్రీనివాస కళ్యాణం ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. దాంతో నితిన్, భీష్మ చిత్రంపై మరింత దృష్టిపెట్టారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణసంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మించనున్నారు. ఈ చిత్రంలో నితిన్ సరసన రష్మిక మండన్నా హీరోయిన్‌గా నటిస్తోంది.





మళ్లీ చిరుతో..


మెగాస్టార్ చిరంజీవికి హీరోయిన్ సెట్టైపోయింది. ప్రస్తుతం సైరా షూటింగ్‌లో బిజీగా వున్న చిరు, తరువాతి ప్రాజెక్టుకూ ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాడు. టాప్ డైరెక్టర్ కొరటాలతో ప్రాజెక్టు కన్ఫర్మ్ అయిన నేపథ్యంలో -హీరోయిన్‌గా మళ్లీ నయన్‌కే అవకాశం ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. వాస్తవానికి సీనియర్ హీరోల సరసన చాలా తక్కువ చిత్రాలను ఒప్పుకునే నయన్, కుర్ర హీరోల ప్రాజెక్టులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ వచ్చేది. అలాంటి టైంలో ఫస్ట్‌టైమ్ మెగాస్టార్‌తో ‘సైరా’లో జోడీకట్టింది. చిరంజీవి ఇమేజ్‌ను బ్యాలెన్స్ చేయగల సీనియర్ హీరోయిన్‌గా నయన్‌కే కొరటాల టీం ఎక్కువ మార్కులు వేసినట్టు తెలుస్తోంది. అంతకుముందు ఖైదీ నెంబర్ 150లో చిరుతో జోడీ కట్టిన కాజల్‌ను లీడ్‌రోల్‌కు అనుకున్నా, తరువాత అనుష్క, శ్రియ, త్రిషల పేర్లూ పరిశీలనకు వచ్చాయి. ఒకింత ఇమేజ్‌తో కంటిన్యూ అవుతున్న సీనియర్ హీరోయిన్లు చాలా తక్కువ ఉండటంతో, ఉన్నవాళ్లనుంచే చిరుకు జోడీని వెతకాల్సి వచ్చింది. బాలీవుడ్ భామ ఎవరైనా చిరుతో జోడీ కట్టే అవకాశాలూ లేకపోలేదంటూ కథనాలు వినిపించినా -కొరటాల టీం ఆసక్తి చూపించినట్టు కనిపించలేదు. సో, సైరాలో చిరుకు సమవుజ్జీ అనిపించుకున్న నయనతారనే తరువాతి ప్రాజెక్టుకూ తీసుకోవాలని కొరటాల ఆలోచిస్తున్నట్టు టాక్. సీనియర్ హీరోయిన్‌గా దక్షిణాదిన ఆమెకున్న ఇమేజ్‌నూ పరిగణనలోకి తీసుకుని -ఆమెతో సంప్రతింపులు జరుపుతున్నట్టు ఇండస్ట్రీ సమాచారం.

మళ్లీ.. ఎక్కుపెట్టాడు!

దిగ్గజ దర్శకుడు శంకర్ మరో సెన్సేషన్ సృష్టించేందుకు శుక్రవారం ముహూర్తం నిర్ణయించుకున్నాడు. విలక్షణ నటుడు కమల్‌హాసన్ -శంకర్ కాంబినేషన్ వస్తున్న భారతీయుడు -2 సినిమా షూటింగ్ పూజా కార్యక్రమాన్ని శుక్రవారం చెన్నైలో నిర్వహించారు. చిత్రంలో కమల్‌తో జోడీ కడుతున్న హీరోయిన్ కాజల్ అగర్వాల్ ఈ విషయాన్ని ట్విటర్ ద్వారా వెల్లడిస్తూ పూజా కార్యక్రమం ఫొటోను అభిమానులతో పంచుకుంది. పూజా కార్యక్రమంలో కమల్ ఖాకీ దుస్తులు ధరించి ఉండటం విశేషం. చిత్రీకరణ మొదలుపెట్టిన నేపథ్యంలో సినిమాకు సంబంధించి వివిధ రకాల గెటప్పులతో ప్రమోషన్ పోస్టర్లను చిత్రబృందం అభిమానులతో పంచుకుంటోంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూరుస్తుంటే, లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాష్‌కరణ్ నిర్మాతగా తెరకెక్కిస్తున్నారు. 22ఏళ్ల క్రితం వచ్చిన భారతీయుడు చిత్రానికి సీక్వెల్ మొదలవ్వడంతో -ట్రేడ్ వర్గాల్లో ఆసక్తి మొదలైంది. అటు శంకర్, ఇటు కమల్ అభిమానుల్లోనూ ఆసక్తి కనిపిస్తోంది. భారతీయుడిని గుర్తు చేస్తూ విడుదల చేసిన సీక్వెల్ ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన రావడం తెలిసిందే. అలాగే, ఈ ప్రాజెక్టులో ముఖ్యభాగమైన వర్మ కళ అనే విద్యను ప్రాక్టీస్ చేస్తున్నట్టు కాజల్ చెప్పుకుంటోంది కూడా.

అదీ అసలు కారణం..

ఇదిలావుంటే -అసలు భారతీయుడు చిత్రం తెరకెక్కించడానికి ముఖ్య కారణాన్ని దర్శకుడు శంకర్ రివీల్ చేశాడు. శంకర్ -కమల్ కాంబోలో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన భారతీయుడు కథను రాసుకోవడానికి ముఖ్య కారణం -లంచమేనట. శంకర్ చదువుకుంటున్న రోజుల్లో కళాశాల ఆడ్మిషన్ కోసం వెళ్తే అక్కడి యాజమాన్యం ధృవీకరణ పత్రాలు అడిగిందట. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం అధికారుల వద్దకు వెళ్తే లంచం డిమాండ్ చేశారట. అప్పుడు పడిన బీజం నుంచే భారతీయుడు కథ పుట్టుకొచ్చిందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో శంకర్ వెల్లడించాడు. అంతేకాదు -సమాజంలో ప్రతి సామాన్యుడూ ఎదుర్కొంటున్న సమస్యనే భారతీయుడు -2లోనూ చూపించనున్నట్టు ప్రకటించేశాడు. ఏ ప్రాజెక్టునైనా సుదీర్ఘంగా నడిపించే శంకర్ -ఈ ప్రాజెక్టును మాత్రం సాధ్యమైనంత వరకూ ఈ ఏడాదిలోనే పూర్తిచేసి విడుదల చేయాలన్న తలంపుతో ఉన్నాడట.





హీరోస్ ఫ్రెండ్షిప్..

అఖిల్ అక్కినేని హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో భారీ నిర్మాత బివిఎస్‌ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ‘మిస్టర్ మజ్ను’. థమన్ సంగీత సారథ్యంలో రూపొందిన ఆడియో ఇటీవల విడుదలై సూపర్‌హిట్టయ్యింది. చిత్రంలోని అన్ని పాటలకు శ్రోతలనుంచి ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. కాగా చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను నేడు హైదరాబాద్‌లోని జెఆర్‌సి కన్వెన్షన్ సెంటర్‌లో గ్రాండ్‌గా నిర్వహించనున్నారు. వేడుకకు యంగ్ టైగర్ ఎన్టీఆర్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారు. చిత్రాన్ని రిపబ్లిక్‌డే సందర్భంగా ఒకరోజు ముందు జనవరి 25న ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అఖిల్ అక్కినేని సరసన నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రంలో నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.



బోయపాటితో బాలయ్య?



నందమూరి బాలకృష్ణ నెక్స్ట్ సినిమా కోసం రంగం సిద్ధం చేస్తున్నాడు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న చిత్రానికి మాస్ దర్శకుడు బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తాడని టాక్. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సింహా, లెజెండ్ చిత్రాలు సంచలన విజయం అందుకోవడంతో హ్యాట్రిక్ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే బోయపాటి శ్రీను తాజాగా రామ్‌చరణ్‌తో తెరకెక్కించిన వినయ విధేయ రామ ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేదు. ముఖ్యంగా ఈ సినిమాలో కొన్ని సన్నివేశాలు టూమచ్‌గా ఉన్నాయంటూ మెగాఫ్యాన్స్ ఫైర్ అవుతున్నారు. కేవలం యాక్షన్ కోసమే సినిమా చేసినట్టు ఉందంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇక నెక్స్ట్ సినిమా విషయంలో అప్పుడే సన్నాహాలు మొదలుపెట్టిన బోయపాటి ఈ సినిమాలో బాలయ్యతో డ్యూయెల్ రోల్ చేయస్తాడంటూ ప్రచారం జరుగుతుంది. ఫిబ్రవరిలో ఈ సినిమా సెట్స్‌పైకి రానుంది.




గామివైపు నాగ్‌అశ్విన్

మహానటి తర్వాత ఇంతవరకూ మరో కొత్త మూవీకి శ్రీకారం చుట్టలేదు దర్శకుడు నాగ్‌అశ్విన్. తాజాగా అతడి కన్ను క్రౌడ్ ఫండింగ్‌తో రూపొందుతున్న గామీపై పడింది. కొత్త దర్శకుడు విద్యాధర్ దీన్ని రూపొందిస్తున్నాడు. వినూత్నమైన కాన్సెప్ట్‌తో రూపొందుతున్న క్రౌడ్ ఫండింగ్ సినిమాకు సంబంధించిన డీటైలింగ్ చూసి ఆశ్చర్యపోయిన నాగ్‌అశ్విన్, తనవంతు సహాయ సహకారాలు అందించడానికి ముందుకొచ్చాడు. గత ఏడాది అక్టోబర్‌లో చిత్రీకరణ మొదలైంది. ఓ వీడియోను ట్విట్టర్ ద్వారా పంచుకున్న అశ్విన్, ఇలాంటి వీడియోస్‌ని సాధారణంగా హాలీవుడ్‌లో చూస్తుంటాం. ఈ చిత్రాన్ని కార్తీక్ నిర్మిస్తున్నారు. టీమ్‌వర్క్ చూశాక తెలుగులో ఇదొక కొత్త ప్రయోగం అవుతుందని నమ్ముతున్నాను’ అన్నాడు. మూవీ క్రౌడ్ ఫండింగ్‌కు తనవంతు సాయం చేస్తానంటున్నాడు కూడా.

రాజస్థాన్‌కు చిన్నా..

గోపీచంద్ అంటేనే యాక్షన్. ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్ స్టోరీలకు యాక్షన్ ఎపిసోడ్స్ జతచేసి -ఫ్యామిలీ ఆడియన్స్‌కీ దగ్గరయ్యాడు. ఒక టైంలో గోపీచంద్ చేసిన కథలన్నీ మాస్, ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరించినవే. మధ్యలో ట్రాక్ తప్పిన గోపీచంద్‌తో -సక్సెస్ దోబూచులాడుతోంది. కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌పైకి తెచ్చే ఒక్కటంటే ఒక్క హిట్టూ చిన్నాకు దొరకడం లేదు. గౌతంనందా, ఆరడుగుల బుల్లెట్, ఆక్సిజన్, పంతం.. ఇలా వరుస ప్రాజెక్టులన్నీ తీవ్ర నిరాశకు గురి చేస్తుండటంతో -తదుపరి ప్రాజెక్టు విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటానంటూ ప్రకటించడం తెలిసిందే. తాజాగా దర్శకుడు తిరుతో కలిసి ప్రాజెక్టు తెరకెక్కించేందుకు సిద్ధమైన గోపీచంద్ -వైవిధ్యమైన కథ, పాత్రలో కొత్తదనం ఉండేలా చూసుకున్నాడని చెబుతున్నారు. సహజంగా గోపీచంద్ చిత్రాల టైటిళ్లన్నీ మూడక్షరాలతోనో, సున్నతో ముగిసేలాగనో ఉంటుంటాయి. అయితే కొత్త ప్రాజెక్టు విషయంలో టైటిల్ ఇంకా ప్రకటించని టీం -ఫస్ట్ షెడ్యూల్‌ను ముందు ప్రకటించినట్టే రాజస్థాన్‌లో ప్లాన్ చేశారట. ఈనెల 21నుంచి అతి పెద్ద షెడ్యూల్‌ను 45రోజులపాటు రాజస్థాన్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు సమాచారం. సినిమాలోని ప్రధానమైన యాక్షన్ ఎపిసోడ్స్‌ను అక్కడ చిత్రీకరిస్తారని తెలుస్తోంది. ఈ ప్రాజెక్టులో గోపీచంద్‌తో ఇద్దరు బ్యూటీలు జతకట్టనున్నారు. వారి వివరాలు త్వరలోనే చిత్ర బృందం ప్రకటించే అవకాశం ఉంది.





నన్ను.. రెచ్చగొట్టొద్దు!

వచ్చేవారమే -ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ థియేటర్లకు వస్తోంది. ఈనేపథ్యంలో కర్ణి సేన కార్యకర్తలు ఆందోళనను తీవ్రతరం చేస్తున్నారు. సినిమాను థియేటర్లలో ఆడనిచ్చేది లేదంటూ బెదిరింపులు చేస్తున్నారు. బాలీవుడ్ నటి కంగనా రనౌత్ ప్రతిష్టాత్మకంగా చేసిన ‘మణికర్ణిక’ 25న విడుదల కానున్న నేపథ్యంలో, చిత్రాన్ని ఆపాలంటూ కర్ణిసేన కార్యకర్తలు గొంతు పెంచుతున్నారు. ఓ బ్రిటీష్ వ్యక్తితో లక్ష్మీబాయి ప్రేమలో పడినట్టు చిత్రంలో సన్నివేశం పెట్టారని, ఇది చరిత్రను కించపర్చడమే అవుతుందని, అలాంటి సన్నివేశాలను తొలగించకుంటే తీవ్ర పరిణామాలు తప్పవంటూ మహారాష్ట్రకు చెందిన కర్ణిసేనలు కొంతకాలంగా ఆందోళనలు, బెదిరింపులకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. సినిమా విడుదల సమయం దగ్గరపడిన సమయంలో బెదిరింపులు తీవ్రం కావడంతో, ట్విట్టర్ వేదికగా కంగన స్పందించింది. ‘మణికర్ణిక కథను నలుగురు చరిత్రకారులు ఆమోదించారు. సెన్సార్ బోర్డు సైతం సర్టిఫికేట్ జారీ చేసింది. స్వార్థ ప్రయోజనాలతో కర్ణిసేన చేపట్టిన ఆందోళనలు ఆపకుంటే -వారి మార్గంలోనే నేనూ ప్రయాణించాల్సి ఉంటుంది. రాజ్‌పుత్ బిడ్డగా వారందరినీ నాశనం చేస్తాను’ అంటూ తీవ్ర స్వరాన్ని వినిపించింది. అయితే దీనిపై కర్ణిసేన జాతీయ నాయకుడు సుఖ్‌దేవ్ సింగ్ షెకావత్ సైతం గట్టిగానే స్పందిస్తున్నాడు. ‘మా ఆందోళనలకు మళ్లీ సమయం ఆసన్నమైంది. లక్ష్మీబాయి చరిత్రను వక్రీకరించేలా నిర్మాతలు కొన్ని సన్నివేశాలను చిత్రీకరించటంలో అతి స్వేచ్ఛ తీసుకున్నట్టు కనిపించింది. ఈ వైఖరిని మేము ఆమోదించలేం. ఇప్పుడు అడ్డుకోకుంటా -సినిమాల పేరిట చరిత్ర మొత్తాన్ని వక్రీకరించే ప్రమాదం ఉంది’ అని వ్యాఖ్యానించాడు. గత ఏడాది దీపిక పదుకొనె లీడ్ రోల్‌గా చేసిన ‘పద్మావతి’ ప్రాజెక్టునూ కర్ణిసేన సంఘాలు క్షేత్రస్థాయిలో వ్యతిరేకించాయి. అయితే సుప్రీం కోర్టు జోక్యంతో ఎలాంటి ఆటంకాలు లేకుండా పద్మావత్ చిత్రం థియేటర్లకు రావడం తెలిసిందే. ఇదిలావుంటే, మణికర్ణిక చిత్రాన్ని భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వీక్షించనున్నారు. దీనికోసం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఈ చిత్ర నిర్మాణ సంస్థ ప్రత్యేక ఏర్పాటు చేసింది. ప్రత్యేక ప్రదర్శనకు పలువురు రాజకీయ ప్రముఖులూ హాజరవుతున్నారు.

పాప్ స్టార్‌తో చిందులు

బాహుబలి తర్వాత డార్లింగ్ ప్రభాస్ నటిస్తున్న మూవీ సాహో. బాలీవుడ్ నటి శ్రద్ధాకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రానికి సుజీత్ దర్శకుడు. షూటింగ్ 80 శాతం పూర్తిచేశారు. తాజాగా ఒక ఐటెం సాంగ్‌ను చిత్రీకరించనున్నారు.

దీనికోసం పాప్ స్టార్ బెయాన్స్‌ను తీసుకున్నారట. అంటే ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్న బెయాన్‌తో ప్రభాస్ చిందేయనున్నాడన్న మాట. ఈ సాంగ్‌ను వందలాది బ్రెజిలీయన్స్ డ్యాన్సర్స్‌తో భారీ సెట్‌లో షూట్ చేస్తారట. ఇప్పటివరకు ఇండియన్ సినిమా చరిత్రలో ఇలా సింగర్‌తో డాన్స్ చేయించడం మొదటిసారి. ఈ సాంగ్‌కి వైభవి మర్చంట్ కొరియోగ్రఫీ అందించనున్నారు.

